16 వేల మంది విదేశీయులను
తిప్పి పంపే యోచన?
దేశంలోకి అక్రమంగా వచ్చినట్లు గుర్తింపు
ఇప్పటికే వారందరూ నిర్బంధంలో..
'వలసలు, విదేశీయుల చట్టం-2025'
కింద చర్యలు తీసుకోనున్న కేంద్రం
2

www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 66
సంచిక (Issue) : 153

బుధవారం | 17-9-2025 | పేజీలు: 14

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం, తిథి: ఏకాదశి రా.11:40 తదుపరి ద్వాదశి, నక్షత్రం: పునర్వసు ఉ.6.26 తదుపరి పుష్యమి, వర్జ్యం: మ.2:28-4:04, దుర్ముహూర్తం: ఉ.11:45-12:33, అమృతఘడియలు: రా.12:06-1:42, రాహుకాలం: మ.12:00-1:30, సూర్యోదయం: 6:06, సూర్యాస్తమయం: 6:12

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



మంగళవారం కలెక్టర్లు, ఎస్పీల సదస్సులో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. పక్కన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ఏకపక్షంగా ఎలా కొట్టేస్తారు?



13 ఎఫ్ఐఆర్‌లను రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం ఆగ్రహం

- చట్టాలను ఇంత దారుణంగా అన్వయించుకుంటారా?
- ఏ సెక్షన్ల కింద కేసులు పెట్టారో కూడా చూడరా?
- దర్యాప్తులో ఏం జరుగుతోందో పట్టించుకోరా?
- వాటిపై తదుపరి విచారణ కొనసాగించవచ్చు
- చార్జిషీట్ల దాఖలుకూ ఏసీబీకి అనుమతి
- హైకోర్టు ఉత్తర్వులు మరే కేసులకూ వర్తించవు
- బెంచ్ స్పష్టీకరణ.. విచారణ 6 వారాలకు వాయిదా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏసీబీ విజయవాడ సెంట్రల్ ఇన్వెస్టిగేటివ్ యూనిట్(సీఐయూ)లో నమోదైన 13 ఎఫ్ఐఆర్‌లను హైకోర్టు ఒకేసారి ఏకపక్షంగా రద్దు చేయడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అక్రమాస్తుల కేసులను ఏకపక్షంగా ఎలా

మిగతా 13వ పేజీలో...



నాన్చొద్దు.. తేల్చండి

రెవెన్యూ తీరు మారాల్సిందే: సీఎం

- సెక్రటరీలు ఇంకా రిపోర్టులు అడుగుతున్నారు
- ప్రజలను కలెక్టర్లు ఆఫీస్‌లకు పిలుస్తున్నారు
- కాలయాపన పనులు వెంటనే కట్టిపెట్టండి
- వాట్సాప్ గవర్నెన్స్‌తో సమస్యలన్నీ తీరాలి
- ప్రజాసేవలకూ రేటింగ్ విధానం తీసుకొస్తాం
- కేంద్రం తరహాలో పరీక్ష పెట్టి పదోన్నతులు
- సీనియర్ అధికారులూ తీరు మార్చుకోవాలి
- కలెక్టర్ల సదస్సులో చంద్రబాబు సీరియస్

అమరావతి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజాసేవలను అందించడంలో రెవెన్యూ శాఖ తీరు ఎంతకూ మారడం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు అసహనం వ్యక్తం చేశారు. ప్రజల్లో ఈశాఖపై 70శాతం అసంతృప్తి వ్యక్తమవుతోందని తెలిపారు. వెలగపూడి సచివాలయంలో మంగళవారం రెండోరోజు జిల్లా కలెక్టర్ల సదస్సులో రియల్ టైమ్ గవర్నెన్స్, మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ పనితీరును సీఎం చంద్రబాబు సమీక్షించారు. "మార్కెట్లో వస్తువు రేటింగ్‌ను

మిగతా 13వ పేజీలో...

సంతృప్తి పెరగాలి!

- పెన్షన్లు, దీపం-2 పంపిణీకి డబ్బుల డిమాండ్
- ప్రసాదాల్లో నాణ్యతపై 76% సంతృప్తి
- ఇసుక అందుబాటుపై 65.6% సంతృప్తి

ఆర్‌టీజీఎస్ సర్వే

సారు మారారు!

- టైమ్ కీపర్ అవతారం ఎత్తిన బాబు.. అతి ప్రసంగాలకు ఆదిలోనే చెక్
- సూటిగా ప్రభుత్వ ప్రాధాన్యాల వివరణ.. సుత్తిలేకుండా ఎజెండాపైనే ఫోకస్
- శాఖల ప్రజంటేషన్లూ ఆ దిశలోనే.. 2 రోజులూ పక్కాగా షెడ్యూల్
- 'మారిన చంద్రబాబు'ను చూసి కలెక్టర్లు, అధికారుల ఆనందం

12 13

అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన

ఇవే మన ఫోకస్ పాయింట్లు

- 3 నెలల్లో గొప్ప మార్పు కనిపించాలి
- ప్రతి సోమవారం సమీక్షిస్తా: చంద్రబాబు

జీఎస్టీ లబ్ధి ప్రజలకు అందాలి

- తగ్గింపుతో రాష్ట్ర ప్రజలకు 8 వేల కోట్ల ప్రయోజనం
- రవాణా ఖర్చులతో ఇసుక తీసుకెళ్తే అడ్డుకోవద్దు
- అభ్యంతరాల్లేని భూములు రెగ్యులరైజ్ చేయాలి
- రెండో రోజు కలెక్టర్ల సదస్సులో సీఎం నిర్దేశం

నేరాలు 33 శాతం తగ్గాలి

- రాష్ట్రంలో సైబర్ నేరాలు 16 శాతం పెరిగాయి
- సైబర్ నేరగాళ్ల కంటే పోలీసులు అడ్వాన్స్‌డ్‌గా ఉండాలి.. ఎస్పీలతో సీఎం చంద్రబాబు

సేమ్ టు షేమ్!

- మద్యమే ఆదాయ మార్గం.. ఛత్తీస్‌గఢ్ స్కామ్‌తో ఏపీకి పోలికలు
- అక్కడా ఇక్కడా ప్రభుత్వ దుకాణాలే.. నేతల నుంచి అధికారుల దాకా కుమ్మక్కు
- ఛత్తీస్‌గఢ్ స్కామ్‌పై ఈడీ దర్యాప్తు.. ఏకంగా మాజీ సీఎం తనయుడి అరెస్టు
- చైతన్య బాఘేల్‌పై 7 వేల పేజీలతో చార్జిషీటు
- ఏపీ దోపిడీని పట్టించుకోని ఈడీ.. సిట్ విచారణలో వెలుగుచూస్తున్న నిజాలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)



ఒకదానిని మించింది మరొకటి! ఢిల్లీలో వంద కోట్లు... ఛత్తీస్‌గఢ్‌లో రూ.2500 కోట్లు... ఏపీలో ఏకంగా రూ.3500 కోట్లపై మాటే! అన్నీ లిక్కర్ స్కాములే! కాస్త అటూ ఇటుగా దేశంలో ఒకే సమయంలో మూడు రాష్ట్రాల్లో 'మద్యం' నుంచి నేతలు సొమ్ములు పిండుకున్నారు. వీటిలో స్కామ్‌లకే స్కామ్... దేశ చరిత్రలోనే అతి పెద్ద స్కామ్‌గా చెప్పుకోదగ్గది ఏపీలో జగన్ హయాంలో జరిగింది. ఢిల్లీలో అప్పటి ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను

మిగతా 11వ పేజీలో...



నరేంద్రుడి జైత్రయాత్ర

- నేడు ప్రధాని నరేంద్ర మోదీ 75వ జన్మదినం
- గుజరాత్ సీఎంగా 13.. దేశ ప్రధానిగా 11 ఏళ్లు
- 4 దశాబ్దాల ఆయన రాజకీయ ప్రస్థానంలో.. ఎన్నెన్నో ప్రశంసలు.. అంతకు మించి విమర్శలు

మోదీకి ట్రంప్ బర్త్‌డే విషెస్.. థ్యాంక్యూ మై ఫ్రెండ్ అన్న మోదీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దేశ రాజకీయాలలో ఆయనను కోట్లాదిమంది తమ ఆరాధ్య దైవంగా భావిస్తారు. ఆయన దేశభక్తికి తిరుగులేదని, కుటుంబంతో సహా సర్వస్వాన్నీ త్యాగం చేసి దేశాన్ని అగ్రరాజ్యంగా మార్చేందుకు అహర్నిశలూ కృషి చేస్తుంటారని వారు భావిస్తుంటారు. అదే సమయంలో.. ఆయన దేశంలో ప్రజల మధ్య చిచ్చు పెడతారని, విద్వేష భావాలు రెచ్చగొడతారని, అనేక తప్పుడు నిర్ణయాలు తీసుకుని దేశాన్ని వెనక్కి నడిపిస్తారని మరికొంత మంది తీవ్రంగా విమర్శిస్తుంటారు. ఆయనెవరో కాదు.. పదమూడేళ్ల గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలను నిర్వర్తించి, గత పదకొండు సంవత్సరాలుగా దేశ ప్రధానిగా వ్యవహరిస్తున్న నరేంద్ర దామోదర్ దాస్ మోదీ. దేశ రాజకీయాలపైనే కాదు.. ప్రజల మనోభావాలపై

మిగతా 2వ పేజీలో...

వివేకా హత్య కేసులో తదుపరి దర్యాప్తునకు సిద్ధం

కోర్టు ఆదేశిస్తే ముందుకెళతాం.. సుప్రీంకు సీబీఐ స్పష్టీకరణ



- సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని సునీతా రెడ్డికి నిర్దేశం
- దానిపై 8 వారాల్లో నిర్ణయించాలి
- అప్పటిదాకా బెయిల్ రద్దు పిటిషన్లు పెండింగ్: సుప్రీం
- అసలు దోషులు తేలేందుకు ఇంకా దర్యాప్తు జరగాలి: లూథ్రా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, జగన్ బాబాయ్ వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సీబీఐ స్పష్టం చేసింది. ఈ విషయంలో కోర్టు ఆదేశాల మేరకు నడుచుకుంటామని తెలిపింది. ఈ కేసులో తమ దర్యాప్తు ముగిసిందని సీబీఐ పేర్కొనగా... హత్యతో ముడిపడిన ఆర్థిక, ఇతర కీలక అంశాలపై మరింత దర్యాప్తు అవసరమని వివేకా కుమార్తె సునీత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అలాగే... ఈ కేసులో నిందితులు వైఎస్ అవినాశ్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, వైఎస్ భాస్కర్ రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి సహా పలువురికిచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ సునీతారెడ్డి, సీబీఐ దాఖలు చేసిన అన్ని పిటిషన్లపైనా మంగళవారం జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ సతీశ్‌చంద్రశర్మతో కూడిన ధర్మాసనం విచారణ

మిగతా 14వ పేజీలో...

అమరావతిలో తెలుగు అధ్యయన కేంద్రం

14

- తెలుగు వైభవం పేరుతో ఎన్టీఆర్ విగ్రహం
- ఎన్టీఆర్‌కు భారతరత్న కోసం కృషి చేస్తాం
- సంక్షేమ కార్యక్రమాలకు ఆద్యుడు ఎన్టీఆర్
- 'సజీవ చరిత్ర' పుస్తకావిష్కరణ సభలో సీఎం



'సజీవ చరిత్ర' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, టీడీపీ నాయకుడు టీడీ జనార్దన్



కలెక్టర్ల సదస్సులో ప్రదర్శించిన క్వాంటమ్ వ్యాలీ భవన సముదాయాల నమూనా

జనవరికల్లా 2 క్వాంటమ్ కంప్యూటర్లు

- 2027 నాటికి మరో మూడు ఏర్పాటు చేయనున్న ఐబీఎం
- ఏటా ఐదు వేల కోట్ల విలువైన ఎగుమతులే లక్ష్యం 13
- 50 ఎకరాల్లో అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ
- 1000 కోట్ల ప్రోత్సాహకాలతో 100 స్టార్టప్‌లు: కాటంనేని
- విపత్తులపై గ్రామాల్లోనూ సైరన్ల ఏర్పాటు

పేదింటికి కూటమి వరం!

- ఒక్కో ఇంటికి రూ.2.5 లక్షల రాయితీ 14
- పేదల ఇళ్ల యూనిట్ వ్యయం పెంపు
- గత ప్రభుత్వంలో కంటే 1.10 లక్షల అదనపు సబ్సిడీ

పెట్టుబడులతో రండి

- విశాఖ సదస్సుకు విదేశీ భాగస్వాములను ఆహ్వానిస్తూ లండన్‌లో లోకేశ్ రోడ్ షో
- పాల్గొన్న ప్రఖ్యాత కంపెనీల ప్రతినిధులు
- రాష్ట్రంలో లక్ష ఎకరాలతో పారిశ్రామిక క్లస్టర్లు
- 15 నెలల్లో 10.06 లక్షల కోట్ల పెట్టుబడులు
- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, పెట్టుబడిదారుల ఫ్రెండ్లీ విధానాలు
- గ్లోబల్ ఇన్వెస్టర్లకు వివరించిన మంత్రి

అమరావతి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. నవంబరు 14, 15 తేదీల్లో విశాఖలో జరగనున్న పెట్టుబడుల భాగస్వామ్య సదస్సులో ప్రపంచస్థాయి పెట్టుబడుల భాగస్వాములను ఆహ్వానించేందుకు మంత్రి లోకేశ్ మంగళవారం లండన్‌లో

మిగతా 11వ పేజీలో...

అమెరికా, భారత్ మళ్లీ వాణిజ్య చర్చలు

- ట్రంప్ అడ్డగోలు సుంకాలతో నిలిచిన ప్రక్రియ
- తాజాగా ఆరో దశ చర్చలు పునః ప్రారంభం
- రాకేశ్ అగర్వాల్ నేతృత్వంలోని భారత బృందంతో ఢిల్లీలో భేటీ అయిన అమెరికా ప్రతినిధి బృందం
- చర్చలు సానుకూలమన్న ఇరు దేశాల అధికారులు
- భారత్ దిగివస్తోందని పీటర్ నవారో వ్యాఖ్య

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16: భారత్‌తో అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చలు మళ్లీ మొదలయ్యాయి. సోమవారమే భారత్‌కు చేరుకున్న అమెరికా ప్రభుత్వ ప్రతినిధులు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ)పై మంగళవారం చర్చలు ప్రారంభించారు. తమ సరుకులకు గేట్లు బార్లా తెరవాలని, రష్యా నుంచి చమురు కొనొద్దనే డిమాండ్లతో భారత్‌పై అమెరికా 50శాతం సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ఆయా అంశాలు తేలే వరకు భారత్‌తో వాణిజ్య చర్చలు ఉండవని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు కూడా. ఈ క్రమంలో గత నెల 25 నుంచి జరగాల్సిన ఆరో దశ చర్చలు నిలిచిపోయాయి. అడ్డగోలు సుంకాల ఒత్తిడికి భారత్ తలొగ్గకపోవడం, సుంకాల ప్రభావం పడిన ఉత్పత్తులను విక్రయించుకునేందుకు కొత్త మార్కెట్లపై దృష్టి సారించిన నేపథ్యంలో.. అమెరికా కాస్త వెనక్కి తగ్గింది. ఈ క్రమంలోనే చర్చలు పునః ప్రారంభమయ్యాయి. అమెరికా తరఫున ఆ దేశ



మిగతా 2వ పేజీలో...

దరఖాస్తులో ఏమున్నా 'మెరిట్'కే ప్రాధాన్యం!

అప్లికేషన్ దశలో 'ప్రాధాన్యత' కోరడం సరికాదు

11



- ఎస్‌జీటీ కోరుకున్నారని ప్రతిభ ఉన్న అభ్యర్థిని ఎస్ఏ పోస్టుకు అర్హులు కాదని చెప్పడానికి వీల్లేదు
- 2 పోస్టులకు ఎంపికైన వారికి కోరుకున్నది ఇవ్వొచ్చు
- వేర్వేరుగా ఫీజులు కట్టారు.. పరీక్షలు కూడా రాశారు
- డీఎస్సీ పోస్టుల భర్తీపై హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యలు
- ప్రాధాన్యత తేల్చే బాధ్యత సింగిల్ జడ్జిదేనని వెల్లడి
- 4 వారాల్లో తుది నిర్ణయం వెల్లడించాలని సూచన

ఫేక్‌కు కేరాఫ్ వైసీపీ!

- అసత్య ప్రచారంలో సోషల్ సైకోల కొత్త పుంతలు
- విద్యుత్తు కోతలంటూ తప్పుడు ఐడీలతో దుష్ప్రచారం
- గంటల తరబడి కోతలతో ఇంటర్వ్యూకు బ్రేకులంటూ పోస్టు
- బెజవాడలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ కోత
- దీనివల్ల తమ బేబీ డెలివరీ ఆగిపోయిందని మరో పోస్టు
- రాష్ట్రంలో కరెంటు కోతలే లేవంటున్న ట్రాన్స్‌కో అధికారులు

14

మహా కూటమిలో సిగపట్లు

బిహార్‌లో కీలక సీట్ల కోసం కాంగ్రెస్ పట్టు! 2

- 2020లో ఓడిన 51 స్థానాల్లో 37 చోట్ల పోటీకి విముఖత
- దళితులు, మైనారిటీలు, బీసీలు ఎక్కువగా ఉన్న సీట్లపై కన్ను
- 40 సీట్లు అడుగుతున్న లిబరేషన్.. 60 స్థానాలు, 'ఉప ముఖ్యమంత్రి' కోరుతున్న వీఐపీ సహానీ.. ఆర్జేడీ ససేమిరా



దోపిడీ జరిగిన బ్యాంకు వద్ద గుమిగూడిన జనం

2

కర్ణాటకలో బ్యాంకు దోపిడీ

రూ. 58 కోట్ల సొత్తు చోరీ

- మారణాయుధాలతో సిబ్బందికి బెదిరింపు
- 8 కోట్ల నగదు, 50 కోట్ల బంగారంతో పరారీ
- విజయపుర జిల్లా చడచణ ఎస్‌బీఐలో ఘటన

ఆలయాలకు భక్తులు డబ్బులిచ్చేది కల్యాణ మండపాల నిర్మాణానికి కాదు

ఆలయ నిధులను ప్రభుత్వ నిధులుగా పరిగణించకూడదు: సుప్రీంకోర్టు

2

ఆయుధాలు వదిలేస్తాం!

- సాయుధ పోరాటానికి తాత్కాలిక విరమణ
- కేంద్రంతో వీడియో కాల్‌లో శాంతి చర్చలకూ సిద్ధం
- మావోయిస్టు ప్రతినిధి అభయ్ పేరిట లేఖ
- ఇది నిజమా.. కాదా!? అనే అంశంపై గందరగోళం

చర్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆయుధాలను వదులుకోవాలని మావోయిస్టులు నిర్ణయించారా!? సాయుధ పోరాటానికి తాత్కాలిక విరమణ ప్రకటించాలని నిర్ణయించారా!? కేంద్ర ప్రభుత్వంతో వీడియో కాల్‌లో శాంతి చర్చలకు సిద్ధమయ్యారా!? ఈ ప్రశ్నలకు 'ఔను' అనే అంటోంది మావోయిస్టుల నుంచి తాజాగా వచ్చిందని చెబుతోన్న ఓ లేఖ. మంగళవారం అర్ధరాత్రి సమయంలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రతినిధి అభయ్ పేరిట ఓ లేఖ విడుదలైంది. అందులో, శాంతి చర్చలను తాత్కాలికంగా విరమించుకుంటున్నామని, పీడిత ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజా పోరాటాల్లో పాల్గొంటామని పేర్కొన్నారు. కేంద్ర హోం మంత్రి లేదా ఆయన నియమించిన ప్రతినిధి బృందంతో చర్చలకు సుముఖత వ్యక్తం చేశారు. ఇందుకు నెల రోజులపాటు తాత్కాలికంగా కాల్పుల విరమణ ప్రకటించాలని, రక్తసిక్తమైన అడవుల్లో శాంతియుత వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని కోరినట్లు ఉంది. అయితే, ఈ ప్రకటనను నిజంగా మావోయిస్టులే విడుదల చేశారా!? అనే విషయమై అస్పష్టత నెలకొంది. ఇందుకు కారణం సదరు ప్రకటనపై ఆగస్టు 15వ తేదీ ఉండడమే. దీనికితోడు, దానిపై మల్లోజుల కోటేశ్వరరావు ఫొటో కూడా ముద్రించారు. సాధారణంగా, మావోయిస్టులు తమ ప్రకటనపై ఇలా ఫొటోలు ముద్రించరని మావోయిస్టు వర్గాలు పేర్కొంటున్నాయి. అలాగే, మావోయిస్టులు ప్రకటన విడుదల చేస్తే కాల్పుల విరమణ అనే అంశాన్ని మాత్రమే ప్రస్తావిస్తారని, కానీ, ఇందులో ఆయుధాలను పూర్తిగా వదిలేసి జన జీవన స్రవంతిలో కలుస్తామని పేర్కొన్నారని, మారిన పరిస్థితులే ఇందుకు కారణమని ప్రస్తావించారని, ఇది అనుమానాస్పదంగా ఉందని మావోయిస్టు అనుకూల వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

ఆలయాలకు భక్తులు డబ్బులు ఇచ్చేది కల్యాణ మండపాల నిర్మాణానికి కాదు: సుప్రీం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16: ఆలయాలకు భక్తులు డబ్బులిచ్చేది కల్యాణ మండపాల నిర్మాణం కోసం కాదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఆలయ నిధులను ప్రభుత్వ నిధులుగా పరిగణించకూడదంటూ మద్రాసు హైకోర్టు ఇచ్చిన తీర్పును మంగళవారం సమర్థించింది. కాగా, ఐదు ఆలయాల నిధులతో తమిళనాడులోని వివిధ ప్రాంతాల్లో కల్యాణ మండపాల నిర్మాణానికి అనుమతిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను మద్రాసు హైకోర్టు మదురై బెంచ్ గతనెల 19న కొట్టివేసింది. కల్యాణ మండపాలు నిర్మించి, వాటిని వివాహ వేడుకల నిర్వహణ నిమిత్తం అద్దెకు ఇవ్వాలనే ప్రభుత్వ నిర్ణయం 'మతపరమైన నిమిత్తం' నిర్వచనం కిందకు రాదని హైకోర్టు పేర్కొంది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. 'భక్తులు తమ డబ్బును ఇలాంటి కల్యాణ మండపాల ఏర్పాటు కోసం ఆలయాలకు ఇవ్వరు. అవి ఆలయాలను మెరుగుపరిచేందుకై ఉండొచ్చు' అని తెలిపింది. విద్య, వైద్య సంస్థల ఏర్పాటు తదితర దాతృత్వ కార్యక్రమాలకు ఆ డబ్బును వినియోగించాలని ధర్మాసనం సూచించింది.

ట్రైబ్యునళ్లు స్టేషనరీ కోసం అడుక్కోవాలా?

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16: ప్రభుత్వం తగిన సౌకర్యాలు కల్పించకపోవడం వల్లనే ట్రైబ్యునల్ పదవులను చేపట్టడానికి మాజీ న్యాయమూర్తులు ముందుకు రావడం లేదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. సౌకర్యాలు కలిగించలేకపోతే వాటిని మూసివేయాలంటూ కేంద్రంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఖాళీగా ఉన్న ట్రైబ్యునళ్ల పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ ఎన్‌జీటీ బార్ అసోసియేషన్ దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం ధర్మాసనం విచారణ జరిపింది. ట్రైబ్యునళ్లలో స్టేషనరీ నుంచి నివాస భవనం, కారు ప్రతిదానికీ అడుక్కొనే పరిస్థితి కల్పిస్తున్నారని విమర్శించింది. ఒకవేళ ఇచ్చినా డొక్కు కారు ఇస్తారని వ్యాఖ్యానించింది.

రాజకీయ పార్టీలకు 'పోష్' వర్తించదన్న సుప్రీం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16: రాజకీయ పార్టీలకు పని స్థలాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ, నిరోధక, పరిహార చట్టం (పీఓఎస్‌హెచ్-పోష్)-2013 వర్తించదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పార్టీలు పని స్థలాలు కాదని, అందులో చేరినవారు ఉద్యోగులు కాదని తెలిపింది. ఆ కారణంగా 'పోష్'ను వర్తింపజేయలేమని తెలిపింది. పార్టీలో చేరిన వారు ఉద్యోగులు కారని, వారంతా స్వచ్ఛందంగా చేరుతారని పేర్కొంది. ఒకవేళ అమలు చేస్తే ఆ చట్టం దుర్వినియోగమవుతుందని, బ్లాక్‌మెయిల్ రాజకీయాలు పెరుగుతాయని వ్యాఖ్యానించింది.

తగ్గిన మదర్ డైరీ ఉత్పత్తుల ధరలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16: జీఎస్టీ తగ్గింపును తన ఉత్పత్తులకు వర్తింప చేస్తూ మదర్ డైరీ ధరలను తగ్గించింది. కనిష్ఠంగా రూ.2 నుంచి గరిష్ఠంగా రూ.30 వరకూ ధరలు తగ్గినట్లు ఓ ప్రకటనలో పేర్కొంది. టోన్డ్ పాలు, నెయ్యి, ఆవు నెయ్యి, పన్నీరు, బట్టర్, చీజ్ ధరలపై ఈ తగ్గింపు వర్తిస్తుందని వివరించింది. యూహెచ్‌టీ టోన్డ్ పాలపై రూ.2 తగ్గింది. పన్నీరు 200 గ్రాములపై రూ.3, 400 గ్రాములపై రూ.6, మలాయ్ పన్నీరు 200 గ్రాముల ప్యాక్‌పై రూ.3 ధర తగ్గింది. బట్టర్ 500 గ్రాముల ప్యాక్‌పై రూ.20 తగ్గగా, 100 గ్రాములపై రూ.4 తగ్గింది. 1లీటరు నెయ్యిపై రూ.30 తగ్గింది. కాగా, 500 మి.లీ.ల ఆవు నెయ్యిపై రూ.15 తగ్గిందని సంస్థ ప్రకటించింది.

ఆపరేషన్ సిందూర్ సమయంలో మూడో దేశం జోక్యాన్ని భారత్ తిరస్కరించింది

- పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ ధర్ ఒప్పుకోలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16: తన మధ్యవర్తిత్వం వల్లే భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధం ఆగిందన్న ట్రంప్ ప్రచారాన్ని పాకిస్థాన్ విదేశాంగ మంత్రి, డిప్యూటీ పీఎం ఇషాక్ ధర్ పరోక్షంగా కొట్టిపారేశారు. "ఆపరేషన్ సిందూర్ సమయంలో మూడో దేశం జోక్యాన్ని భారత్ తిరస్కరించింది" అని ఒప్పుకొన్నారు. ఈ విషయాన్ని అమెరికా రక్షణ మంత్రి మార్క్ రుబియో తనకు చెప్పారని వివరించారు.

కర్ణాటకలో బ్యాంకు దోపిడీ... 58 కోట్ల సొత్తు చోరీ

బెంగళూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని విజయపుర జిల్లా శివారు పట్టణం చడచణలో దొంగలు రెచ్చిపోయారు. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలో మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో చొరబడ్డారు. బ్యాంకు మేనేజర్, ఉద్యోగులు తాళాలు వేసుకుని, ఇళ్లకు వేళ్లేందుకు సిద్ధం అవుతుండగా ఒక్కసారిగా ఏడెనిమిది మంది దాడి చేసి.. పిస్తోలు, ఇతర మారణాయుధాలతో బెదిరించారు. మేనేజర్, ఉద్యోగుల కాళ్లు, చేతులు కట్టిపడేశారు. మేనేజర్ వద్ద ఉన్న సేఫ్టీ లాకర్ తాళాలను తీసుకుని, లాకర్స్ ఓపెన్ చేశారు. సుమారు రూ.8 కోట్ల నగదు, రూ.50 కోట్ల విలువైన బంగారం ఆభరణాలను దోచుకున్నారు. అనంతరం వాహనాల్లో మహారాష్ట్ర వైపు పరారయ్యారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.

అమెరికా, భారత్ మళ్లీ వాణిజ్య చర్చలు

(మొదటి పేజీ తరువాయి)

దక్షిణ, మధ్య ఆసియా సహాయక వాణిజ్య ప్రతినిధి బ్రెండన్ లించ్ ఆధ్వర్యంలోని బృందం, భారత్ తరఫున వాణిజ్యశాఖ ప్రత్యేక కార్యదర్శి రాకేశ్ అగర్వాల్ నేతృత్వంలోని బృందం చర్చలు జరుపుతున్నాయి. ఇరు దేశాల మధ్య చాలా అంశాల్లో ఏకాభిప్రాయం ఉన్నా.. అమెరికాకు చెందిన వ్యవసాయ, డెయిరీ ఉత్పత్తులకు భారత్ గేట్లు తెరవాలన్న డిమాండ్‌పైనే పీటముడి నెలకొంది. అమెరికా మొక్కజొన్న, ఇతర ఉత్పత్తులు, పాల పదార్థాలన్నీ దాదాపుగా జన్యుమార్పిడి ఉత్పత్తులు కావడం, తక్కువ ధరకు వచ్చే ఆ ఉత్పత్తులతో మన దేశ వ్యవసాయ, పాడి పరిశ్రమపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉండటంతో.. భారత్ వాటి దిగుమతులకు అంగీకరించడం లేదు. కాగా ఇరుదేశాల మధ్య చర్చలు సానుకూలంగా జరిగాయని భారత వాణిజ్యశాఖ, అమెరికా అధికారులు వేర్వేరుగా ప్రకటించారు. ఇకపై ప్రతివారం వర్చువల్ పద్ధతిలో చర్చలు కొనసాగుతాయని, నేరుగా మరోసారి భేటీ అయ్యే తేదీని త్వరలో నిర్ణయిస్తారని ఓ అధికారి వెల్లడించారు. కాగా, వాణిజ్య ఒప్పందం విషయంలో భారత్ దిగి వస్తోందని ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో వ్యాఖ్యానించారు.

నరేంద్రుడి జైత్రయాత్ర



(మొదటి పేజీ తరువాయి)

కూడా బలమైన ముద్ర వేసిన మోదీ 75 ఏళ్లు పూర్తి చేసుకుని బుధవారం 76వ పడిలో అడుగుపెట్టారు. గుజరాత్‌లోని వాద్‌నగర్‌లో 1950లో పుట్టి.. బాల్యంలోనే తండ్రితో పాటు చాయ్ అమ్మిన మోదీ.. ఎనిమిదేళ్ల వయస్సులో ఆరెస్సెస్‌లో చేరారు. దాదాపు 15 ఏళ్ల పాటు సంఘ్‌లో వివిధ బాధ్యతలు నిర్వర్తించిన ఆయన.. 1987లో బీజేపీ గుజరాత్ యూనిట్ సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టడం ద్వారా క్రియాశీల రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. గుజరాత్‌లో పార్టీని ఆయన సంస్థాగతంగా బలోపేతం చేయడం వల్ల.. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలలో బీజేపీ అత్యధిక సీట్లు సాధించింది. అడ్వాణీ గుజరాత్‌లోని సోమనాథ్ నుంచి చేపట్టిన రథయాత్రను సక్సెస్ చేయడంలో మోదీ పాత్ర కీలకం. అప్పుడే ఆయనపై జాతీయ నాయకుల దృష్టి పడింది. దీంతో 1990-91లో మురళీ మనోహర్ జోషి కన్యాకుమారి నుంచి శ్రీనగర్ వరకు చేపట్టిన ఏక్తా యాత్రను నిర్వహించే బాధ్యతను మోదీకి అప్పజెప్పారు. జోషీతో పాటు 15 వేల కిలోమీటర్లు దేశమంతటా తిరగడంతో గుజరాత్‌లో కూడా ఒక ప్రధాన నాయకుడిగా మోదీ గుర్తింపు పొందారు. 1991 లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ ఎన్నికల వ్యూహాన్ని రూపొందించే బాధ్యతలు చేపట్టిన మోదీ.. గాంధీనగర్ నుంచి అడ్వాణీ విజయానికి తీవ్రంగా తీవ్ర కృషి చేశారు. అంచలంచెలుగా పార్టీలో ఎదుగుతూ వచ్చారు. గుజరాత్ రాజకీయాలలో శంకర్‌సింగ్ వాఘేలా, కేశుభాయ్ పటేల్ మధ్య ఘర్షణలు తీవ్రతరం కావడంతో వాజ్‌పేయి స్వయంగా ఫోన్ చేసి మోదీకి గుజరాత్ సీఎంగా పట్టం కట్టారు. సీఎంగా మోదీ ఒక సమర్థుడైన పరిపాలకుడిగా వ్యవహరించి గుజరాత్ నమూనాను ప్రపంచానికి పరిచయం చేశారు. గుజరాత్‌ను తాను పరిపాలించిన 13 ఏళ్లలో.. బలమైన పారిశ్రామిక, ఆర్థిక వ్యవస్థగా మార్చారు. బీజేపీలో వాజ్‌పేయి, అడ్వాణీ తర్వాత అతివేగంగా గుర్తింపు పొందిన నాయకుడైన మోదీ.. తాను సీఎంగా ఉండగానే పార్టీకి జాతీయస్థాయిలో స్టార్ క్యాంపెయినర్‌గా ప్రచారం చేశారు. వాజ్‌పేయి తర్వాత అడ్వాణీకి 10 సంవత్సరాలు పార్టీని నిర్వహించే అవకాశం వచ్చినప్పటికీ.. బీజేపీని అధికారంలోకి తీసుకురాలేకపోవడంతో 2013లో మోదీని ప్రధాని అభ్యర్థిగా పార్టీ రంగంలోకి దించింది. 2014లో దేశమంతటా మోదీ ప్రభంజనం వీయడంతో మొట్టమొదటిసారి బీజేపీ పూర్తి మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. 2019, 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూడా మోదీ పార్టీకి విజయం సాధించి బీజేపీలో తనకు మరో ప్రత్యామ్నాయం లేదని నిరూపించుకున్నారు. ఆయన హయాంలో బీజేపీ బలమైన పార్టీగా అవతరించి సొంతంగా దాదాపు 18 రాష్ట్రాలలో అధికారంలోకి రావడమే కాకుండా మొత్తం 21 రాష్ట్రాలలో ఎన్డీయే సారథ్యంలో ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది.

ఎన్నో విమర్శలు..

నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో అనేక విజయాలు సాధించిన మోదీ.. పలు వైఫల్యాలను, విమర్శలను కూడా ఎదుర్కొన్నారు. సీఎంగా ఆయన బాధ్యతలు చేపట్టిన కొద్దిరోజుల్లోనే గుజరాత్ అల్లర్లు జరిగి వేలాది మంది ఊచకోత జరగడం ఆయన రాజకీయ జీవితంలో చెరిగిపోని మచ్చ. ప్రధానిగా ఆయన తీసుకున్న అనేక నిర్ణయాలు వివాదాస్పదం అయ్యాయి. పెద్ద నోట్ల రద్దు, సాగుచట్టాలు, లాక్‌డౌన్ సమయంలో పేదల మరణాలు, పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా జరిగిన నిరసన ప్రదర్శనలు, మణిపూర్‌లో రెండేళ్లపాటు జరిగిన హింసాకాండ, రాఫెల్ యుద్ధవిమానాల కొనుగోలు, ప్రతిపక్షాలను బలహీనపరిచేందుకు ఈడీ, సీబీఐ లాంటి వ్యవస్థలను దుర్వినియోగపరచడం, అనేక సందర్భాలలో అప్రజాస్వామిక వైఖరి ఆయన నాయకత్వాన్ని ప్రశ్నార్థకం చేశాయి. పుల్వామా, పహల్గాం ఉగ్రదాడులు.. 'ఆపరేషన్ సిందూర్' పేరిట పాక్‌తో ప్రారంభించిన యుద్ధాన్ని అంతర్జాతీయ ఒత్తిడితో 4రోజుల్లోనే ముగించాల్సి రావడం ఆయనకు అప్రతిష్ఠను తెచ్చిపెట్టాయి. ఒకప్పుడు మోదీ అత్యంత స్నేహితుడిగా భావించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆయనకు వ్యతిరేకంగా మారి భారత్‌పై టారిఫ్‌ల దాడి చేసినప్పటికీ చైనా, రష్యాలతో సంబంధాలు పునరుద్ధరించుకోవడం మోదీ దౌత్యనీతికి నిదర్శనం.

సాహసోపేత నిర్ణయాలు..

ప్రధానిగా మోదీ తన 11 ఏళ్ల పదవీకాలంలో ఎన్నో సాహసోపేత నిర్ణయాలను తీసుకున్నారు. జన్‌ధన్ యోజనతో దేశంలో 51 కోట్ల మందికి బ్యాంకు ఖాతాలు తెరిపించారు. ప్రధానమంత్రి ఉజ్వల యోజనతో 10 కోట్లకు పైగా మహిళలకు ఉచితవంట గ్యాస్ కనెక్షన్లు అందించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజనతో 2014 నుంచి 2024 వరకు 4.2 కోట్ల ఇళ్ల నిర్మాణానికి అనుమతులిచ్చారు. దేశాన్ని అంతర్జాతీయ తయారీ కేంద్రంగా మార్చడానికి 'మేకిన్ ఇండియా' కార్యక్రమాన్ని ప్రారంభించారు. 2017లో జీఎస్టీని ప్రవేశపెట్టి.. 'ఒకే దేశం- ఒకే పన్ను' కలను సాకారం చేశారు. జమ్మూకశ్మీర్‌కు స్వయంప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని 2019లో రద్దు చేశారు. అదే ఏడాది చివరిలో పౌరసత్వ సవరణ చట్టాన్ని తీసుకొచ్చారు. సర్జికల్ స్ట్రైక్స్, 2019 ఎన్నికల ముందు బాలాకోట్ దాడులు.. తాజాగా ఆపరేషన్ సిందూర్‌తో.. దాయాది పాక్‌కు గట్టి బుద్ధి చెప్పగల నేతగా మన్ననలు అందుకున్నారు. 2019 ఎన్నికలకు ముందు ఈడబ్ల్యూఎస్ వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం, కిసాన్ సమ్మాన్ నిధి కింద ఏటా రూ.6 వేలు ఇవ్వడం ద్వారా ఎన్నికలకు ముందు ప్రతిపక్షాలను ఇరకాటంలో పడేశారు. జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించాలని మోదీ ఇచ్చిన పిలుపునకు ఐరాసలో 177 దేశాల మద్దతు లభించింది.

లోకం తీరు



16వేల మంది విదేశీయులను తిప్పి పంపించే యోచన?

- అక్రమంగా వచ్చినట్టు కేంద్రం గుర్తింపు
- నూతన చట్టం కింద చర్యలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16: దేశంలోకి అక్రమంగా వచ్చిన 16వేల మంది విదేశీయులను తిప్పి పంపించడానికి కేంద్రం చర్యలు తీసుకుంటున్నట్టు తెలిసింది. అక్రమంగా రావడంతో పాటు, నేరాలు చేసినందుకు వారు ప్రస్తుతం దేశంలోని పలు చోట్ల నిర్బంధంలో ఉన్నట్టు సమాచారం. కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన 'వలసలు, విదేశీయుల చట్టం-2025' ప్రకారం వారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. వీరిలో చాలా మందికి మాదక ద్రవ్యాల సరఫరా, క్రిమినల్ చర్యలతో సంబంధం ఉండడంతో వారిని నార్కోటిక్స్ కంట్రోల్ బోర్డు (ఎన్‌సీబీ) అదుపులోకి తీసుకున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. వారిని తిప్పిపంపించే విధానాలను ఖరారు చేసే పనిలో కేంద్ర హోం శాఖ ఉన్నట్టు సమాచారం. ఈ నెల రెండో తేదీ నుంచి అమల్లోకి వచ్చిన నూతన చట్టం ప్రకారం దేశంలోకి అక్రమంగా ప్రవేశించేవారిపై కఠిన చర్యలు ఉంటాయి. తప్పుడు పత్రాలతో అక్రమంగా వచ్చేవారికి 2 నుంచి 7 సంవత్సరాల వరకు శిక్ష ఉంటుంది. రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు జరిమానా కూడా విధిస్తారు. వారి స్వదేశాలకు తిప్పి పంపిస్తారు. వారిని స్వదేశాలకు తిప్పి పంపించే విషయమై కేంద్ర హోం శాఖ రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేస్తోంది. అక్రమంగా వలస వస్తున్నవారి కారణంగా తలెత్తుతున్న వ్యవస్థీకృత నేరాలను అరికట్టేందుకు అనుసరించే దీర్ఘకాలిక వ్యూహంలో భాగంగా తొలుత వలసదారులను తిప్పిపంపనుంది. తొలుత ఇప్పటికే నిర్బంధంలో ఉన్నవారిని పంపించే అవకాశం ఉందని తెలిపింది. అక్రమంగా వలస వచ్చిన వారు ప్రభుత్వ పథకాలను కూడా పొందుతుండడంతో నిజమైన పేదలకు అన్యాయం జరుగుతున్నట్టు అధికార వర్గాలు భావిస్తున్నాయి.

మోదీకి ట్రంప్ బర్త్‌డే విషెస్.. థ్యాంక్యూ మై ఫ్రెండ్ అన్న మోదీ



న్యూఢిల్లీ, సెప్టెంబరు16: భారత ప్రధాని నరేంద్ర మోదీకి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 75వ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తనకు ఫోన్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారని ప్రధాని మోదీ మంగళవారం ఎక్స్‌లో పోస్టు చేశారు. థ్యాంక్యూ మై ఫ్రెండ్ అంటూ ట్రంప్‌కు ధన్యవాదాలు తెలిపారు. "భారత్-అమెరికా దేశాల మధ్య భాగస్వామ్యాన్ని కొత్త శిఖరాలకు చేర్చేందుకు మీలాగే(ట్రంప్) నేను కూడా కట్టుబడి ఉన్నాను" అని మోదీ పేర్కొన్నారు. అలాగే, ఉక్రెయిన్ సమస్యను శాంతియుతంగా పరిష్కరించేందుకు ట్రంప్ చేస్తున్న కృషికి తమ మద్దతు ఉంటుందని మోదీ తెలిపారు. కాగా, అదనపు సుంకాల నేపథ్యంలో ట్రంప్, మోదీ మధ్య దూరం పెరగ్గా.. ఇరువురు నేతలు మాట్లాడుకోవడం జూన్ 17 తర్వాత ఇదే తొలిసారి.

న్యూయార్క్ టైమ్స్‌పై లక్ష కోట్లకు ట్రంప్ పరువు నష్టం దావా

వాషింగ్టన్, సెప్టెంబరు 16: తనపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారంటూ ట్రంప్ సోమవారం న్యూయార్క్ టైమ్స్ పత్రికపై పరువు నష్టం దావా వేశారు. ఫ్లోరిడా కోర్టులో 15 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1.32 లక్షల కోట్లు)కు దావా వేసినట్టు చెప్పారు. చట్ట వ్యతిరేక ప్రచారానికి ఆ పత్రిక ఏకైక అతిపెద్ద భాగస్వామిగా మారిందని ఆరోపించారు. రాడికల్ లెఫ్ట్ డెమొక్రాటిక్ పార్టీకి బాకాగా మారిందని విమర్శించారు. దేశ చరిత్రలో దిగజారుడు పత్రికగా మారిందంటూ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. తన కుటుంబానికి, వ్యాపారాలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు.

గే డేటింగ్ యాప్ చేసిన ఘోరం

- కేరళలో బాలుడిపై 14 మంది లైంగిక దాడి

తిరువనంతపురం, సెప్టెంబరు 16: లైంగిక దాడుల నుంచి బాలికలకే కాదు.. ఇటీవల బాలురకు కూడా రక్షణ లేకుండా పోతోంది. కేరళలో అలాంటి దారుణమే జరిగింది. 14 మంది రెండేళ్ల పాటు 16 ఏళ్ల బాలుడిపై లైంగిక దాడికి పాల్పడ్డారు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనలో 9 మందిని పోలీసుల అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో ఓ రాజకీయ నాయకుడు, ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు, ఓ ఫుట్‌బాల్ కోచ్ ఉన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 10వ తరగతి చదువుతున్న ఆ బాలుడు రెండేళ్ల క్రితం ఓ గే డేటింగ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేశాడు. అప్పటి నుంచి ఆ బాలుడిపై లైంగిక దాడి జరుగుతోంది. ఆ బాలుడి ఇంటితో పాటు కేరళలోని కాసర్‌గాడ్, కన్నూర్, కోజికోడ్, ఎర్నాకులం తదితర ప్రాంతాల్లో 14 మంది ఆ బాలుడిపై లైంగిక దాడి చేశారు. ఇటీవల ఒక రోజు ఓ అపరిచిత వ్యక్తి తమ ఇంట్లోంచి బయటకు వెళ్లడం గమనించిన బాలుడి తల్లి.. ఆ బాలుడిని ప్రశ్నించగా ఈ ఘోరం వెలుగుచూసింది. బాలుడి ఫిర్యాదు మేరకు 14 మందిపై విడివిడిగా పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు.

అరబ్-ఇస్లామిక్ 'నాటో' ఏర్పాటు దిశగా అడుగులు

- ఖతార్‌లో ముస్లిం నేతల అత్యవసర భేటీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16: నాటో తరహా సైనిక కూటమిని ఏర్పాటు చేయాలని అరబ్, ఇస్లామిక్ దేశాలు ప్రతిపాదించాయి. ఖతార్ రాజధాని దోహాలో జరిగిన ఒక అత్యవసర సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఈ కూటమికి "అరబ్ నాటో" అనే పేరు పెట్టాలని ఈజిప్టు ప్రతిపాదించింది. దీనికి పాకిస్థాన్, తుర్కియే వంటి దేశాలు కూడా మద్దతు తెలిపాయి. గత వారం ఖతార్‌పై హమాస్ అగ్రనాయకత్వమే లక్ష్యంగా ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసింది. ఈ నేపథ్యంలో అరబ్, ఇస్లామిక్ దేశాలు సోమవారం దోహాలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశాయి. ఈ సమావేశంలో 40కి పైగా ముస్లిం దేశాల నేతలు పాల్గొన్నారు. అరబ్ సైనిక కూటమి ఏర్పాటు చేయాలని పలువురు నేతలు అభిప్రాయపడ్డారు.

మహా కూటమిలో సిగపట్లు

బిహార్లో కీలక సీట్ల కోసం కాంగ్రెస్ పట్టు!.. 2020లో ఓడిన 51 స్థానాల్లో 37 చోట్ల పోటీకి విముఖత

- ససేమిరా అంటున్న ఆర్జేడీ



పట్నా, సెప్టెంబరు 16: బిహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో 'ఇండీ' కూటమి పార్టీలతో కూడిన మహాగఠ్‌బంధన్(మహాకూటమి)లో సీట్ల సర్దుబాటుపై చర్చోపచర్చలు సాగుతున్నాయి. ఎవరికి వారు ఎక్కువ సీట్లలో పోటీచేయాలని తహతహలాడుతున్నారు. ప్రధానంగా కాంగ్రెస్.. ఈసారి సీట్ల సంఖ్య కంటే గెలిచే స్థానాల కోసం కన్నేసింది. గత ఎన్నికల్లో 70 చోట్ల బరిలోకి దిగి.. 19 సీట్లే గెలిచింది. ఈ నేపథ్యంలో ఈ సారి తక్కువ స్థానాలు తీసుకోవాలని ప్రధాన పార్టీ అయిన ఆర్జేడీ సూచిస్తోంది. అయితే ఓడిపోయిన 51 స్థానాల్లో 37 చోట్ల పోటీచేసేందుకు కాంగ్రెస్ కూడా విముఖంగా ఉంది. ఎందుకంటే వాటిలో 21 స్థానాల్లో గత 15 ఏళ్లలో మహాకూటమి పార్టీలేవీ గెలవలేదు. దీంతో ఈ దఫా తక్కువ సీట్లలో పోటీచేసినా.. అవి గెలిచే అవకాశాలు ఉన్నవై ఉండాలని కాంగ్రెస్ భావిస్తోంది. రాహుల్‌గాంధీ చేపట్టిన ఓటర్ అధికార యాత్రతో తమ బలం పెరిగిందని.. దళితులు, ముస్లింలు, ఈబీసీలు, అగ్రవర్ణాల ఓటర్లు నిర్ణయాత్మకంగా ఉన్న సీట్లు తమకివ్వాలని చర్చల సందర్భంగా పట్టుబడుతోంది. 70 స్థానాలకు తగ్గేది లేదని అంటోంది. ఇందుకు ఆర్జేడీ అంగీకరించడం లేదు. బీజేపీతో నేరుగా తలపడిన స్థానాల్లో ఎక్కువ చోట్ల ఆర్జేడీ గత రెండు ఎన్నికల్లోనూ ఓడిపోయింది. ఈసారి వీటిలో కొన్నిటిని కాంగ్రెస్‌కు ఇవ్వజూపుతోంది. 150 స్థానాలకు తక్కువగా తాను పోటీచేసేది లేదని అంటోంది. మిగతా 93 సీట్లను మిగతా మిత్రులు పంచుకోవాలని సూచిస్తోంది. ఇప్పటికే కాంగ్రెస్, ఆర్జేడీ ద్వైపాక్షిక సమావేశాలు జరిపాయి. మిత్రపక్షాలైన సీపీఐ-ఎంఎల్ లిబరేషన్, సీపీఐ, సీపీఎం, జేఎంఎం, వీఐపీ, ఆర్‌ఎల్‌ఎల్‌పీలను కూడా సర్దుబాటు చేయాల్సి ఉన్నందున.. వాటికి బలహీన స్థానాల్లో కొన్నిటిని కట్టబెట్టాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఆయా పార్టీలు ఇందుకు అంగీకరించేందుకు సిద్ధంగా లేవు. గత ఎన్నికల్లో ఎన్డీఏలో ఉన్న వీఐపీ నేత ముకేశ్ సహనీ ఈ సారి మహాకూటమిలోకి వచ్చారు. ఆయన 60 సీట్లు, ఉపముఖ్యమంత్రి పదవి తనకు ఇవ్వాలని పట్టుబడుతున్నారు. లిబరేషన్ 40 సీట్లు డిమాండ్ చేస్తోంది. మిత్రపక్షాల తీరుతో విసుగుచెందిన ఆ పార్టీ నేత తేజస్వీ యాదవ్.. మొత్తం 243 స్థానాల్లో పోటీచేసే సత్తా తమకుందని ఇటీవల ప్రకటించారు. మరోవైపు, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్.. మహాకూటమి తరఫున బిహార్ సీఎం అభ్యర్థిని తానేనని రాహుల్ సమక్షంలోనే ప్రకటించుకున్నారు. దీనిపై రాహుల్ ఎలాంటి స్పందనా వ్యక్తంచేయలేదు. ఆయన పేరుపై వ్యతిరేకత లేకున్నా.. తమను సంప్రదించకుండా ఆయన స్వీయ ప్రకటన చేయడంపై మిత్రపక్షాలు కూడా అసంతృప్తిగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో సీఎం అభ్యర్థి విషయంలో ఎలాంటి గందరగోళం లేదని.. సరైన సమయంలో ప్రకటిస్తామని తేజస్వీ చెప్పారు.

బీజేపీకి చిరాగ్ వార్నింగ్!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16: బిహార్లో ఎన్డీఏలోనూ సీట్ల సర్దుబాటుపై లుకలుకలు ఏర్పడ్డాయి. గత ఎన్నికల్లో ఒంటరిగా 135 చోట్ల బరిలోకి దిగి.. జేడీయూను తీవ్రంగా దెబ్బతీసిన ఎల్‌జేపీ (రాంవిలాస్) అధినేత, ప్రస్తుత కేంద్ర మంత్రి చిరాగ్ పాసవాన్.. ఈసారి మాత్రం ఎన్డీఏతోనే ఉన్నారు. అయితే తన పార్టీకి 40 స్థానాలు కేటాయించాలని కోరుతున్నారు. బీజేపీ మాత్రం 25కి మించి ఇవ్వనని స్పష్టం చేస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన మంగళవారం ఓ ఆంగ్ల చానల్‌తో మాట్లాడారు. తాను కూరల్లో ఉప్పులాంటివాడినని సుతిమెత్తగా హెచ్చరించారు. ప్రతి నియోజకవర్గంలోనూ 20 నుంచి 25 వేల ఓటర్లను ప్రభావితం చేయగల శక్తి తనకుందని స్పష్టంచేశారు.

రూ.200 తీసుకుని మోసం చేశారంటూ తేజస్విపై కేసు

పట్నా, సెప్టెంబరు 16: బిహార్‌లో మరో కొత్త వివాదానికి తెర లేచింది. ప్రతిపక్ష నేత తేజస్వియాదవ్, రాజ్యసభ ఎంపీ సంజయ్ యాదవ్, ఆర్జేడీ మాజీ ఎమ్మెల్యే రిషి మిశ్రా, కాంగ్రెస్ మాజీ అభ్యర్థి మస్కూర్ అహ్మద్ ప్రభుత్వ పథకం పేరిట తనను మోసం చేశారని గుడియాదేవి అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్భంగా జిల్లాలోని సింగ్వారా పోలీస్‌స్టేషన్లో ఈమేరకు ఎఫ్ఐఆర్ నమోదైంది. మాయి-బెహన్ పథకంలో రూ.2,500 వస్తాయని చెప్పి దరఖాస్తు పేరిట తన దగ్గర రూ.200 తీసుకుని మోసం చేశారని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. పైన పేర్కొన్న నేతలందరు దీని వెనుక ఉన్నారని ఆరోపించింది.

రుషికేశ్ ఎయిమ్స్‌లో విద్యార్థి ఆత్మహత్య

సూపరింటెండెంట్ వేధింపులే కారణం..!

పేరేచర్లలో విషాదం... బయలుదేరి వెళ్లిన తల్లిదండ్రులు

మేడికొండూరు సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లోని రుషికేశ్ ఎయిమ్స్ ఆస్పత్రిలో వైద్య విద్యను అభ్యసిస్తున్న చాగంటిపాటి జగపతి బాబు(28) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం పేరేచర్ల గ్రామానికి చెందిన ఇతడి మృతి వార్తతో గ్రామంలో విషాదం అలుముకుంది. నిరుపేద కుటుంబానికి చెందిన జగపతి బాబు అత్యుత్తమ మార్కులతో అన్ని తరగతుల్లో ఉత్తీర్ణత సాధించారు. ఎండోక్రినాలజీలో స్పెషలైజేషన్ కోసం ఆయన ఎయిమ్స్‌లో చేరారు. చదువు పూర్తి చేసుకుని మంచి వైద్యునిగా సేవలందిస్తారని ఆశించిన కుటుంబ సభ్యులకు తీరని శోకం మిగిల్చాడు. జగపతిబాబు ఆత్మహత్యకు అక్కడి ఆస్పత్రి సూపరింటెండెంట్ వేధింపులే కారణమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకుని జగపతిబాబు తల్లిదండ్రులు, బంధువులు రుషికేశ్ బయలుదేరివెళ్లారు. బుధవారం మృతదేహాన్ని పేరేచర్లకు తీసుకురానున్నారు.

నేడు సీమలో భారీ వర్షాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకూ ఉపరితల ద్రోణి విస్తరించింది. మరోవైపు రాష్ట్రంలో పలు చోట్ల ఎండ తీవ్రత పెరిగింది. కావలిలో 37.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. వీటివల్ల వాతావరణ అనిశ్చితి నెలకొని రాష్ట్రంలో పలుచోట్ల మంగళవారం తెలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. అక్కడక్కడ భారీవర్షాలు పడ్డాయి. భీమవరంలో 7.0, మలికిపురంలో 6.65, పి.గన్నవరంలో 6.5, పశ్చిమగోదావరి జిల్లా మురుటూరులో 5.85 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రానున్న 24 గంటల్లో రాయలసీమలో ఎక్కువచోట్ల, కోస్తాలో పలు చోట్ల ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని, రాయలసీమలో అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, రానున్న వారం రోజులపాటు రాష్ట్రంలో అక్కడక్కడ ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని ఇస్రో వాతావరణ నిపుణుడు వెల్లడించారు. కాగా, ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ఉపనదులు పొంగిపొర్లుతుండడంతో మంగళవారం సాయంత్రానికి గోదావరి నీటిమట్టం పెరిగింది. పోలవరం నుంచి 7,66,812 క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు.

'సిందూర్'తో మసూద్ కుటుంబం ఛిన్నాభిన్నం

- జైషే మొహమ్మద్ టాప్ కమాండర్ ఇలియాస్ అంగీకారం


మసూద్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌కు చెందిన జైషే మొహమ్మద్ ఉగ్రవాద సంస్థ చీఫ్ మౌలానా మసూద్ అజార్ కుటుంబం చిన్నాభిన్నమైపోయిందని ఆ సంస్థ టాప్ కమాండర్ మసూద్ ఇలియాస్ కశ్మీరీ అంగీకరించాడు. ఈ మేరకు ఇలియాస్ మాట్లాడిన తాజా వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'ఈ నేలను కాపాడేందుకు మేం పోరుబాట పట్టాం. దీని సరిహద్దులను కాపాడేందుకు ఢిల్లీ, కాబూల్, కాందహార్‌లలో పోరాడాం. సర్వం త్యాగం చేశాం. అయితే, మే 7న భారత దళాలు బహవల్‌పూర్‌పై దాడి చేసి, మౌలానా మసూద్ అజార్ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేశాయి' అని ఆ వీడియోలో ఇలియాస్ పేర్కొన్నాడు. పాకిస్థాన్‌లోని పంజాబ్ రాష్ట్రం బహవల్‌పూర్‌లో కరాచీ-తొర్ఖం హైవే(ఎన్‌హెచ్-5) వద్ద జైషే మొహమ్మద్ ఉగ్రవాద సంస్థ ఆపరేషనల్ ప్రధాన కార్యాలయం ఉంది. ఇందులో సుమారు 600 మంది ఉగ్రవాదులు ఉంటారు. ఉగ్రవాదులకు తరచుగా శిక్షణ కార్యక్రమాలను ఇందులో నిర్వహిస్తుంటారు.

21 పోస్టులతో 5 ఏపీపీఎస్సీ నోటిఫికేషన్లు

అమరావతి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వివిధ శాఖల్లో ఖాళీల భర్తీకి ఏపీపీఎస్సీ మంగళవారం ఐదు నోటిఫికేషన్లు జారీచేసింది. రెండు జూనియర్ లెక్చరర్, ఒక బీసీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, అటవీ శాఖలో 13 డ్రాఫ్ట్స్‌మెన్ గ్రేడ్-2 టెక్నికల్ అసిస్టెంట్, గ్రామీణ తాగునీటి విభాగంలో మూడు ఏఈఈ, ఉద్యాన శాఖలో రెండు హార్టికల్చర్ ఆఫీసర్ పోస్టులకు నోటిఫికేషన్లు జారీచేసింది. ఇందులో మొదటి రెండు నోటిఫికేషన్లకు అక్టోబరు 7 వరకు, మిగిలిన మూడు నోటిఫికేషన్లకు 8వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఏపీపీఎస్సీ తెలిపింది.

దళితవాడల్లో
వెయ్యి ఆలయాలు!

మత మార్పిడులను అడ్డుకునేందుకే.. టీటీడీ పాలక మండలి నిర్ణయం

- రూ.10-20 లక్షలు శ్రీవాణి నిధుల కేటాయింపు
- ప్రతిష్ఠాత్మకంగా బ్రహ్మోత్సవాలు
- రద్దీ నియంత్రణకు తొలిసారి ఇస్రో సాయం
- ఆ పది రోజులూ సిఫారసు లేఖలపై వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు
- బోర్డు తీర్మానాలను వెల్లడించిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు


శ్రీవారి బ్రహ్మోత్సవాల బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో సింఘాల్, బోర్డు సభ్యులు

తిరుమల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో రాష్ట్రంలోని దళితవాడల్లో తొలి దశలో వెయ్యి ఆలయాలను నిర్మించాలని టీటీడీ పాలక మండలి నిర్ణయించింది. దళితవాడల్లో జరుగుతున్న మతమార్పిడులు అడ్డుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఆయా ప్రాంతాలను బట్టి రూ.10 లక్షలు, రూ.15 లక్షలు, రూ.20 లక్షల చొప్పున శ్రీవాణి ట్రస్టు నిధులు కేటాయిస్తామని తెలిపింది. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం మధ్యాహ్నం పాలక మండలి సమావేశం జరిగింది. చైర్మన్ బీఆర్ నాయుడు బ్రహ్మోత్సవాల బుక్‌లెట్‌ను ఆవిష్కరించి ఆ తర్వాత ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతరం ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ పాలక మండలి ఏర్పడ్డాక ఇవే తొలి బ్రహ్మోత్సవాలని.. ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అత్యంత వైభవంగా, దిగ్విజయంగా జరపాలని తీర్మానించామని చెప్పారు. భక్తులకు ఇబ్బందులు, అసౌకర్యాలు లేకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై సుదీర్ఘంగా చర్చించామని తెలిపారు. 'రద్దీ నియంత్రణ కోసం తొలిసారి ఇస్రో సహకారం తీసుకోవాలని నిర్ణయించామని, ప్రతినిమిషం వారు రద్దీని పర్యవేక్షిస్తూ అప్రమత్తం చేస్తూ సందేశాలిస్తారు. ఎల్ అండ్ టీ సంస్థ కూడా క్రౌడ్ మేనేజ్‌మెంట్‌కు సహకరిస్తుంది. బ్రహ్మోత్సవాల సందర్భంగా పది రోజులపాటు సిఫారసు లేఖలపై ఇచ్చే వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేశాం. స్వయంగా వచ్చే ప్రొటోకాల్ ప్రముఖులకే వీఐపీ బ్రేక్ దర్శనాలుంటాయి. వృద్ధులు, చిన్నపిల్లల తల్లిదండ్రులు, ఎన్నారైలకు ప్రత్యేక దర్శనాలు నిలిపివేస్తాం.' అని వెల్లడించారు. ఈ నెల 23న అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు మొదలవుతాయని, 24వ తేదీన మీన లగ్నంలో (సాయంత్రం 5.43-6.15 గంటల మధ్య) ధ్వజారోహణం, రాత్రి పెద్ద శేషవాహన సేవ జరుగుతుందన్నారు. అదే రోజు రాష్ట్రప్రభుత్వం తరపున సీఎం చంద్రబాబు శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని వెల్లడించారు.

మరికొన్ని నిర్ణయాలు..

- కర్ణాటక బెలగావిలోని కొలికోప్ప గ్రామంలో ఏడు ఎకరాల్లో శ్రీవాణి ట్రస్టు నిధులతో శ్రీవారి ఆలయ నిర్మాణం
- గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం అనంతవరంలో ఉన్న శ్రీవారి ఆలయంలో రాజగోపురం, ముఖమండపం, సుబ్రహ్మణ్యస్వామికి ఆభరణాలు, తాగునీటి సౌకర్యం కోసం రూ.7.20 కోట్లు.
- అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం పట్టాభిరామాలయంలో ఆలయ పుష్కరిణి, కల్యాణ వేదిక, రాజ గోపురం, తోరణం నిర్మాణానికి రూ.5.73 కోట్లు మంజూరు.
- గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజలో రూ.89.54 లక్షల విలువైన 74 సెంట్ల భూమిని కొనుగోలు చేసి టీటీడీకి విరాళంగా ఇచ్చేందుకు హైదరాబాద్‌కు చెందిన వెంకట్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి ముందుకొచ్చారు. ఆ విరాళం స్వీకరించేందుకు ఆమోదం.

తప్పుడు ప్రచారం చేస్తే జైలుకే

టీటీడీపై తప్పుడు ప్రచారాలు చేస్తే క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని బీఆర్ నాయుడు హెచ్చరించారు. 'ప్రతి చిన్న విషయానికీ టీటీడీపై అవాకులు చవాకులు పేలుతున్నారు. ఇకపై తప్పుడు ప్రచారం చేస్తే క్రిమినల్ కేసులు పెట్టేలా బోర్డులో తీర్మానించాం. శ్రీవేంకటేశ్వరస్వామిపై రోజూ ఏదో ఒక అవాస్తవంతో దుమ్మెత్తిపోస్తున్నారు. చిన్న విషయాలను పెద్దవిగా చేసి టీటీడీ పరువు ప్రతిష్ఠలను దెబ్బతీస్తున్నారు. అలాంటి వారిపై క్రిమినల్ కేసులు పెట్టి న్యాయవిచారణ చేయించి జైలుకు పంపుతామని తీవ్రంగా హెచ్చరిస్తున్నాం' అని చెప్పారు. వేదపారాయణదారుల పోస్టు భర్తీలో అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు రావడంతో తాత్కాలికంగా నిలిపివేశామన్నారు.

శ్రీవారి సేవలో గవర్నర్ అబ్దుల్ నజీర్



తిరుమల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం ఆయన రంగనాయక మండపానికి చేరుకోగా వేద పండితులు ఆశీర్వచనం చేశారు. అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

ఇకపై లక్కీడిప్ ద్వారా అంగప్రదక్షిణ టోకెన్లు

తిరుమల, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): శ్రీవారి అంగప్రదక్షిణ టోకెన్ల కేటాయింపు విధానంలో టీటీడీ మార్పు తీసుకువచ్చింది. ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్‌గా టోకెన్లు కేటాయిస్తుండగా, ఇకపై లక్కీడిప్ ద్వారా కేటాయించనున్నారు. ఈ టోకెన్లను మూడు నెలల ముందే ఆన్‌లైన్‌లో లక్కీడిప్ ద్వారా విడుదల చేస్తారు. శుక్రవారం మినహా ప్రతిరోజూ 750 టోకెన్లు, శనివారం 500 టోకెన్లు చొప్పున జారీ చేస్తారు. భక్తులు తిరిగి రెండోసారి ఈ సేవ పొందేందుకు గడువు 90 రోజుల బదులు 180 రోజులుగా నిర్ణయించారు.

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (ఆలయ శుద్ధి) శాస్త్రోక్తంగా జరిగింది. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు ఈ శుద్ధి కార్యక్రమాన్ని అర్చక బృందం ఆగమోక్తంగా నిర్వహించింది. కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

గుంజలకు తాళ్లతో చేతులు కట్టేసి..
బెల్టుతో హింసించి..

- భార్యకు నరకం చూపించిన భర్త
- ప్రకాశం జిల్లాలో వెలుగులోకి


భార్యను కట్టేసి దాడి చేస్తున్న బాలాజీ

తర్లుపాడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భార్య రెండు చేతులు తాళ్లతో పాక గుంజలకు కట్టేసి, బెల్టుతో బాదుతూ, జుట్టుపట్టుకుని వెనక్కి విరిచి కాళ్లతో తన్నుతూ హింసించాడో భర్త. ఒక రోజు రాత్రంతా ఈ నరకాన్ని అనుభవించిన ఆమె, మళ్లీ దాడికి ప్రయత్నించడంతో ఎలాగో తప్పించుకుని బయటపడింది. ప్రకాశం జిల్లా తర్లుపాడు మండలం కలుజువ్వలపాలెంలో ఈ దారుణం చోటుచేసుకుంది. కలుజువ్వలపాడు గ్రామానికి చెందిన గురునాథం బాలాజీకి దగ్గర బంధువైన భాగ్యలక్ష్మితో తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు ఆడ పిల్లలు, మగ పిల్లాడు. మద్యానికి బానిసైన బాలాజీ భార్యను తీవ్రంగా హింసించేవాడు. ఈక్రమంలోనే భార్యపిల్లల్ని వదిలేసి వేరే మహిళతో హైదరాబాద్‌లో ఉంటున్నాడు. భాగ్యలక్ష్మి స్థానిక బేకరీలో పనిచేస్తూ పిల్లలను చదివిస్తోంది. శనివారం గ్రామానికి వచ్చిన బాలాజీ భార్యను డబ్బుల కోసం వేధించడం మొదలుపెట్టాడు. అతని అక్క రమణమ్మ, మేనల్లుడు విష్ణు సహకరించారు. రాత్రి 9 నుంచి వేకువజామున 5 గంటల వరకూ హింసించారు. మరలా సోమవారం రాత్రి ఆమెపై దాడికి ప్రయత్నించగా తప్పించుకొని సమీపంలోని చర్చి వద్దకు వెళ్లడంతో అక్కడ ఉన్న స్థానికులు బాలాజీ నుంచి కాపాడారు. ఇది సోషల్ మీడియాలో వైరల్ అయింది. మంగళవారం రాత్రి పొదిలి సీఐ వెంకటేశ్వర్లు గ్రామానికి చేరుకొని బాధితురాలిని మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. కాగా, గ్రామంలో దీనిపై విచారణ చేశామని, ఇంట్లో నిందితుడు లేడని, ప్రస్తుతానికి భాగ్యలక్ష్మి ఎలాంటి ఫిర్యాదు చేయలేదని, ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి నిందితుడిపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ బ్రహ్మనాయుడు పేర్కొన్నారు.

పద్మావతి యూనివర్సిటీకి ఏపీఆర్‌సెట్ నిర్వహణ బాధ్యత

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ ప్రవేశానికి చేపట్టే ఏపీఆర్‌సెట్ నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీకి అప్పగించింది. ఆ యూనివర్సిటీ బయో టెక్నాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఉషను కన్వీనర్‌గా, ప్రొఫెసర్ జాన్ సుష్మాను కో-కన్వీనర్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మంగళవారం ఉత్తర్వులను వెలువరించింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆ చూపుతోనే సెప్టెంబర్ 17 సార్థకత!

'కొందరు ఆగమంటే ఒప్పుకోని చరిత్రా! / పద ముందుకు!' అంటూ తెలంగాణ ఇతిహాస సత్యాన్ని కవి కుందుర్తి ఆవిష్కరించారు. చరిత్ర చేసిన నష్టానికి పరిహారంగా తెలంగాణకు కాలం ప్రసాదించిన వరమే హైదరాబాద్. డెబ్బై ఎనిమిది సంవత్సరాల క్రితం సరిగ్గా ఇదే రోజున నాటి తెలంగాణ జనకోటి శతాబ్దాల రాచరిక పెత్తనాల నుంచి బయటపడి ప్రజాస్వామ్య పాలన దిశగా నిర్ణయాత్మక ముందడుగువేసింది. మధ్యయుగాలలో ఒక సామాన్య నగర స్థాయి నుంచి ఆధునిక ప్రపంచ నగరంగా పరిణమించి, ప్రస్తుతం నవ్యాతి నవ్య సాంకేతికతల సృష్టికి నెలవయిన సిలికాన్ వ్యాలీని మించి నవకల్పనల కేంద్రంగా ఎదగగలననే ఆత్మవిశ్వాసాన్ని ప్రకటిస్తున్న తెలుగు నగరం హైదరాబాద్.

మేధోభాగ్యనగరిగా విలసిల్లుతున్న హైదరాబాద్ వైభవం 1990ల్లో ప్రవేశించిన ఐటీ సాంకేతికతలతో ఆరంభమయిందని సామాన్యులతో పాటు విద్యావంతులు సైతం భావిస్తుంటారు. అయితే ఇది నిజం కాదు. భారతదేశ ఐదో పెద్ద నగర ప్రగతి ప్రస్థానం ఒక శతాబ్ది కిందటే ప్రారంభ మయింది. ఇరవయో శతాబ్ది ఆరంభంలో బ్రిటిష్ అధికారులతో పాటు ఉత్తర, పశ్చిమ భారతావని నుంచి వచ్చిన వారితో హైదరాబాద్ రాజ్యంలో ఆధునికీకరణ ప్రక్రియలు మొదలయ్యాయి. 1908లో మూసీ నది వరద విపత్తుతో కుదేలయిన నగరాన్ని పునర్నిర్మించేందుకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య రూపొందించిన ప్రణాళికను నిజాం ప్రభుత్వం అమలుపరిచింది. అదే కాలంలో ఐరోపాలోని గొప్ప నగరాలకు సమరీతిలో హైదరాబాద్‌ను రూపొందించాలన్న ఏడవ నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ ముందు చూపు ఫలితంగా సిటీ ఇంప్రూవ్‌మెంట్ బోర్డ్, ఉస్మానియా జనరల్ హాస్పిటల్, ఉస్మానియా విశ్వవిద్యాలయం మొదలైన సంస్థలు ప్రభవించాయి. మొదటి ప్రపంచయుద్ధం పారిశ్రామిక పరిశోధనలకు ఉద్దీపన అయింది. యూరోపియన్ ఖగోళ శాస్త్రవేత్తలకు స్ఫూర్తినిచ్చిన ఖగోళ పరిశోధనలు, నోబెల్ పురస్కారాన్ని సాధించిన వైద్యశాస్త్ర పరిశోధనలు ఆనాడు హైదరాబాద్‌లో జరిగాయి. 1948 అనంతరం వైజ్ఞానిక, సాంకేతిక పరిశోధనలకు ప్రాధాన్యమిస్తూ కేంద్రంలోని నెహ్రూ ప్రభుత్వం అమలుపరిచిన విధానాలు, హైదరాబాద్‌లో లభ్యమైన ప్రత్యేక సానుకూల పరిస్థితులు, ప్రభావశీల వ్యక్తుల పలుకుబడితో హైదరాబాద్‌లో అనేక ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశోధనా కేంద్రాలు ఏర్పడ్డాయి. ఇవన్నీ 1990 అనంతరం ప్రపంచీకరణ విధానాలతో వేగవంతమైన ఆర్థిక పురోగతికి విశేషంగా దోహదం చేశాయన్న వాస్తవం విస్మరించలేనిది. కోవిడ్ విపత్తు కాలంలో వ్యాక్సీన్ల తయారీకి హైదరాబాద్ ప్రధాన కేంద్రం కావడం ఆ సానుకూల పరిణామాల ఫలితమే అనడంలో సందేహం లేదు.

ఈ ప్రగతిశీల చరిత్రలో మరీ ముఖ్యంగా గమనార్హమైన వాస్తవం ఒకటి ఉన్నది. అమానుష భూస్వామ్య దోపిడీ, అణచివేతలకు పల్లె తెలంగాణలోని చైతన్యశీల సామాన్యులు ఎంత మొక్కవోని దీక్ష, త్యాగశీలతతో పోరాడారో 'పట్నం' తెలంగాణలోని విద్యావంతులు, శాస్త్రవేత్తలు జనహిత అధికార ప్రముఖులు అంతే దృఢ సంకల్పంతో, స్వార్థరహితంగా హైదరాబాద్‌ను నవీన వైజ్ఞానిక పరిశోధనల, సాంకేతికతల నెలవుగా, పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అంకిత భావంతో కృషి చేశారు. ఈ విద్యాధికులు, వైజ్ఞానికులలో అత్యధికులు హైదరాబాద్ వెలుపలి ప్రాంతాలకు చెందినవారే. ఉస్మానియా విశ్వవిద్యాలయ భావనకు అంకురార్పణ చేసి, దాని ఆధారంగా ఒకనాడు విద్వత్ కేంద్రంగా వెలుగొందిన బాగ్దాద్‌లా హైదరాబాద్‌ను ప్రపంచ మేధో కేంద్రంగా అభివృద్ధిపరచాలని కలలుగన్న ఉదాత్తులే అందుకొక నిదర్శనం. నిజాం నవాబు పాలన దౌష్ట్యాలపై కుల మతాలకు అతీతంగా తిరగబడిన వీర తెలంగాణ త్యాగధనులవలే ఈ విద్వత్ తెలంగాణలోని వారూ తమ వ్యక్తిగత బాంధవ్యాలలో గానీ, సామాజిక సంబంధాలలో గానీ, వృత్తిగత వ్యవహారాలలోగానీ కుల మతాల సంకుచిత పరిమితులను అధిగమించినవారే. వీర తెలంగాణ యోధులతో పాటు ఈ విద్వత్ పరులు, వైజ్ఞానికులను ఈ సందర్భంగా సంస్మరించుకుని గౌరవించాలి. ఇదే సమయంలో, నేటి స్వార్థ ప్రయోజనాలకు వీర తెలంగాణ చరిత్రపై మతం మరకలు వేసేందుకు జరుగుతోన్న ప్రయత్నాలను నిర్ద్వంద్వంగా తిరస్కరించాలి.

హైదరాబాద్ ప్రపంచ స్థాయి నగరంగా రూపొందేందుకు కారకులైన వారందరూ ముఖ్యంగా తొలినాళ్లలో మేధో శ్రమను జీవనశైలిగా చేసుకోవాలనే సంకల్పం, తమ కృషి సమాజ శ్రేయస్సుకు తోడ్పడేదికావాలన్న లక్ష్యమూ ఉన్నవారే. బహుళ మేధో రీతులలో లక్ష్య సంకల్పాలలో ఏకత్వాన్ని సమష్టిగా ఆచరించిన ఆదర్శప్రాయులు. మరింత సమున్నతంగా ఈ బహుళ ఏకత్వాన్ని హైదరాబాద్ నగర గంగా–జమున తెహజీబ్‌తో మేళవించినప్పుడే సెప్టెంబర్ 17కు స్ఫూర్తిదాయక సార్థకత సమకూరుతుంది. మేధోభాగ్యనగరి సకల మనుషులను సమదృష్టితో ప్రేమించే, గౌరవించే సమాజంగా కూడా వర్ధిల్లుతుంది.

ఆత్మగౌరవ ప్రవక్త పెరియార్

ఈ నెల మొదటి వారంలో బ్రిటన్‌లోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో 'The Self-Respect Movement and its Legacies' పేరుతో పెరియార్ ఆత్మగౌరవ ఉద్యమంపై రెండు రోజుల సమావేశం జరిగింది. ఆత్మగౌరవ ఉద్యమానికి నూరేళ్లు నిండిన సందర్భంగా ఈ సమావేశం జరిగింది. ఆసియా, ఆఫ్రికా, అమెరికా ఖండాల నుంచి 25 దేశాలకు చెందిన చరిత్ర కారులు, పరిశోధకులు మేధావులు ఇందులో పాల్గొన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో పెరియార్ చిత్రపటాన్ని ఆవిష్కరించారు. సామాజిక న్యాయం, మహిళా సాధికారత, హేతువాదం తరఫున పెరియార్ చేసిన పోరాటానికి ఇది ఘనమైన నివాళి.


పెరియార్ అసలు పేరు ఈరోడ్ వేంకటరామస్వామి నాయకర్. 1879 సెప్టెంబర్ 17న మద్రాసులో ఈరోడ్‌లో జన్మించారు. 23 ఏళ్ల వయస్సులో 1904లో జరిగిన ఒక సంఘటన పెరియార్ ఆలోచనలను మార్చివేసింది. అప్పటికే ఆయనలో ఆధ్యాత్మికత చింతన ఉండేది. ఆధ్యాత్మిక యాత్రలో భాగంగా కాశీని సందర్శించారు. ఒకరోజు తీవ్రమైన ఆకలితో ఆహారం కోసం వెతుకుతున్నారు. ఒక సత్రం వద్ద రకరకాల ఆహార పదార్థాలు సిద్ధంగా ఉన్నాయి. చాలా మంది భోజనం చేస్తున్నారు. పెరియార్ కూడా లోపలికి వెళ్లబోయారు. కానీ అక్కడి నిర్వాహకులు "బ్రాహ్మణేతరులకు భోజనం చేసే అనుమతి లేదు" అంటూ ఆయనను బయటికి తోసివేశారు. ఈ సంఘటన పెరియార్ ఆలోచనలలో మార్పుకు కారణమైంది. ఈ ఘటనతోనే ఆయనలో సామాజిక అసమానతలు, మత అంధ విశ్వాసాలు, కులవివక్షకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేయాలన్న బీజం పడింది.

1919లో గాంధీజీ స్ఫూర్తితో పెరియార్ స్వాతంత్ర్య సమరంలో అడుగుపెట్టారు. ఈరోడ్ మున్సిపాలిటీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సత్యాగ్రహాలు, సహాయనిరాకరణ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొన్నారు. కానీ 1922–25 మధ్య జరిగిన కొన్ని సంఘటనలు పెరియార్‌ను జాతీయ కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చేలా చేశాయి. అంతేకాక, ఆయనను గాంధీజీకి వ్యతిరేకిగా కూడా మార్చేశాయి. ఈ పరిణామాలే చివరికి 1925లో ఆత్మగౌరవ ఉద్యమం ప్రారంభానికి దారితీశాయి.

1922లో తిరుప్పూరులో మద్రాస్ ప్రావిన్షియల్ కాంగ్రెస్ సమావేశం జరిగింది. విద్య, ఉద్యోగాలలో కులాల వారీ రిజర్వేషన్ కల్పించాలని పెరియార్ ఒక తీర్మానం ప్రవేశపెట్టారు. ప్రతినిధులు వర్గాలవారీగా చీలిపోవడంతో ఈ తీర్మానం విఫలమైంది. దీనిని బట్టి కాంగ్రెస్‌కు సామాజిక సమానత్వంపై స్పష్టమైన దృష్టి లేదని పెరియార్ భావించారు.

1923లో జరిగిన మరో సంఘటన కూడా ఆత్మగౌరవ ఉద్యమానికి పునాది వేసింది. ఆయన మున్సిపాలిటీలోని ఒక పాఠశాలలో బ్రాహ్మణేతర విద్యార్థులను తరగతి గదిలో కాకుండా వరండాలో మాత్రమే కూర్చోబెట్టేవారు. దీన్ని పెరియార్ తీవ్రంగా వ్యతిరేకించారు. అసమానతలకు వ్యతిరేకంగా బోధించాల్సిన విద్యాలయాలలోనే విద్యార్థుల మధ్య అసమానతలను పెంపొందించడం సరైనది కాదని పెరియార్ భావించారు.

జాతీయ కాంగ్రెస్, గాంధీజీ నుంచి పెరియార్ దూరం కావడానికి, 1925లో ఆత్మగౌరవ ఉద్యమం ప్రారంభం కావడానికి ప్రధాన కారణం – వైకోం సత్యాగ్రహం.



1932లో బ్రిటీష్ ప్రభుత్వం దళితులకు ప్రత్యేక నియోజకవర్గాల ద్వారా రాజకీయ రిజర్వేషన్లు కల్పించింది. గాంధీజీ దీనికి వ్యతిరేకంగా ఆమరణ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంలో పెరియార్ గాంధీజీని తీవ్రంగా విమర్శించి, అంబేడ్కర్‌కు బాసటగా నిలిచారు.

ప్రస్తుత కేరళలోని ట్రావెన్కోర్ రాష్ట్రంలో ఒక చిన్న పట్టణం వైకోం. ఇక్కడ ప్రసిద్ధ మహాదేవ ఆలయం ఉంది. ఈ ఆలయానికి వచ్చే నాలుగు రోడ్లపైనా అణగారిన జాతులు నడవకుండా నిషేధం విధించారు. దీనికి వ్యతిరేకంగా కేరళలో సామాజిక ఉద్యమకారులు పోరాటం ప్రారంభించారు. టి.కే. మాధవన్, కె. కలప్పన్ నాయకత్వంలో సత్యాగ్రహం మొదలైంది. వీరిద్దరూ కేరళ రాష్ట్రంలో సామాజిక సంస్కరణలకు, విద్యా ఉద్యమానికి ఆద్యులైన నారాయణ గురు శిష్యులు. వీరిని జైలులో పెట్టిన తరువాత, జాతీయ కాంగ్రెస్ జోక్యంతో పెరియార్ ఈ ఆందోళనకు నాయకత్వం వహించారు. పెరియార్ ఈ ఉద్యమాన్ని బలంగా నడిపించారు. జైలుకు కూడా వెళ్లాడు.

చివరికి 1925లో గాంధీజీ జోక్యంతో ఈ వివాదానికి రాజీ మార్గం దొరికింది. అయితే, పెరియార్ దీనిని పూర్తి విజయంగా భావించలేదు. ఎందుకంటే ఆలయానికి వచ్చే నాలుగు రోడ్లలో మూడింటిని అందరూ నడవడానికి అనుమతించారు. కానీ ప్రధాన వీధిలోకి అణగారిన వర్గాలకు ప్రవేశం లేదు. ఆయన దీన్ని తాత్కాలిక పరిష్కారంగా మాత్రమే భావించారు. ఈ రాజీ ఫార్ములాను తిరస్కరించి, 'సంపూర్ణ ప్రవేశమే డిమాండ్' అని పట్టుబట్టారు. కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి 1925లో ఆత్మగౌరవ ఉద్యమాన్ని ప్రారంభించారు.

సామాజిక అణచివేత, అసమానతలు, లింగ వివక్ష, మత మూఢాచారాలకు వ్యతిరేకంగా ఈ ఆత్మగౌరవ ఉద్యమం మొదలైంది. ఈ ఉద్యమం ప్రధాన లక్ష్యాలు: అస్పృశ్యత నిర్మూలన, దేవాలయాలలో అణగారిన వర్గాల ప్రవేశం, విద్యా ఉద్యోగాలలో శూద్రులకు అతిశూద్రులకు ప్రాతినిధ్యం (రిజర్వేషన్), కులాంతర వివాహాలకు ప్రోత్సాహం, బాల్యవివాహాల నిర్మూలన, విధవా పునర్వివాహాలకు ప్రోత్సాహం, మహిళలకు సమాన విద్య, ఆస్తి హక్కులు మొదలైనవి.

మహిళలు ఇష్టపడ్డవారిని వివాహం చేసుకునే స్వేచ్ఛ కలిగి ఉండాలని పెరియార్ బలంగా వాదించారు. ఆత్మగౌరవ వివాహాలను ప్రోత్సహించినారు. తన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి 'కుది అరసు' (Kudi Arasu) అనే పత్రికను ప్రారంభించారు. అక్కడ ఆయనతోపాటు భార్య నాగమ్మై కూడా వ్యాసాలు రాసేవారు.

పెరియార్ స్ఫూర్తితోనే 1927లో మద్రాసు ప్రెసిడెన్సీలో జస్టిస్ పార్టీ ప్రభుత్వం కులాధారిత రిజర్వేషన్లను తీసుకువచ్చింది. 1927 నవంబర్ 16న జీఓ నంబర్ 613 ద్వారా దేశంలోనే మొదటి కులాధారిత రిజర్వేషన్లు అమలులోకి వచ్చాయి. ఈ జీఓ ప్రకారం బ్రాహ్మణేతర హిందువులకు 44శాతం, బ్రాహ్మణులకు 16శాతం, ముస్లింలకు 16శాతం, ఆంగ్లోఇండియన్లు & క్రైస్తవులకు 16శాతం, షెడ్యూల్డ్ కులాలకు 8శాతం రిజర్వేషన్లు కల్పించారు.

1932లో బ్రిటిష్ ప్రభుత్వం దళితులకు ప్రత్యేక నియోజకవర్గాల ద్వారా రాజకీయ రిజర్వేషన్లు కల్పించింది. గాంధీజీ దీనికి వ్యతిరేకంగా ఆమరణ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంలో పెరియార్ గాంధీజీని తీవ్రంగా విమర్శించి, అంబేడ్కర్‌కు బాసటగా నిలిచారు. 1938లో అంబేడ్కర్ మద్రాస్ పర్యటన సమయంలో పెరియార్ ఆయన్ని కలుసుకొని ప్రత్యేక నియోజకవర్గాల డిమాండ్‌కు తన మద్దతు తెలిపారు. 1940లో జస్టిస్ పార్టీకి పెరియార్ నాయకత్వం వహించారు. 1944లో జస్టిస్ పార్టీని 'ద్రావిడర్ కజగమ్' (DK)గా మార్చాడు.

1938లో ఒక ప్రత్యేక సమవేశంలో సంఘసంస్కర్తలు, ఆయన అనుచరులు కలిసి ఇ.వి. రామస్వామికి 'పెరియార్' బిరుదును ప్రదానం చేశారు. పెరియార్ అనే పదానికి అర్థం 'గౌరవనీయుడు', 'మహనీయుడు'. 1970లో ఆయన బతికుండగానే యునెస్కో ఆయనను 'దక్షిణాసియా సోక్రటీస్' బిరుదుతో గౌరవించింది. 1973 డిసెంబర్ 24న ఆయన మరణించారు. సామాజిక అసమానతలు, మహిళల పట్ల అణచివేత, వివక్ష, మత మూఢాచారాలు చర్చనీయాంశాలుగా ఉన్నంత కాలం పెరియార్ జీవించే ఉంటారు. ఆయన కీర్తి ఖండాంతరాలకు వ్యాపిస్తూనే ఉంటుంది.

• మోకా సత్తిబాబు
ఐపీఎస్

(నేడు 'పెరియార్' జయంతి)

బిహార్‌ను మోదీ మ్యాజిక్ ఆకట్టుకునేనా?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'బిహార్‌లో చొరబడిన ప్రతి ఒక్కరూ వెళ్లిపోవాల్సిందే.' అని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సోమవారం బిహార్‌లో పూర్ణియా జిల్లాలో మాట్లాడుతూ అన్నారు. బిహార్‌లో గత జనవరి నుంచి మోదీ ఏడవ పర్యటన ఇది. ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా మోదీ అక్కడి ప్రజలను దృష్టిలో ఉంచుకుని తన ఎన్నికల ప్రచారాస్త్రాలను సిద్ధం చేసుకుంటారు. బిహార్‌లో తన ప్రచారాన్ని ఏ దిశన మళ్లించబోతున్నారో ఇప్పటికే స్పష్టమైంది. బిహార్‌లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ పేరిట అనేక మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించేందుకు ఎన్నికల కమిషన్ ఉధృతంగా చేపట్టిన ప్రక్రియను ప్రతిపక్షాలు మాత్రమే కాదు, సుప్రీంకోర్టు కూడా తప్పుపట్టింది. మొత్తం ఎస్ఐఆర్‌నే నిలిపివేస్తాం జాగ్రత్త అని సుప్రీంకోర్టు సోమవారం హెచ్చరించింది.


ఎస్ఐఆర్‌ను వివాదరహితంగా నిర్వహించడంలో ఎన్నికల కమిషన్ పూర్తిగా విఫలమైంది. ఓట్ల చోరీ విషయంలో ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు కమిషన్ వద్ద స్పష్టమైన సమాధానాలు లేవు. నిజానికి ఎన్నికల కమిషన్ బీజేపీ ప్రభుత్వానికి ప్రయోజనం కన్నా నష్టం ఎక్కువ చేస్తుందనడంలో ఆశ్చర్యం లేదు. ఈ పరిస్థితి నుంచి బీజేపీని కాపాడాల్సిన బాధ్యతను మోదీయే పూర్తిగా తన భుజస్కంధాలపై వేసుకున్నారు. అక్రమ వలసదారుల వల్ల బిహార్, పశ్చిమ బెంగాల్, అస్సాం ప్రజలు తమ కూతుళ్లు, చెల్లెళ్ల భద్రత పట్ల ఆందోళనతో ఉన్నారని మోదీ ప్రకటించారు. అంటే అక్రమంగా వలసవచ్చిన వారు ఈ రాష్ట్రాల్లో చాలా అకృత్యాలకు పాల్పడుతున్నారని ఆయన ఆందోళన సారాంశం. పైగా ఇలాంటి వారిని కాపాడేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని, యాత్రలు కూడా చేస్తున్నాయని మోదీ ఆరోపించారు. ఓట్ చోరీకి వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ చేపట్టిన ఓటర్ అధికార్ యాత్రను ఉద్దేశంలో ఉంచుకునే ఆయన ఈ విమర్శలు చేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

ఉత్తరాదిన అత్యంత కీలక ప్రభావం చూపే బిహార్‌లో మాత్రం బీజేపీ గత కొన్ని దశాబ్దాలుగా విశ్వయత్నాలు చేస్తున్నప్పటికీ స్వంతంగా అధికారంలోకి రాలేని స్థితి ఉన్నది. మండల్ రాజకీయాలు ప్రవేశించిన తర్వాత లాలూ ప్రసాద్ యాదవ్ ఆవిర్భావంతో ఓబీసీలు, మైనారిటీలు సంఘటితమయ్యారు. 1995లో జార్జి ఫెర్నాండెజ్, నితీశ్ కుమార్‌తో కలిసి లాలూతో వేరుపడ్డ తర్వాత కూడా 2005 వరకు లాలూ ఆధిపత్యాన్ని తగ్గించలేకపోయారు. 1998, 1999 లోక్‌సభ ఎన్నికల్లో, 2000లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఫెర్నాండెజ్, నితీశ్ కుమార్‌లు ఇద్దరూ బీజేపీతో చేతులు కలిపారు. అప్పటికి లాలూ పశుగ్రాసం కుంభకోణంలో చిక్కుకుని తన భార్య రబ్రీదేవిని ముఖ్యమంత్రి చేయాల్సి వచ్చింది. 2000లో నితీశ్‌కుమార్ ముఖ్యమంత్రి అయినప్పటికీ మెజారిటీ నిరూపించుకోలేకపోవడంతో మళ్లీ రబ్రీదేవి ముఖ్యమంత్రి అయి 2005 వరకు అధికారంలో కొనసాగారు. ఆ తర్వాత ఎన్డీఏలో నితీశ్‌కుమార్ తిరుగులేని నాయకుడయ్యారు. 2010లో నితీశ్‌కుమార్ నాయకత్వంలోని జేడీ(యు) 115 సీట్లు సాధించగా, బీజేపీ 91 సీట్లు సాధించింది.

కానీ బీజేపీలో క్రమక్రమంగా ఒక ప్రత్యామ్నాయ నాయకుడుగా నరేంద్రమోదీ అవతరిస్తున్న క్రమంలో నితీశ్‌కుమార్ మొదట్లో ఆయనను సరిగా అంచనా వేయలేకపోయారు. 2005, 2010లో మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉంటూనే బీజేపీకి దేశమంతా స్టార్ క్యాంపెయినర్‌గా అవతరిస్తున్నప్పుడు నితీశ్ ఆయనను విస్మరించారు. 2010లో ఘన విజయం తర్వాత ఆయనలో జాతీయ స్థాయిలో ఆకాంక్షను రేకెత్తించింది. మోదీని వ్యతిరేకిస్తే లాలూ ముస్లిం ఓట్ బ్యాంకును కూడా ఆకట్టుకోగలననుకున్నాడు. తొలుత బిహార్‌లో మోదీని ప్రచారానికి పంపవద్దని బీజేపీ నాయకత్వాన్ని అడ్డుకున్న నితీశ్‌కుమార్.. మోదీని ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రకటించడంతో ఎన్డీఏ నుంచి తప్పుకున్నాడు. కానీ 2014లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మోదీ ప్రభంజనంలో బిహార్‌లో బీజేపీకి 22 సీట్లు రాగా 40 సీట్లకు పోటీ చేసిన జేడీ(యు) 2 సీట్లకు పరిమితమైంది. దీనితో 2015లో అతడు మళ్లీ లాలూతో చేతులు కలిపి ముఖ్యమంత్రి పదవి కోసం రాజీపడాల్సి వచ్చింది.

ఒకప్పుడు నితీశ్‌కుమార్ తనను తీవ్రంగా వ్యతిరేకించి, తనను రాష్ట్రంలో అడుగు పెట్టనీయకుండా చేసినప్పటికీ అతడినే చేరదీసి బిహార్‌లో ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పాటు చేయగలగడం మోదీ ప్రత్యేకత. నిజానికి జేడీ(యు)–ఆర్‌జేడీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మోదీ ఢిల్లీ నుంచి కొన్ని వ్యూహాత్మక చర్యలు తీసుకున్నారు. మాఫియా డాన్, ఆర్‌జేడీ ఎంపీ షాహబుద్దీన్ 2016 సెప్టెంబర్‌లో వ్యూహాత్మకంగా విడుదల కావడం అందులో భాగం. అతడు బయటకు వచ్చీ రాగానే పెద్ద ఎత్తున ర్యాలీని నిర్వహించి నితీశ్‌కుమార్‌ను అసమర్థ ముఖ్యమంత్రిగా దూషించడం మొదలు పెట్టాడు. అదే సమయంలో లాలూ, తేజస్వి నివాసాలపై సీబీఐ దాడులు తీవ్రతరం కావడం మరో వ్యూహం. తన ప్రభుత్వ విశ్వసనీయత పడిపోతుండడం, ఆర్‌జేడీ నుంచి ఒత్తిళ్లను, అవమానాలను తట్టుకోలేకపోవడంతో నితీశ్ ఆర్‌జేడీతో తన స్నేహం పొసగదని గ్రహించి రాజీనామా చేశాడు. ఈ అదనుకోసమే ఎదురు చూసిన మోదీ, నితీశ్ రాజీనామా చేసిన మూడు గంటల్లోనే ఆయనకు మద్దతునిచ్చేందుకు బీజేపీ నాయకత్వాన్ని ఒప్పించారు. కేవలం 14 గంటల వ్యవధిలో బీజేపీ ఒక ముఖ్యమైన రాష్ట్రాన్ని చేజిక్కించుకోగలగడం మోదీ మాస్టర్ స్ట్రోక్ అని చెప్పక తప్పదు. అంతే కాదు, 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ–జేడీ(యు) కూటమి 40 సీట్లలో 39 సీట్లు గెలుచుకోవడమే కాదు, 2020 అసెంబ్లీ ఎన్నికల్లో నితీశ్‌కుమార్ కంటే ఎక్కువ సీట్లు సాధించినా బీజేపీ ఆయనకే ముఖ్యమంత్రి పట్టాన్ని కట్టబెట్టింది.

ఈ నేపథ్యంలో మరో రెండు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న బిహార్‌లో పరిస్థితి ఏ విధంగా ఉంటుంది? గత రెండు దశాబ్దాలుగా అధికారంలో ఉన్న నితీశ్ ఆరోగ్య పరిస్థితి అంత బాగా లేదు. ఆయన నాయకత్వ ప్రభావం క్షీణిస్తోంది. బిహార్‌లో బీజేపీకి సారథ్యం వహించదగిన సమర్థులైన స్థానిక నాయకత్వం లేదు. మరోవైపు ప్రతిపక్షాలు కలిసికట్టుగా కార్యాచరణకు పూనుకుంటున్నాయి. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చేపట్టిన ఓటర్ అధికార్ యాత్ర ఆ పార్టీ పుంజుకునేందుకు తోడ్పడే అవకాశాలను కల్పించింది. ఈ పరిస్థితుల్లో బిహార్‌లో బీజేపీని ఆదుకోగలిగిన నాయకుడు మోదీ తప్ప మరెవరూ కనిపించడం లేదు. కానీ మోదీ ఒక్కరే బిహార్‌లో బీజేపీకి అత్యధిక సీట్లు సాధించి పెట్టగలరా అన్నది ఇప్పుడు రాజకీయ పరిశీలకుల ముందున్న ప్రశ్న. బీజేపీకి బలమైన సంస్థాగత సామర్థ్యం, క్రమశిక్షణ గల కేడర్, సైద్ధాంతిక స్పష్టత ఉన్నప్పటికీ నితీశ్‌తో చేతులు కలపకుండా స్వంతంగా అధికారంలోకి రాగలమనే ధైర్యం ఆ పార్టీకి లేదు. అంతేగాక, బిహార్ ఇంకా ఓబీసీ ఆధిపత్య రాష్ట్రం. బీజేపీ ఆ రాష్ట్రంలో ఇంకా అగ్రవర్ణాల పార్టీ అన్న ముద్ర పోగొట్టుకోలేదు. నితీశ్ వంటి నేతను స్వంతంగా సృష్టించుకోలేదు. ఆ రాష్ట్రంలో పట్టణ జనాభా ఇప్పటికీ 15 శాతం దాటలేదు. మరి బీజేపీ ఆ రాష్ట్రంలో పూర్తిగా ఎలా చొచ్చుకుపోగలదు?



బిహార్‌లో అభివృద్ధి గురించి, ఆ రాష్ట్రానికి తాము విడుదల చేసిన లక్షల కోట్ల గురించి చెప్పి ఓట్లు అడగడం సరైన విషయం కాదని మోదీకి తెలియనిది కాదు. అందుకే అక్రమ వలసదారుల సమస్యను తీవ్ర స్థాయిలో లేవనెత్తడం ప్రారంభించారు. నిజంగా అక్కడ అక్రమ వలసదారుల సమస్య ఉన్నదా? ఉంటే ఎంతవరకు అది ఎన్నికలను ప్రభావితం చేస్తుంది? కుల సమీకరణలు ఎక్కువగా ఉన్న బిహార్‌లో మత సమీకరణలు ఎంతవరకు పనిచేస్తాయి?

మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ సగటున ప్రతి ఏడాదీ బిహార్‌కు పెద్ద ఎత్తున ప్యాకేజీ ప్రకటిస్తూనే ఉన్నది. 2015లో రూ.1.25 లక్షల కోట్ల నుంచి, తాజాగా ప్రకటించిన రూ. 40 వేల కోట్ల వరకు లెక్క తీస్తే బిహార్‌కు రూ.2 లక్షల కోట్లకు పైగా కేంద్రం విడుదల చేసే ఉండాలి. ఇంత మొత్తం విడుదల జరిగితే బిహార్ రూపురేఖలు మారి ఉండాలి. కానీ బిహార్ ఇప్పటికీ వెనుకబడిన రాష్ట్రమే. అత్యధికశాతం మంది నిరక్షరాస్యులు. నిరుద్యోగులు. నీతీ ఆయోగ్ నివేదిక ప్రకారమే సహస్రాబ్ది లక్ష్యాల విషయంలో బిహార్ అట్టడుగు స్థానంలో ఉన్నది. దేశంలో వివిధ రాష్ట్రాలకు నైపుణ్యం లేని శ్రమజీవులను పంపించడంలో బిహార్ అగ్రస్థానంలో ఉన్నది. బిహార్ కార్మికులు లేని నగరం అంటూ కనపడదు.

ఈ పరిస్థితుల్లో అభివృద్ధి గురించి, తాము విడుదల చేసిన లక్షల కోట్ల గురించి చెప్పి ఓట్లు అడగడం సరైంది కాదని మోదీకి తెలియనిది కాదు. అందుకే అక్రమ వలసదారుల సమస్యను తీవ్ర స్థాయిలో లేవనెత్తడం ప్రారంభించారు. అయితే బిహార్‌లో నిజంగా అక్రమ వలసదారుల సమస్య ఉన్నదా? ఉంటే ఎంతవరకు అది ఎన్నికలను ప్రభావితం చేస్తుంది? కుల సమీకరణలు ఎక్కువగా ఉన్న బిహార్‌లో మత సమీకరణలు ఎంతవరకు పనిచేస్తాయి? చెప్పడం కష్టం.

నిజానికి బిహార్ నుంచే అనేక మంది పెద్ద ఎత్తున పొట్ట చేతపట్టుకుని దేశంలో నలుమూలలకు పనికోసం వలస వెళుతుంటే, బంగ్లాదేశీయులు బిహార్‌లో దేని కోసం వలస వస్తారు? వారు ఎంత శాతం మంది ఉంటారు? ఎన్నికల రాజకీయాల్లో వారి ప్రభావం ఎంత మేరకు ఉంటుంది? ఒకవేళ వచ్చినా గత 11 సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, బిహార్‌లో 20 సంవత్సరాల్లో 14 సంవత్సరాలు అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం ఈ అక్రమ వలసల్ని ఎందుకు అరికట్టలేకపోయింది? ఎన్నికల కమిషన్ పనితీరుపై సుప్రీంకోర్టు కూడా అనేక ప్రశ్నలు వేసింది. ఎన్నికల కమిషన్ బీజేపీ తరఫున పనిచేస్తోందని ప్రతిపక్షాలు కూడా తీవ్రంగా ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బిహార్‌లో ఇండియా కూటమికి, ఎన్డీఏకు మధ్య జరిగే పోటీ దేశ రాజకీయాల్లో తీవ్ర ఆసక్తి రేకెత్తిస్తోంది. ప్రస్తుతం దేశం దృష్టి అంతా బీజేపీపై ఉన్నది. మోదీ నాయకత్వానికి ఈ ఎన్నికలు ఒక అగ్నిపరీక్ష.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

విధానాలను మార్చని యువత తిరుగుబాట్లు

గల్ఫ్ లేఖ


కాలక్రమేణా శరవేగంగా అందుబాటులోకి వస్తున్న సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సామాజిక మాధ్యమాల వలన సమాచారం కూడా ప్రజలకు చేరువవుతోంది. ప్రత్యేకించి యువతకు సామాజిక మాధ్యమాలతో అనుబంధం బలపడుతోంది. ఈ మాధ్యమాల ద్వారా వెలువడుతున్న సమాచారంపై విశ్వసనీయత ఏ విధంగా ఉన్నా, అది కొన్ని సందర్భాలలో ప్రభుత్వాల పతనానికి కూడా దారితీస్తోంది. ఇందుకు తాజాగా నేపాల్‌లో సంభవించిన పరిణామాలే నిదర్శనం.

పొరుగున ఉన్న నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంకలోనూ దూరాన ఉన్న ఈజిప్టు, ట్యునీషియాలోనూ ప్రజాగ్రహం పెల్లుబికి ప్రభుత్వాలు పతనం కావడానికి యువజనులు, సామాజిక మాధ్యమాలే కారణమంటే సత్యదూరం కాదు. మాతృదేశాలలో ఉపాధి అవకాశాలు సన్నగిల్లి విదేశీబాట పట్టిన యువత ఆ ఆందోళనల్లో కీలకపాత్ర వహించిందనే విషయం ఇక్కడ గమనార్హం. ప్రస్తుతం నేపాల్‌లో జరిగిన తిరుగుబాటులోనూ ప్రవాస నేపాలీ యువత ప్రత్యేకించి ఖతర్, ఇతర గల్ఫ్ దేశాలలో పనిచేస్తున్న యువ నేపాలీలు క్రియాశీలకపాత్ర వహించారనే విషయం విశాల ప్రపంచానికి అంతగా తెలియదు.

15 సంవత్సరాల క్రితం ట్యునీషియాలోని ఒక మారుమూల ప్రాంతంలో వీధుల్లో పండ్లు, రొట్టెలు విక్రయించుకుంటూ జీవించే 26 ఏళ్ల మహమ్మద్ బజౌజీ అనే యువకుడు నిబంధనల పేర అధికారులు తనను వేధించిన తీరుకు నిరసనగా ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సామాజిక మాధ్యమాల ద్వారా బహిర్గతం కావడంతో అరబ్బు దేశాలలో అలజడి చెలరేగింది. కొన్ని దేశాలలో ప్రభుత్వాలు కూలిపోయాయి. ప్రభావశీలురు అయిన దేశాధినేతలు అధికార పీఠాల నుంచి దిగిపోవల్సివచ్చింది. దీంతో అనేక దేశాలు తమ యువతకు ఉపాధికల్పన దిశగా విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టాయి.

అప్పటి వరకు విషాన్ని వెదజల్లుతూ వికృత పోకడలకు తావిచ్చే సాధనాలుగా అపకీర్తి పొందుతున్న సామాజిక మాధ్యమాలు జాతి నిర్మాణ బాధ్యతలపై యువతలో శ్రద్ధాసక్తులు పెంపొందించడంలో నిర్ణయాత్మక పాత్ర పోషించగలుగుతాయని బజౌజీ ఉదంతంతో లోకానికి తెలిసివచ్చింది.

ఒక పేద వీధి విక్రేత మరణం, ఈజిప్టు అధినేతగా ఉన్న హుస్నీ ముబారక్‌ను పదవీచ్యుతుడిని చేసిందంటే యువతపై సామాజిక మాధ్యమాల ప్రభావం ఎటువంటిదో అర్థం చేసుకోవచ్చు. ఇది అరబ్బు దేశాలకు మాత్రమే పరిమితం కాలేదు. భారతీయ రాజకీయాలలోనూ సామాజిక మాధ్యమాల పాత్రను తక్కువగా ఊహించలేము. దశాబ్దం క్రితం కాంగ్రెస్ పతనానికి దారి తీసిన అన్నా హజారే అవినీతి నిర్మూలనోద్యమం దరిమిలా తాము ఓడిపోవడానికి యూట్యూబ్ చానెళ్లు ప్రధాన కారణమని తెలుగునాట ఒక ప్రముఖ నాయకుడు వాపోవడం విస్మరించలేని విషయం.



ఆగ్రహంతో పాలకులను దించడం కంటే పాలనా విధానాలలో ఎంత వరకు మార్పు తీసుకువచ్చామనేది ముఖ్యం. అయితే దురదృష్టవశాత్తు భారత్‌లో 1977 అత్యవసర పరిస్థితి నాటి నుంచీ నేటి నేపాల్ సంక్షోభం దాకా యువత ఈ వాస్తవాన్ని గుర్తించడం లేదు.

పాలకుల వైఖరికి భిన్నమైన వాదన కూడా ప్రజల్లోకి వెళ్ళడానికి సామాజిక మాధ్యమాలు ఉపకరిస్తున్నాయి. సహజంగానే వాటిపై పట్టు సాధించడానికి పాలకులు ప్రయత్నించడం కద్దు. అలనాటి కాలంలో బ్రిటిష్ పాలకులు టెలిగ్రాఫ్, ప్రచురణలపై నిఘా వేసినట్లుగా నేటి కాలంలో వ్యక్తిగతంగా వినియోగించే వాట్సాప్ నుంచి 'ఎక్స్' వరకు ప్రతి దానిపై పాలకులు కన్నేసి ఉంచుతున్నారు.

ప్రజాక్షేత్రంలో కనీస గౌరవ మర్యాదలను మంటగలుపుతూ, సామాజిక కట్టుబాట్లను ఉల్లంఘిస్తూ విచ్చలవిడిగా ప్రవర్తించే సామాజిక మాధ్యమాలపై నియంత్రణ అనేది అవసరమే, సందేహం లేదు. అయితే దాన్ని తమపట్ల అసమ్మతి గళానికి అడ్డుకట్ట వేస్తూ వేధింపులకు వాడుకోవడంతోనే అసలు సమస్య మొదలవుతున్నది. ఇప్పుడు నేపాల్‌లో జరిగింది ఇదే.

వాస్తవానికి నేపాల్‌లో సామాజిక మాధ్యమాలపై విధించిన ఆంక్షలు భారత్ తదితర దేశాలలో కంటే భిన్నంగా ఏమీ లేవు. కానీ పరిపక్వత కలిగిన సమాజం, పరిణతి చెందిన రాజకీయ నాయకత్వం పాలకుల చతురత ఇత్యాది కారణాల వలన ఈ ఆంక్షలు భారత్‌లో అంతగా వెలుగులోకి రాలేదని చెప్పవచ్చు. పైగా వాణిజ్య ప్రకటనల రాబడి దృష్ట్యా కూడా భారత్‌ను నేపాల్ లేదా ఇతర దేశాలతో పోల్చలేమనే విషయాన్నీ గమనించాలి.

మరోవైపు సరైన దశ–దిశ లేకుండా ఈ దేశాలలో యువజనులు చేసిన పోరాటాలన్నీ ఆశయ సాధనలో విఫలమయ్యాయి. ఈ కఠోర సత్యాన్ని విస్మరించకూడదు. ఆగ్రహంతో పాలకులను దించడం కంటే పాలనా విధానాలలో ఎంత వరకు మార్పు తీసుకువచ్చామనేది ముఖ్యం. అయితే దురదృష్టవశాత్తు భారత్‌లో 1977 అత్యవసర పరిస్థితి నాటి నుంచీ నేటి నేపాల్ సంక్షోభం దాకా యువత ఈ వాస్తవాన్ని గుర్తించడం లేదు. ప్రపంచంలో ప్రప్రథమంగా యువతరం వారి ఇటువంటి తిరుగుబాట్లకు శ్రీకారం చుట్టిన ప్రవాస ఈజిప్షియన్ వాయిల్ ఘోనెమి ప్రస్తుత పరిస్థితి ఏమిటని ఒక్కసారి తెలుసుకుంటే యువజనులు ఆవేశంగా కాకుండా ఆలోచనాత్మకంగా వ్యవహరించవల్సిన అగత్యం అర్థమవుతుంది.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్:editpage@andhrajyothy.com

బెజవాడ బ్రాండ్ మోగించేద్దాం

నగర ప్రాశస్త్యాన్ని చాటేలా విజయవాడ ఉత్సవ్

ఉత్సవ్ సన్నాహక కమిటీ సమావేశంలో వక్తలు ● ముఖ్యఅతిథిగా ప్రసంగించిన సత్యకుమార్

విజయవాడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బెజవాడ.. సాహిత్య నిధి. కళాకారులకు కేంద్రం. చారిత్రక పట్టాలకు పుట్టినిల్లు. రాజుల కాలం నుంచి స్వాతంత్ర్య సంగ్రామం వరకు విజయవాడ నగర ప్రాశస్త్యాన్ని చాటేలా విజయవాడ ఉత్సవ్‌ను నిర్వహించాలని ప్రజాప్రతినిధులు నిర్ణయించారు. నగరంలో 22వ తేదీ నుంచి ప్రారంభమయ్యే విజయవాడ ఉత్సవ్ సన్నాహక కమిటీ సమావేశం విజయవాడలోని ప్రైవేటు హోటల్‌లో మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, తంగిరాల సౌమ్య,



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్, చిత్రంలో ఎంపీ కేశినేని చిన్ని, టీడీపీ నేత వర్ల రామయ్య, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, కాగిత కృష్ణప్రసాద్, వర్ల కుమార్ రాజా

శ్రీరామ్ రాజగోపాల్(తాతయ్య), వసంత వెంకట కృష్ణ ప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్, కామినేని శ్రీనివాస్, బోడె ప్రసాద్, వర్ల కుమార్‌రాజా, యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, పర్యాటకాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్, మిగతా 6లో..

విద్యుత్ దీపాల వెలుగులో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్



పోలీసుల ఆడపడుచుగా ఆదిపరాశక్తి

- వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేక పూజలు
- తెప్పోత్సవం తర్వాత పల్లకీలో అమ్మవారిని ఊరేగించనున్న పోలీసులు

6

తెల్లపాణికి చెట్లు పెంచుదాం

- కొండపల్లి బొమ్మల తయారీని ప్రోత్సహిద్దాం
- తెల్లపాణికి కొరతపై సీఎం చంద్రబాబు
- కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సీఎం దృష్టికి తీసుకొచ్చిన కలెక్టర్ లక్ష్మీశ
- తెల్లపాణికి, అంకుడు చెట్ల పెంపకానికి ప్రత్యేక ప్రాజెక్టు తీసుకువస్తామని హామీ



6

» తెప్పోత్సవం తర్వాత పల్లకీలో ఊరేగింపు సేవ
» వన్‌టౌన్ స్టేషన్‌లో ప్రత్యేక పూజలు
» బ్రాహ్మణవీధిలోని జమ్మిదొడ్డిలో శమీపూజ
» ఉత్సవమూర్తులను కొండపైకి తీసుకు వెళ్లేది వీరే..

ఇంటి ఆడపడుచుగా ఆదిపరాశక్తి

నగరంలోని పోలీసు స్టేషన్లలో కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు



ఒన్‌టౌన్ పోలీసుస్టేషన్ ప్రాంగణంలో ఉన్న దుర్గమ్మ ఆలయం

(ఇంద్రకీలాద్రి-ఆంధ్రజ్యోతి)
ఇంద్రకీలాద్రిపై కనకదుర్గాదేవి రూపంలో ఆదిపరాశక్తి నగర పోలీసులకు ఇంటి ఆడపడుచుగా అలరారుతోంది. బెజవాడలో దసరా మహోత్సవాల సమయంలో అన్ని స్టేషన్లలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. ఉత్స వాల ముగింపురోజు తెప్పోత్సవం తరువాత పోలీసులే స్వయంగా పల్లకీలో అమ్మవారిని తీసుకువెళ్లి బ్రాహ్మణవీధిలోని జమ్మిదొడ్డిలో శమీపూజ నిర్వహిస్తారు. అక్కడి నుంచి ఊరేగింపుగా వన్‌టౌన్ స్టేషన్‌లో పూజలు నిర్వహించి తెల్లవారేసరికి అమ్మవారి ఉత్సవ మూర్తులను కొండపైకి చేర్చుతారు. ఇంద్రకీలాద్రి నుంచి తెప్పో త్సవం వరకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్ని కార్యక్రమాలను నిర్వ హిస్తారు.

వాస్తవ పురాణగాధను పరిశీలిస్తే.. విజయవాడలో పనిచేసిన ఒక పోలీసు అధికారి దుర్గమ్మ ఉత్సవాలను నిరాకరించటంతో ఆక స్మికంగా ఆయన ఉద్యోగాన్ని తొలగిస్తున్నట్టు పైఅధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చాయి. అయితే ఆ అధికారి దుర్గమ్మ మహిమవల్లే అలా జరిగిందని తెలుసుకున్నాడు. వెంటనే తాను చేసిన పొరపా టును సరిదిద్దుకుంటున్నానని దుర్గమ్మను క్షమాపణలు కోరాడు. ఇకపై దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని.. తోబుట్టు వుగా ఆదరించి సారె సంబరాలను సమర్పిస్తామని చెప్పడంతో తిరిగి విధుల్లో చేరాలని పైఅధికారుల నుంచి వర్తమానం రావటం విశేషం. నాటినుంచి పోలీసులు దుర్గమ్మను ఆడపడుచుగా భావించి దసరాకు ప్రత్యేక పూజలు నిర్వహించటం జరుగుతోంది. అలాగే దుర్గమ్మ విజయానికి చిహ్నం. దుష్టశక్తులను సంహరించి ప్రజలకు రక్షణగా నిలుస్తుంది. అదే క్రమంలో పోలీసులు ప్రజలకు ఎల్లవేళలా రక్షణగా ఉంటారు. దసరా మహర్నవమినాడు ఆయు ధాలను అమ్మవారి ముందు ఉంచి శాంతిభద్రతల పరిరక్షణలో తమకు తోడుగా ఉండాలని కోరుకుంటారు. ఏ పండుగకు లేని విధంగా దసరా మహోత్సవాలలో అన్ని స్టేషన్‌లను విద్యుత్ దీపాలతో అలంకరించి అమ్మవారి విగ్రహాలను, చిత్రపటాలను ఉంచి స్టేషన్‌లో వేడుకలు జరుపుతారు. దసరా తొలి రోజున నగర పోలీసులే దుర్గమ్మకు తొలి పట్టువస్త్రాలను సమర్పించటం కూడా ఆనవాయితీగా వస్తున్నది. సంవత్సరాలుగా ఈ ఆచారం కొనసాగు తోంది. విజయవాడ నగర కమిషనర్, వన్‌టౌన్ సీఐ స్టేషన్ ప్రాంగ ణంలోని రావిచెట్టువద్ద పూజలు నిర్వహించి అక్కడ నుంచి ఊరే గింపుగా కొండపైకి వెళ్లి దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు.


విద్యుత్ దీప అలంకరణలో వన్‌టౌన్ పోలీసు స్టేషన్


గత ఏడాది దసరా ఉత్సవాలలో దుర్గమ్మకు పట్టు వస్త్రాలు తీసుకువెళుతున్న సీపీ రాజశేఖర బాబు (ఫైల్)



సదస్సులో మాట్లాడుతున్న రేణుక ప్రసాద్

ఇఎస్ఐసీతో ఉద్యోగులకు రక్షణ

» ఇన్సూరెన్స్ కమిషనర్ రేణుక ప్రసాద్

గాంధీనగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : యజమాని, ఉద్యోగికి ఇఎస్ఐసీలో మాత్రమే రక్షణ కలుగుతుందని ఇన్సూరెన్స్ కమిషనర్ టి.రేణుక ప్రసాద్ పేర్కొన్నారు. విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ఇఎస్ఐ పథకాలపై అవగాహన సదస్సు చాంబర్ కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇఎస్ఐ వైద్య సేవలను వివరించారు. ప్రాంతీయ సంచాలకుడు మల్ల రామారావు ఇఎస్ఐ అవశ్యకత, అమలు విధానం, యజమానులు, చిరుద్యోగులకు కలిగే ప్రయోజనా లను వివరించారు. రూ. 21 వేల లోపు జీతం ఉన్న సిబ్బందిని ఇఎస్ ఐసీలో నమోదు చేయించాలన్నారు. పదిమంది మించిన కార్మికులు, ఉద్యోగులు ఉన్న సంస్థలు ఇఎస్ఐసీలో తప్పక చేరాలన్నారు. దీనిలో సభ్యులుగా చేరిన తొలిరోజు నుంచే వైద్య సహాయం అందుతుంద న్నారు. ఎటువంటి ప్రమాదం జరిగినా, అనారోగ్యానికి గురైనా అన్ని ప్రయోజనాలు సభ్యుడితో పాటు అతిడిపై ఆధారపడిన కుటుంబస భ్యులకు అందుతాయన్నారు. చాంబర్ అధ్యక్షుడు గద్దం బాల వెంకట రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి వక్క లగడ్డ శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు వీవీకే నరసింహారావు, జాయింట్ సెక్ర టరీ ఈమని దామోదర్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఐ రామకృష్ణ

బుడమేరు పనులు ప్రారంభించండి

» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ధర్నాచౌక్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రతీసారి బుడ మేరు ముంపుతో లక్షలాదిమంది ప్రజలు నష్టపోతున్నా ఇంకెప్పుడు 'ఆపరేషన్ బుడమేరు చంద్రబాబూ' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రా మకృష్ణ నిలదీశారు. యుద్ధప్రాతిపదికన బుడమేరు ఆధునీకరణ పనులు చేపట్టి ఏడాదిలోగా పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. రాజ ధాని 'అమరావతి' మోజులో పడి విజయవాడకు నష్టం కలిగిస్తే సహించబోమని, 'ఆపరేషన్ బుడమేరు' పూర్తి చేసేంతవరకు పోరాడ తామన్నారు. ముంపు నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల సమితి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో మంగళవారం ధర్నా జరిగింది. గతేడాది బుడ మేరు ముంపు సందర్భంగా 'ఆపరేషన్ బుడమేరు' చేపట్టి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నీటిపారుదల ప్రాజెక్టులు పడకేశాయని విమర్శించారు. జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ కేంద్ర సమితి కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు గుజ్జు ఈశ్వరయ్య, కృష్ణా, ఏలూరు జిల్లాల కార్యదర్శులు నార్ల వెంకటేశ్వరరావు, కృష్ణ చైతన్య, నగర కార్య దర్శి జి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




జాతీయ రహదారిపై బారికేడ్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

యూటర్న్ మూసివేత!

» జాతీయ రహదారిపై బారికేడ్లు ఏర్పాటు

జగ్గయ్యపేట రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై అంతర్రాష్ట్ర సరిహద్దు గరికపాడు వద్ద ప్రమాద కరంగా ఉన్న యూటర్న్‌ను హైవే అధికారులు, చిల్లకల్లు పోలీసులు సంయుక్తంగా మంగళవారం మూసివేశారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన 'రాంగ్ టర్న్' కథనానికి అధికారులు స్పందించారు. తెలంగాణ లోని సూర్యాపేట జిల్లా రామాపురం క్రాస్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తవటంతో యూటర్న్‌ను మూశారు. గతేడాది పాలేటికి వచ్చిన వర దల కారణంగా బ్రిడ్జి కోతకు గురవటంతో రెండవ బ్రిడ్జిపై నుంచి వాహనాలు రాకపోకలు సాగించాయి. ఎదురెదురుగా వస్తున్న వాహ నాలతో ప్రమాదాలు జరుగుతుండటంతో డివైడర్ తొలగించి మరలా వాహనాలు రహదారిపైకి వచ్చేలా నిర్మాణం చేపట్టారు. అనంతరం బ్రిడ్జి పనులు పూర్తయినా యూటర్న్‌ను మూయకపోవటంతో ప్రమా దాలు జరుగుతున్నాయని 'ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రచురించటంతో అధికారులు స్పందించి యూటర్న్‌ను తాత్కాలికంగా మూసివేశారు.



ముక్త్యాల వద్ద వరద ఉధృతి

జగ్గయ్యపేట రూరల్ : కృష్ణానదికి ఎగువ నుంచి వరద వస్తుండటంతో ముక్త్యాల వద్ద ఉధృతి పెరిగింది. మధ్యాహ్నం రెండు గంటలకు పులిచింతల నుంచి 17వేల క్యూసె క్కుల నీటిని విడుదల చేశారు. రాత్రి ఏడు గంటలకు రెండు లక్షల క్యూసెక్కులకు చేరుకో వటంతో నదీ పరివాహక గ్రామాలైన వేదాద్రి, రావిరాల, ముక్త్యాల గ్రామాల్లో అధికారులు హైఅలెర్ట్ ప్రకటించారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులతో పాటు తెలంగాణాలో కురుస్తున్న వర్షాలకు ఉప నదుల ద్వారా కృష్ణానదికి వరద నీరు చేరుతోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

భాషల పునర్వైభవానికి కృషి

» తెలుగు, సంస్కృత భాషల అకాడమి చైర్మన్ ఆర్డీ విల్సన్

వన్‌టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తెలుగు, సంస్కృత భాషల పరిరక్షణకు అకాడమీ ద్వారా కృషి చేస్తానని తెలుగు, సంస్కృత భాషల అకాడమీ చైర్మన్ ఆర్.డి.విల్సన్ అన్నారు. అకాడమీ ఆధ్వర్యంలో సంపాదక, రచయితలు భాషాభిమానుల ఆత్మీయ సమ్మే ళన కార్యక్రమాన్ని మంగళవారం విజయవాడ తుమ్మల పల్లి కళాక్షేత్రంలో నిర్వహించారు. సామాజికరంగంలోనే కాకుండా సాహిత్యంలో తనదైన ముద్రను వేసి, వెనుకబ డిన బలహీన పేద బడుగువర్గాల హక్కుల సాధనకై అనేక ఉద్యమాలు చేపట్టడమే కాకుండా, తన రచనలతో వార్తా పత్రికల ద్వారా తనదైన శైలిలో సమాజంలో అనేక అంశాలపై గళమెత్తిన సంఘ సంస్కర్త ఆర్డీ విల్సన్ (శర త్ చంద్ర) అని సంపాదకులు కొనియాడారు. అనంతరం విల్సన్ (శరత్ చంద్ర) మాట్లాడుతూ, తెలుగు భాష, సాహిత్యంపై తనకున్న మక్కువతో వైద్యరంగాన్ని ఎంపిక చేసుకునే అవకాశం ఉన్నా, తాను మాత్రం సాహిత్యం వైపే అడుగేసి సమాజాభివృద్ధికి దోహదపడే అనేక నవలలు, కథలు, నాటకాలు రచించానని తెలి పారు. అంతే కాకుండా సమాజంపై ఉన్న బాధ్యతతో సమకాలిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించా లనే ఉద్దేశ్యంతో పత్రికా విలేకరిగా కూడా పనిచేశానని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో తెలుగు భాష ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కోనున్నదని, తెలుగు భాషా పరి రక్షణకు తెలుగు, సంస్కృత భాషల అకాడమీ ద్వారా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తెలుగు భాష యొక్క సౌందర్యం మాట్లాడంలో, సాహిత్యం చదవడంలో ఇమిడి ఉందన్నారు. కులానికి, మతానికి భాషను ఆపా దించవద్దని కోరారు. నడుస్తున్న చరిత్రకు సాహిత్యం ఒక సాక్షి అని, అలాంటి సాహిత్యాన్ని కనుమరుగవ్వ కుండా పరిరక్షించుకోవాలని సూచించారు. తెలుగు, సంస్కృత అకాడమీలో పనిచేసే ఉద్యోగస్తుల సమస్య లను పరిష్కరిస్తూ, విద్యార్థులకు ఈ అకాడమీ ద్వారా మరిన్ని సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పచె ప్పిన కూటమి ప్రభుత్వానికి విల్సన్ ధన్యవాదాలు తెలి యచేశారు. కలెక్టర్ల సమావేశం కారణంగా ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి రావాలని ఉన్నా రాలేకపోతు న్నానని, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఎన్నో ఉద్యమాలు చేపట్టిన ఆర్.డి.విల్సన్‌ను రాష్ట్ర వైద్య, కుటుంబ సంక్షేమం, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఫోన్‌లో అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర ప్రధాన కార్య దర్శి రమేష్ నాయుడు, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, ఏపీ లైబ్రరీ అసోసియేషన్ చైర్మన్ కోటేశ్వర రావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, ఇతర అసోసియేషన్ నాయకులు కార్యక్రమానికి హాజరయ్యారు. తెలుగు భాష ప్రాముఖ్యతను చాటి చెప్పే జానపద గేయాలు, తెలుగు సాహిత్య పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిం చారు.


ఆర్.డి.విల్సన్‌కు జ్ఞాపికను అందచేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్, తదితరులు

స్పౌజ్ టీచర్లందరికీ బదిలీలు చేపట్టాలి : ఏపీటీఎఫ్

అమరావతి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్పౌజ్ కోటా కింద దరఖాస్తు చేసుకున్న టీచర్లందరికీ అంతర్ జిల్లాల బదిలీలు చేపట్టాలని ఏపీటీఎఫ్-1938 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి పాఠశాల విద్యాశాఖను కోరారు. గత నెలలో ఇచ్చిన అంతర్ జిల్లాల బదిలీల మార్గదర్శకాలకు అనుగుణంగా స్పౌజ్ కోటాలో బదిలీకి అనేక మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అయితే ఆయా జిల్లాల్లో ఉండే ఖాళీలు, అవసరం, మిగులు ఆధారంగా కొన్ని దరఖాస్తులను ప్రభుత్వ అనుమతికి పంపకపోవడంతో ఆ టీచర్లు ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. దర ఖాస్తు చేసుకున్న అందరికీ కొత్త డీఎస్సీ నియామకాలకు ముందే బదిలీలు చేపట్టాలని ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఉన్నత విద్యామండలిలో ఇద్దరు వైస్ చైర్మన్ల నియామకం

అమరావతి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యామండలిలో రెండు వైస్ చైర్మన్ పోస్టులను భర్తీ చేస్తూ ఉన్నత విద్యాశాఖ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. వైస్ చైర్మన్-1గా శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్.విజయభాస్కరరావును, వైస్ ఛైర్ పర్సన్-2గా నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ రత్నశీల మణిని నియమించింది. వీరి పదవీ కాలం మూడేళ్లు. గత ప్రభుత్వం నియమించిన ఇద్దరు వైస్ చైర్మన్లలో ఒకరి పదవీకాలం ఇటీవల ముగియగా, మరొకరు రాజీనామా చేశారు. ఆయా స్థానాలను కూటమి ప్రభుత్వం ఇప్పుడు భర్తీ చేసింది.

పశుసంవర్ధక శాఖలో 15 మంది జేడీలకు పోస్టింగ్‌లు

అమరావతి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పశుసంవర్ధక శాఖలో డిప్యూటీ డైరెక్టర్ల నుంచి జాయింట్ డైరెక్టర్లుగా తాత్కాలిక పదోన్నతి పొందిన 15మందికి పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పి.ప్రేమ్‌చంద్- అనంతపురం జేడీ, జి.సుబ్బమ్మ- విజయవాడ ఎండీ కాప్, కె.శ్రీనివాసులు-విజయవాడ వీఎస్ఎస్‌హెచ్, ఎం.రత్నజ్యోతి-డైరెక్టరేట్, బి.చంద్రశేఖర్-చింతలదీవి ఎన్‌కెబీసీ, కె.మురళీకృష్ణ-విజయనగరం జేడీ, కె.భూపాల్ రెడ్డి-డైరెక్టరేట్, డి.శంకరరావు-విశాఖపట్నం జేడీ, బి.ప్రసాదరావు-ఏలూరు జేడీ, ఎన్.వెంకటేశ్వరరావు- ఒంగోలు జేడీ, టి.వి.సుధాకర్-డైరెక్టరేట్, డి.ఉమామహేశ్వరి-చిత్తూరు జేడీ, వి.దుర్గాప్రసన్నబాబు-డైరెక్టరేట్, కె.వి.వి.సత్యనారాయణ-గుంటూరు జేడీ, పి.వెంకటరమణ-శ్రీకాకుళం జేడీగా నియమితులయ్యారు.

మిరాయ్ తెలుగు చిత్ర పరిశ్రమకు ఊపిరి పోసింది

» మంత్రి కందుల దుర్గేష్

వన్‌టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మిరాయ్ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిం చారని, కొంతకాలంగా సినిమాలు హిట్ కాని పరిస్థితుల్లో మిరాయ్ తెలుగు చిత్ర పరిశ్రమకు ఊపిరిపోసిందని పర్యాటక, సినిమా ఫొటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మంగళవారం రాత్రి భవానీ పురం పున్నమీఘాట్‌లో మిరాయ్ బ్లాక్ బ్లస్టర్ సెలబ్రేషన్ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి దుర్గేష్, ఏపీ ఉపసభా పతి రఘురామకృష్ణంరాజు, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని హాజరై చిత్ర యూనిట్‌ను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, హనుమాన్ చిత్రంతో గొప్ప విజయం సాధించిన తేజ సజ్జ మిరాయ్ చిత్రంతో మరో హిట్ సాధించటం సంతో షంగా ఉందన్నారు. మంచు మనోజ్ మిరాయ్ చిత్రంలో ప్రతినాయకుడిగా, నటి శ్రియాచర ణ్‌లు మంచి నటన కనబరిచారని కొనియా డారు. ప్రభాస్ నటిస్తున్న రాజాసాబ్ చిత్రం త్వరలోనే విడుదల చేయాలని కోరుకుంటు న్నట్టు తెలిపారు. రాష్ట్రంలో తెలుగు స్టూడి యోల నిర్మాణానికి, షూటింగ్‌లకు ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. ఉప సభాపతి రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ, తేజ సజ్జ మిరాయ్ చిత్రంతో గొప్ప విజయం సాధించటం అభినందనీయమన్నారు. ఏడా దికి మూడు సినిమాలు చేయాలని హీరో తేజ సజ్జకు సూచించారు. ఫాంటసీ సినిమాను విజువల్ వండర్‌గా తెరకెక్కించిన దర్శకుడు కార్తీక్ ఘట్టమనేనిని ప్రశంసించారు. హీరో తేజ సజ్జ మాట్లాడుతూ, మిరాయ్ సినిమాను విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. నటుడు మంచు మనోజ్ మాట్లా డుతూ, మిరాయ్ విజయవంతం కావటం కొత్త స్ఫూర్తినిచ్చిందన్నారు. హీరోయిన్ రితికా నాయక్, నటి శ్రియాచరణ్ మాట్లాడుతూ, మిరాయ్ చిత్రానికి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టడం సంతోషంగా ఉందన్నారు. చిత్ర దర్శ కుడు బాబి, నిర్మాత విశ్వ ప్రసాద్, ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, సంగీత దర్శకుడు గౌరహరి, సింగర్ అర్జిబ్ మాలిక్, కమేడియన్స్, తదిత రులు పాల్గొన్నారు. అనంతరం విజయవాడ ఉత్సవ్ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు.


విజయవాడ ఉత్సవ్ ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి, ఉప సభాపతి, చిత్ర బృందం

తెల్లపొణికి చెట్లు పెంచుదాం

» కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సీఎం దృష్టికి సమస్య

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): తెల్లపొణికి చెట్లు పెంచుదాం.. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కొండపల్లి బొమ్మల తయారీని ప్రోత్సహిద్దామని సీఎం చంద్ర బాబు పిలుపునిచ్చారు. రాజధాని అమరావతిలోని సచివాలయం ఐదవ బ్లాక్‌లో మంగళవారం జరిగిన కలెక్టర్‌ల కాన్ఫరెన్స్‌లో కొండపల్లి బొమ్మల పరిశ్రమ ఎది గేందుకు, దానికి అవసరమైన ముడిసరుకుకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు తెల్లపొణికి చెట్ల పెంపకంపై దృష్టి సారించాల్సిన అంశాలను కలెక్టర్ లక్ష్మీశ సీఎం చంద్రబాబు దృష్టికి ప్రత్యేకంగా తీసుకువచ్చారు. కొండపల్లి బొమ్మల తయారీకి అవసరమైన తెల్లపొణికి చెట్లు అడవులలో అంతరించిపోతుండటంతో కళాకారులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. బొమ్మల తయారీపై ఎన్నో కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని చెప్పారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్ర బాబు తక్షణం స్పందించారు. కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు మన సంస్కృ తిలో భాగమని, ఈ కళలను, కళాకారులను కాపాడుకోవాల్సిన అవసరముందని తెలిపారు. ప్రత్యేక ప్రాజెక్టుతో బొమ్మల తయారీకి అవసరమైన చెట్లను పెంచి, కలపను అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం తప్పకుండా కృషి చేస్తుందని చెప్పారు. దీనిపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేకంగా దృష్టి సారించి ప్రాజెక్టును రూపొం దించాలని సూచించారు. తెల్లపొణికి చెట్లను పెంచటానికి వీలుగా ప్రభుత్వం తరఫున సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.

న్యాయం జరిగే వరకు పోరాటం

» బూడిద ఉద్యమానికి కూటమి నేతల సంఘీభావం



జూపూడిలో ర్యాలీ

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జెన్కో యాజమాన్యం మొండి వైఖరి విడనాడి స్థానిక ట్రాన్స్‌పోర్ట ర్స్‌కు ఉచితంగా బూడిదను లోడింగ్ చేయాలని టీడీపీ సీనియర్ నేత, మండల మాజీ అధ్యక్షుడు రామినేని రాజశేఖర్ (రాజ) అన్నారు. డాక్టర్ ఎన్టీటీపీఎస్ టిప్పర్, లారీ ఓనర్స్ సొసైటీ నేతలు, సభ్యులు జూపూడి, కిలేశపురం గ్రామాల్లో మంగళవారం నిరసన ప్రదర్శన చేశారు. ప్రదర్శనకు రాజా, గరికపాటి శివలు సంఘీభావం తెలిపి ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం రాజా మాట్లాడుతూ, ఎన్టీటీపీఎస్ కాలుష్యాన్ని భరిస్తూ ఉచిత బూడి దపై ఆధారపడి స్థానిక ట్రాన్స్‌పోర్టర్స్ జీవనం సాగిస్తుంటే ఇప్పుడు బూడిదను కాంట్రాక్టు సంస్థకు కట్టబెట్టి కొనుగోలు చేసుకోమనడం వారి జీవన విధానాన్ని దెబ్బతీయడమే అన్నారు. ఇప్పటికైనా జెన్కో యాజమాన్యం పునరాలోచన చేసి స్థానిక ట్రాన్స్‌పోర్టర్స్‌కు న్యాయం చేయాలని, లేకుంటే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు కోయ వెంకట్రావ్, కొండిశెట్టి నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బెజవాడ బ్రాండ్..

(5వ పేజీ తరువాయి)

విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, జన సేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

దసరా అంటే బెజవాడ అనేలా : మంత్రి సత్యకుమార్

దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా దసరా అంటే బెజవాడే అనుకునేలా విజయవాడ ఉత్సవ్‌ను నిర్వహిస్తాం. బెజవాడ నీళ్లలో సాహిత్యం, ఆధ్యాతికత ఉన్నాయి. అంతరిం చిపోతున్న కళలను పరిరక్షించుకోవడానికి ఈ ఉత్సవాలు పునాది వేయాలి. వైభవాన్ని ప్రపంచానికి విస్తరించేలా నిర్వహించాలి. మైసూర్ తరహాలో ఫెస్ట్ నిర్వహిస్తాం.

ఆధ్యాత్మికత, పర్యాటకానికి అనువైన ప్రదేశం - మంత్రి కొలుసు పార్థసారథి

దేశంలో ఉన్న ప్రముఖ దేవాలయల్లో ఇంద్రకీలాద్రి ఒకటి. పర్యాటకంగానూ విజయవాడకు మంచి స్థానం ఉంది. రాష్ట్రాన్ని దేశంలో మొదటి స్థానంలో నిలిపేందుకు చంద్ర బాబు పని చేస్తున్నారు. ప్రపంచ స్థాయి నగరాలతో అమరా వతిని అభివృద్ధి చేసేలా నిర్ణయం తీసుకున్నారు. విజయ వాడ ఉత్సవాల్లో అందర్నీ భాగస్వామ్యం చేయాలి. పర్యాట కులు, భక్తులకు విజయవాడ అనువైన ప్రదేశం. చారిత్ర కంగా, పర్యాటకంగా కొండపల్లి అద్భుతమైన ప్రాంతం.

ఖండాంతరాలకు తెలిసేలా.. ఎంపీ కేశినేని చిన్ని

కళలు, సాంస్కృతిక రంగానికి విజయవాడ రాజధాని. విజయవాడ ఉత్సవ్‌తో నగరానికి అపూర్వవైభవం తీసు కొస్తాం. వైసీపీ నేతలు కుళ్లు రాజకీయాలు చేస్తున్నారు. బెజ వాడ ఖ్యాతిని ఖండఖండాలకు తెలియజేసేలా విజయవాడ ఉత్సవ్‌ను నిర్వహిస్తాం. దీనివల్ల నగరంలో వ్యాపార వర్గాలు బాగుంటాయి. మనీ సర్క్యులేట్ అవుతుంది. ప్రతి ఏడాది ఉమ్మడి కృష్ణా జిల్లాలో రెండు ఉత్సవాలు జరగాలి. బంద రులో బీచ్ ఫెస్టివల్, విజయవాడలో విజయవాడ ఉత్సవ్ నిర్వహించాలి. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు వినోదాన్ని, ఆధ్యాత్మకత పెంచేలా కార్యక్రమాలు చేపడుతాం.

డిజిటల్ మారథాన్ విజేతలకు రూ.లక్ష బహుమతి

విజయవాడ సిటీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర యువ సంకల్ప్ 2కె25- డిజిటల్ మారథాన్ పోటీల్లో విజేతలకు రూ.లక్ష బహుమతి అందిస్తామని ఉమ్మడి కృష్ణాజిల్లా యువజన సంక్షేమశాఖ సీఈవో యు.శ్రీనివాస రావు ప్రకటించారు. పోటీల్లో పాల్గొనే యువత సోషల్ రెస్పాన్సిబిలిటీ, ఫిట్‌నెస్ అండ్ స్పోర్ట్స్, డిజిటల్ ఇన్నోవేషన్ అండ్ ఏఐ టెక్నాలజీ అంశాలపై షార్ట్ వీడి యోలు తయారు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ థీమ్‌లపై 120 సెకన్ల నిడివి ఉన్న షార్ట్ వీడియోను తయారు చేసి వారి సొంత ఇన్‌స్టా, ఫేస్ బుక్, యూట్యూబ్‌లలో అప్లోడ్ చేయాలని, దీనికి ఆంధ్రా యువసంకల్ప్2కె25, యూత్‌మినిస్టర్, యూత్‌ఐకాన్‌నారాలోకేష్, డిజిటల్‌మారథాన్, యూత్‌అఫైర్స్‌మి నిస్టర్‌గవర్నమెంట్‌ఆఫ్‌ఆంధ్రప్రదేశ్ యాష్ ట్యాగ్‌లు ఇవ్వాలని సూచించారు. ఈ లింక్‌ను ఆంధ్రాయువసంకల్ప్.కామ్ వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలన్నారు. విజేత లకు ఒక్కో కేటగిరిలో మొదటి బహుమతిగా రూ.లక్ష, రెండో బహుమతిగా రూ.75 వేలు, మూడో బహుమతిగా రూ.50 వేలు అందించడంతో పాటు ఆంధ్రా యువ బ్రాండ్ అంబాసిడర్-2025 గా పరిగణించి సత్కరిస్తామన్నారు. మరిన్ని వివరా లకు 9032111 5987, 9949522694ను సంప్రదించాలని సూచించారు.

పెండింగ్ జీతాలు చెల్లించండి

» డీఆర్‌డీఏ పీడీకి వినతి


డీఆర్‌డీఏ పీడీ నాంచారరావుకు వినతిపత్రం ఇస్తున్న వీవోఏ యూనియన్ ప్రతినిధులు

విజయవాడ సిటీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వెలుగు యానిమేటర్లకు మూడు నెలల పెండింగ్ జీతాలను వెంటనే చెల్లిం చాలని, మూడేళ్ల విధుల కాలపరి మితి సర్క్యులర్‌లను రద్దు చేయా లని వీవోఏ యూనియన్ జిల్లా ప్రతి నిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎ.ఎస్.వి.నాంచారరావుకు మంగళవారం వారు వినతిపత్రాన్ని అందజేశారు. మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో వీవోఏలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ జీతాలను వెంటనే విడుదల చేయాలని, పేర్కొ న్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూనియన్ గౌరవాధ్యక్షురాలు ఎక మల, ప్రధాన కార్యదర్శి ఆళ్ల ఉమాదేవి, ప్రతినిధులు పాల్గొన్నారు.

జోగీ.. నీ అవినీతిపై చర్చకు సిద్ధమా : జంపాల



ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : 'జోగీ.. నీది, నీ కుటుంబసభ్యుల అవినీతి అక్రమాలను ఆధారాలతో సహా ఇబ్రహీంపట్నం రింగ్ వద్ద ఉన్న గాంధీ బొమ్మ సెంటర్లో బయటపెట్టేందుకు సిద్ధం.. నువ్వు కూడా సిద్ధంగా ఉంటే రా.. టైమ్ డేట్ చెప్పు!' అని వైసీపీ నేత, మాజీమంత్రి జోగి రమేష్‌కు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య సవాల్ విసిరారు. మంగళవారం ఇబ్రహీంప ట్నంలోని కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, నువ్వు బూడిద గురించి మాట్లాతుంటే గురివింద గింజ సామెత గుర్తుకొస్తుంది. వైసీపీ హయాంలో ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఏకైక మంత్రిగా స్థానిక లారీలు, మిషన్స్, యార్డులు పెట్టిన వాళ్ల నుంచి ఎంతెంత డబ్బు తిన్నావో లెక్కలు పక్కాగా ఉన్నాయ్.. రాజకీయ ఉనికి కోసం స్థానిక ట్రాన్స్‌పోర్టర్స్‌పై ప్రేమ ఒలకబోస్తు న్నావా.. అధికారంలో ఉండగా ఏనాడైనా వాళ్ల సమస్యలు పట్టించుకున్నావా. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌ను విమర్శించే అర్హత నీకు లేదు. టెండర్ వల్ల స్థానిక ట్రాన్స్‌పోర్టర్స్‌కు నష్టం జరగకుండా ఇప్పటికే ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వసంతలు సంబంధితశాఖా మంత్రి, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారికి న్యాయం జరిగేలా చూస్తారు. దీన్ని కూడా రాజకీయం చేసి చలికాగాలను కోవడం నీ అవివేకం.. అని జంపాల ధ్వజమెత్తారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140,149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆటోనగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జవహర్ ఆటోనగర్‌లోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి అభిషేకం, అర్చన, హోమాలను చేశారు. వేంకటేశ్వరస్వామి, సుబ్రహ్మణ్యస్వామికి కూడా భక్తులు పూజలు చేసి ప్రసాదం స్వీకరించారు. ఆలయ పూజారులు కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యార్థినికి కాలేజీ ఫీజుకు ఆర్థికసాయం

లబ్బీపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పార్టీ కార్యకర్త కుమార్తె ఫీజు నిమిత్తం టీడీపీ యువనాయకుడు గద్దె క్రాంతికుమార్ ఆర్థికసాయం అందజేశారు. బుధవారం ఉదయం పార్టీ కార్యకర్త మైలమూరి చిన్న పీరుబాబు కుమార్తె రేష్మాకు కాలేజీ ఫీజులు నిమిత్తం గద్దె క్రాంతికుమార్ రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని గద్దె ఫౌండేషన్ ద్వారా అందజేశారు. ప్రిన్స్‌పాల్ పద్మజ, మైలమూరి చిన్న పీరుబాబు, మెడబలిమి భార్గవ్‌లు పాల్గొన్నారు.





పీబీ సిద్ధార్థలో ర్యాలీ ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.మనోరంజని, డాక్టర్ ప్రసాదరావు తదితరులు, మాట్లాడుతున్న గోరా సైన్స్ సెంటర్ డైరెక్టర్ జి.నియంత

హైడ్రోజన్‌దే భవిష్యత్

- పీబీ సిద్ధార్థ కాలేజీ ఆధ్వర్యంలో ఓజోన్‌పై అవగాహన కార్యక్రమం
- కృష్ణా యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ ఎంవీ బసవేశ్వరరావు



మాట్లాడుతున్న కేయూ రెక్టార్ ప్రొఫెసర్ బసవేశ్వరరావు

మొగల్రాజపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రానున్న కాలమంతా హైడ్రోజన్ హవా నడుస్తుందని కృష్ణా యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ ఎం.వి.బసవేశ్వరరావు అన్నారు. మంగళవారం నగరంలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో ఓజోన్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెట్రో సింథటిక్ ఎనాలిసిస్, గ్రీన్ కెమిస్ట్రీ గురించి విద్యార్థులకు వివరించారు. ఆయన మాట్లాడుతూ, క్యాన్సర్ థెరపీ వల్ల ఆరోగ్యకరమైన కణజాలానికి హాని జరుగుతుందన్నారు. మిథైల్ సేనేట్ చాలా ప్రమాదకరమని, విద్యార్థులు ప్రయోగశాలలో దీనిని చేర్చవద్దని చెప్పారు. పంచదార, బెల్లం బదులు వాడే సాక్రిన్ వాటి కన్నా 200 రెట్ల అధిక తీపిని కలిగి ఉంటుందన్నారు. అనంతరం సిద్ధార్థ కాలేజీ కెమిస్ట్రీ విద్యార్థుల ఆధ్వర్యంలో సిద్ధార్థనగర్‌లో ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో ప్రిన్సిపాల్ మేకా రమేష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.మనోరంజని, కెమిస్ట్రీ హెచ్‌వోడీ డా.పి.టి.ఎస్.ఆర్.కె ప్రసాదరావు, డీన్ రాజేష్ సి. జంపాల, కెమిస్ట్రీ లెక్చరర్ డాక్టర్ సత్యదేవ్, డాక్టర్ రామారావు, డాక్టర్ లక్ష్మి, ఎం.డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఓజోన్ పొర క్షీణత మానవ మనుగడకు ప్రమాదం

బెంజిసర్కిల్: ఓజోన్ పొర క్షీణత మానవ మనుగడకు ప్రమాదం అని గోరా సైన్స్ సెంటర్ డైరెక్టర్ జి.నియంత వెల్లడించారు. మంగళవారం నాస్తిక కేంద్రంలోని అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేళ్లుగా మనుషుల తప్పుల వల్ల ఓజోన్ పొర క్షీణతకు దారితీశాయని, ఫలితంగా సూర్యరశ్మి అధిక మొత్తంలో భూమికి చేరి గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులకు దారితీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పలు పాఠశాలల విద్యార్థులకు వాతావరణ ప్రభావంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షుడు శ్రీగంగ, పూర్వపు చైర్మన్ రశ్మి, మాజీ ప్రిన్సిపాల్ దిలీప్ పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన కల్పించాలి

హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ సాంబశివరావు



ప్రసంగిస్తున్న హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ సాంబశివరావు

ఆటోనగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధిపై విస్తృతస్థాయిలో ప్రచారం నిర్వహించాలని జవహర్ ఆటోనగర్‌లోని హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ వీవీ సాంబశివరావు అవుట్‌రీచ్ వర్కర్‌లను కోరారు. మంగళవారం జవహర్ ఆటోనగర్‌లోని హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫీల్డ్ వర్కర్‌లు లారీ డ్రైవర్‌లు, క్లీనర్లకు లైంగిక ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. హెచ్‌ఐవీ లక్షణాలు ఉన్నట్లు గమనిస్తే పరీక్షలు చేయించాలని కోరారు. ఆ పరీక్షల్లో పాజిటివ్ వస్తే ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స చేయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాగా ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ అధికారులు నిర్వహించిన జూమ్‌కాల్‌లో సాంబశివరావు ఆటోనగర్‌లోని సంస్థ కార్యక్రమం వివరాలను తెలియజేశారు. సమావేశంలో సంస్థ ఫీల్డ్ వర్కర్‌లు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాలకు అడ్డుకట్ట: ఎమ్మెల్యే గద్దె



పోలీసులకు సీసీ కెమెరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

రామలింగేశ్వరనగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నేరాలను అరికట్టడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. నియోజకవర్గంలోని 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్ ఠాగూర్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఎమ్మెల్యే సోమవారం పర్యటించారు. స్థానికుల సమస్యలను పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జనసేన నాయకులు గాదిరెడ్డి అమ్ములు ఆధ్వర్యంలో 100 సీసీ కెమెరాల ఏర్పాటుకు అవసరమైన ఆర్థిక సాయాన్ని పోలీసులకు ఎమ్మెల్యే అందజేశారు.

లక్ష్మీ ఎన్‌క్లేవ్ వాసుల సమస్య పరిష్కారానికి చర్యలు

15వ డివిజన్‌లోని లక్ష్మీ ఎన్‌క్లేవ్‌లో ఉన్న 60 కుటుంబాల సమస్య పరిష్కారానికి కార్పొరేషన్ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు చర్యలు తీసుకుంటారని ఎమ్మెల్యే చెప్పారు. ల్యాండ్ యజమానికి, బిల్డర్‌కు మధ్య ఉన్న విభేదాలను పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, టీడీపీ డివిజన్ అధ్యక్షుడు రత్నం రమేష్, బీజేపీ నాయకులు, జనసేన నాయకులు, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహనబాబు పాల్గొన్నారు.

ఐటీఐలో నాల్గో విడత అడ్మిషన్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

భారతీనగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో 2025-26/27 విద్యా సంవత్సరానికి నాల్గో విడత అడ్మిషన్స్ పొందడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని ఐటీఐ ప్రధానాధికారి, కన్వీనర్ ఎం.కనకారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్ సైట్ ద్వారా ఈనెల 27లోగా దరఖాస్తులను పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ వివరాలను ఈ నెల 28 మధ్యాహ్నం 2గంటలలోపు వెరిఫికేషన్ పూర్తి చేసుకోవాలని అన్నారు. 8వ తరగతి, పదో తరగతి ఉత్తీర్ణులయిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 0866-2475575, 9490639639, 7780429468 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

న్యూఆటోనగర్‌లో రూ. 43లక్షల ఆస్తిపన్ను వసూలు

- ఐలా సొసైటీ ఇన్‌చార్జి కమిషనర్ బాబ్జీ వెల్లడి

ఆటోనగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): న్యూఆటోనగర్‌లో ఈఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు రూ. 43లక్షల ఆస్తిపన్ను(ప్రాపర్టీ ట్యాక్స్) వసూలు చేసినట్లు న్యూ ఆటోనగర్ ఐలా సర్వీస్ సొసైటీ ఇన్‌చార్జి కమిషనర్ కె. బాబ్జీ చెప్పారు. మంగళవారం ఆయన జవహర్ ఆటోనగర్‌లోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 753 హౌస్‌హోల్డ్స్ నుంచి ఏడాదికి రూ. 79 లక్షలు ఆస్తిపన్ను డిమాండ్ ఉందని, గతంలో బకాయిలు కలిపి రూ. 1.13 కోట్లు ఆస్తిపన్ను రావల్సి ఉందని చెప్పారు. అందులో ఈఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు రూ.43 లక్షలు వసూలయ్యాయని తెలిపారు. పెండింగ్ ఆస్తిపన్ను బకాయిలు త్వరితగతిన చెల్లించాలని ఆయన కోరారు. లేనిపక్షంలో అపరాధ రుసుంతో చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఆటోనగర్‌లో పారిశుధ్యంపై కలెక్టర్ ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆటోనగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్‌లో పేరుకున్న చెత్తకుప్పలు అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై కలెక్టర్ లక్ష్మీశ ఆరా తీశారు. ఆయన జవహర్ ఆటోనగర్ ఐలా సర్వీస్ సొసైటీ కమిషనర్ కె. బాబ్జీని పిలిపించి వివరణ కోరారు. కమిషనర్ సమాధానం ఇస్తూ ఆటోనగర్‌లో తీసిన చెత్తను గుంటూరు జిల్లాలోని చెత్త నుంచి విద్యుత్ తయారీ కేంద్రానికి తరలించేందుకు కంప్యాక్టర్ అవసరమని చెప్పారు. దీని ఖరీదు రూ. 1.15 కోట్లు ఉంటుందని, ఇందులో 50 శాతం నిధులు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఇచ్చేందుకు ముందుకు వచ్చిందని, మిగిలిన 50 శాతం ఐలా నిధుల నుంచి ఇవ్వాలని తెలిపారు. దీనికి కలెక్టర్ లక్ష్మీశ సానుకూలంగా స్పందించారని ఐలా సర్వీస్ సొసైటీ కమిషనర్ బాబ్జీ మంగళవారం ఆటోనగర్‌లోని తన కార్యాలయంలో ఆంధ్రజ్యోతి ప్రతినిధితో తెలిపారు. ప్రస్తుతం 12 టన్నుల లారీ ద్వారా ఆటోనగర్‌లో సేకరించిన చెత్తను విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలో ఆటోనగర్‌లో పారిశుధ్య సమస్య తలెత్తకుండా చర్యలు చేపడతామని ఆయన చెప్పారు.



డాక్టర్ రితికను అభినందిస్తున్న డాక్టర్ ఏ.వై రావు

సిద్ధార్థ వైద్య విద్యార్థిని రితికకు ప్రథమ బహుమతి

మాచవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో జరిగిన 14వ రాష్ట్రస్థాయి చర్మవ్యాధుల సదస్సులో విజయవాడ సిద్ధార్థ వైద్య కళాశాల విద్యార్థి డాక్టర్ జి.వర్ధిని రితిక నోటి వ్యాధుల నిర్ధారణలో ఉపయోగించే మ్యూకోస్కోపీ అనే అంశంపై సమర్పించిన పరిశోధన పత్రానికి రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతిని పొందారు. ఈ సందర్భంగా ఆమెను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.వై రావు, సూపరింటెండెంట్ డాక్టర్ ఏ.వి రావు, విభాగాధిపతి డాక్టర్ వాణి అభినందించారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



వెటర్నరీ కాలనీలోని మొదటి రోడ్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదాలకు నిలయంగా మారింది. నివాసాలకు దగ్గరగా, రోడ్డుకు అతి సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. పిచ్చిమొక్కలు పెరిగి ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. -భారతీనగర్, ఆంధ్రజ్యోతి



విజేతలుగా నిలిచిన సిద్ధార్థ ఫార్మసీ విద్యార్థులు

ఆటల పోటీల్లో సిద్ధార్థ ఫార్మసీ విద్యార్థులకు బహుమతులు

లబ్బీపేట స్పోర్ట్స్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ నిర్వహించిన ఆటల పోటీలలో సిద్ధార్థ ఫార్మసీ కళాశాల విద్యార్థులు పలు విభాగాల్లో బహుమతులు గెలుపొందారు. ఈ పోటీల్లో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల నుంచి 10 కళాశాలల నుంచి 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల విద్యార్థులు మహిళల విభాగంలో కబడ్డీలో మొదటి బహుమతి, టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో మొదటి, రెండు స్థానాల్లో బహుమతులు, క్యారమ్స్ డబుల్స్‌లో మొదటి బహుమతి, త్రోబాల్‌లో మొదటి బహుమతి గెలుపొందారు. మెన్స్ విభాగంలో టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో మొదటి, రెండు స్థానాలు, క్యారమ్స్ డబుల్స్‌లో రెండో బహుమతి గెలుపొందారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ ఆచంట సునీత, ఫిజికల్ డైరెక్టర్ వినయ్ శేఖర్‌లు అభినందించారు.

చైల్డ్ అబ్యూస్, పోక్స్ యాక్ట్‌పై అవగాహన



రామలింగేశ్వరనగర, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణలంకలోని ఏపీఎస్ఆర్ఎం హైస్కూల్‌లో ఏడు, ఎనిమిది తరగతుల విద్యార్థినులకు నిర్భయ క్రాంతి మహిళా మండలి ప్రెసిడెంట్ రత్నలక్ష్మి ఆధ్వర్యంలో చైల్డ్ అబ్యూస్, పోక్స్ యాక్ట్, డ్రగ్స్ వినియోగించడం వలన వచ్చే అనర్థాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లాయర్ సీహెచ్ ఉషారాణి మాట్లాడుతూ చిన్నారులపై అత్యాచారాలకు పాల్పడితే పోక్సో యాక్ట్ ద్వారా కఠినమైన శిక్షలు ఉంటాయని తెలిపారు.

రత్నలక్ష్మి మాట్లాడుతూ అత్యాచార బాధితులు ముందుకు వచ్చి ధైర్యంగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఎస్ఐ శివకుమారి, సోషల్ యాక్టివిస్ట్ తులసీ, మహిళా మిత్ర సభ్యురాలు ఇందిర తదితరులు మాట్లాడారు. మహిళా మిత్ర భాను, కార్యదర్శి ఏఎస్ సీతా మహాలక్ష్మి, కే ఉషా, లయన్స్ దివ్యవాణి ,ఇతర సభ్యులు పాల్గొన్నారు.



దసరా ఏర్పాట్ల వివరాలు అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ ధ్యానచంద్ర

దసరా ఏర్పాట్లలో నిర్లక్ష్యం వద్దు

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

వన్‌టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రుల వేడుకల ఏర్పాట్లలో ఎటువంటి లోపం ఉండరాదని నగర కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. మంగళవారం వన్‌టౌన్, కెనాల్ రోడ్డు, వినాయకుడి గుడి తదితర ప్రాంతాల్లో పర్యటించి ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భక్తులకు ఎటువంటి లోపం ఉండరాదని, వీఎంసీ ఏర్పాటు చేసే వసతులను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భక్తులకు తాగునీటి సౌకర్యం ఏ పాయింట్ల వద్ద కల్పిస్తున్నారు, క్యూలైన్ల వద్ద సౌకర్యాలు, పారిశుధ్య నిర్వహణ, ఉచిత చెప్పుల స్టాండ్, మరుగుదొడ్ల పాయింట్‌లను పరిశీలించారు. కెనాల్ రోడ్ల వద్ద పాడైపోయిన ఫెన్సింగ్ గమనించి త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథరెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, ఎస్టేట్ ఆఫీసర్ ఎ.శ్రీధర్, ఈఈ జె.శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ పాల్గొన్నారు.

పూడుకుపోయిన సైడ్ కాలువలు

- దుర్వాసనతో కాలనీవాసుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



కాల్వల్లో నిలిచిన మురుగు

రామలింగేశ్వరనగర్, ఆంధ్రజ్యోతి: కాలువలు శుభ్రపరచక పోవడం వలన సైడ్ డ్రెయిన్లు పూడుకుపోవడంతో దుర్వాసనతో స్థానికులు ఇబ్బందిపడుతున్నారు. 15వ డివిజన్ రజిత్ భార్గవ వీధి, ఠాగూర్ వీధి, సీతారామయ్య వీధి, శివ గంగా భవాని వీధి వరకు ముఖ్యంగా ఈనాడు కాలనీకి వెళ్లే మార్గంలో సైడ్ కాలువలు శుభ్రపరచక పోవడం వలన పూడుకుపోయాయని చెత్తా, చెదారం, వ్యర్థాలతో నిండి ఉండడంతో దుర్వాసన భరించలేక పోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈగలు, దోమలు వ్యాప్తి చెంది డెంగ్యూ, కలరా, మలేరియా, డయేరియా వంటి వ్యాధుల బారిన పడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు చెప్పినా పెడ చెవిన పెడుతున్నారని కాలనీ వాసులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూడుకుపోయిన సైడ్ డ్రెయిన్లు నిర్మించి, శుభ్రపరిచే దిశగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



కర్నూలు మార్కెట్లో.. ఉల్లి బస్తాల లూటీ

కర్నూలు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): అసలే ఉల్లి రైతులు పుట్టెడు కష్టాల్లో ఉన్నారు. మార్కెట్లోనేమో గుట్టలుగా బస్తాలు పడి ఉన్నాయి. రోడ్డుపై ఉల్లి లోడులతో వాహనాలు వస్తూనే ఉన్నాయి. కుళ్లిపోయిన ఉల్లిని మార్కెట్ నుంచి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు... ఇదంతా ఒక ఎత్తయితే.. ఉల్లి గడ్డలను ఉచితంగా ఇచ్చేస్తున్నారనే ప్రచారం ఎలా జరిగిందో ఏమో.. మంగళవారం స్థానిక కాలనీ వాసులు మార్కెట్లో ఉన్న బస్తాలను ఎత్తుకుపోయారు. వ్యాపారులు కొనుగోలు చేసి, రైతులు మార్కెట్‌కు తెచ్చిన ఉల్లి బస్తాలను ఆటోలు, బైకులపై వేసుకుని ఇష్టారాజ్యంగా పట్టుకుపోయారు. ఈ పరిస్థితిని చూసి ఉల్లి రైతులు కన్నీరు పెట్టుకున్నారు. జాయింట్ కలెక్టర్ బి.నవ్య మార్కెట్‌ను తనిఖీ చేసి, పోలీసులను రప్పించడంతో ఉల్లి బస్తాలు ఎత్తుకుపోతున్న వారిని అడ్డుకున్నారు.

తెలంగాణ విద్యుత్తు బకాయిలపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేం

- వివాదంపై సమగ్ర విచారణ అవసరం: సుప్రీం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఏపీ జెన్కోకు తెలంగాణ విద్యుత్తు బకాయిలు చెల్లించాలని మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం కుదరదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. తెలంగాణ, ఏపీ మధ్య విద్యుత్తు బకాయిల వివాదంలో సమగ్ర విచారణ అవసరమని సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ఈ అంశంపై ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాతే నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. తెలంగాణ డిస్కంలకు గతంలో ఏపీ జెన్కో విద్యుత్తు సరఫరా చేసింది. ఈ క్రమంలో ఇరు రాష్ట్రాల మధ్య బకాయిల అంశంలో వివాదం ఏర్పడింది. తెలంగాణ డిస్కంలు తమకు రూ.వేల కోట్ల బకాయిలు చెల్లించడంలేదని, తక్షణమే చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలని ఏపీ జెన్కో కేంద్రాన్ని ఆశ్రయించింది. దీంతో అసలు రూ.3441.78 కోట్లతో పాటు చెల్లింపుల్లో జాప్యం చేసినందుకు సర్‌చార్జీ తదితరాలు రూ.3,315.14 కోట్లు కలిపి మొత్తం రూ6,756.92 కోట్లను 30 రోజుల్లో చెల్లించాలంటూ 2022 ఆగస్టు 29న తెలంగాణ ప్రభుత్వానికి కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. దీన్ని సవాలు చేస్తూ తెలంగాణ సర్కారు, విద్యుత్తు సంస్థలు వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. సుదీర్ఘ వాదనల అనంతరం అప్పటి సీజే నేతృత్వంలోని ధర్మాసనం కేంద్రం ఆదేశాలను రద్దు చేసింది. ఈ తీర్పును 2023 నవంబరు 24న ఏపీ జెన్కో సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఈ వ్యాజ్యం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఎదుట మంగళవారం విచారణకు రాగా, విషయ తీవ్రత దృష్ట్యా ఈ అంశంలో సమగ్ర విచారణ అవసరమని అభిప్రాయ పడింది. డిసెంబర్ మొదటి వారంలో సమగ్రంగా విచారణ చేపడతామని, అ తర్వాతే నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది.

కేజీహెచ్‌లో నెల రోజుల శిశువుకు అరుదైన శస్త్ర చికిత్స

విశాఖపట్నం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పుట్టుకతోనే తల వెనుక భాగంలో పెద్ద గడ్డతో జన్మించిన నెల రోజుల శిశువుకు కేజీహెచ్‌లోని న్యూరో సర్జరీ విభాగం వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. అల్లూరి జిల్లా జి.కొత్తూరు గ్రామానికి చెందిన శ్రీనివాస్, సత్యవతి దంపతులకు జన్మించిన ఆడ శిశువుకు తల వెనుక గడ్డ ఉండడంతో కేజీహెచ్‌కు తీసుకువచ్చారు. న్యూరోసర్జరీ విభాగం వైద్యులు ఈ నెల 6న శస్త్రచికిత్స చేసి గడ్డను తొలగించారు. ప్రస్తుతం చిన్నారి కోలుకుంది.



అంబేడ్కర్ నివాసంలో ఏసీబీ అధికారుల దాడుల్లో బయటపడ్డ నోట్ల కట్టలు(ఇన్‌సెట్‌లో) అంబేడ్కర్

ఏసీబీకి చిక్కిన టీ-విద్యుత్ ఏడీఈ

- రూ.100 కోట్లకుపైగా ఆస్తుల గుర్తింపు

హైదరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో విద్యుత్ శాఖ ఏడీఈని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. తెలంగాణ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలోని ఆపరేషన్స్ విభాగంలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్(ఏడీఈ)గా పనిచేస్తున్న ఏరుగు అంబేడ్కర్ భారీగా అక్రమ ఆస్తులు కూడబెట్టారని ఏసీబీ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో ఇబ్రహీంబాగ్‌లోని ఏడీఈ కార్యాలయం, మణికొండలోని అంబేడ్కర్ ఇల్లు, బంధువులు, సన్నిహితులు, బినామీల ఇళ్లలో మొత్తం 11 చోట్ల ఏసీబీ అధికారులు మంగళవారం ఉదయం నుంచి సోదాలు చేశారు. ఈ తనిఖీల్లో అంబేడ్కర్ బినామీగా అనుమానిస్తున్న సతీశ్ ఇంట్లో రూ.2.18 కోట్లను స్వాధీనం చేసుకున్నారు. శేరిలింగంపల్లిలో ఒక ఫ్లాట్, గచ్చిబౌలిలో ఐదు అంతస్తుల భవనం, సూర్యాపేటలోని పెన్‌పహాడ్‌లో పది ఎకరాల్లో రసాయన పరిశ్రమ, ఖరీదైన ప్రాంతాల్లో ఆరు ఇళ్ల స్థలాలు, వెయ్యి గజాల మామిడి తోట, రెండు కార్లు, పెద్ద ఎత్తున బంగారు ఆభరణాలు, బ్యాంక్ డిపాజిట్లను ఏసీబీ అధికారులు గుర్తించారు. ఈ ఆస్తుల మార్కెట్ విలువ రూ.100 కోట్లకు పైగా ఉండవచ్చని అంతర్గత సంభాషణల్లో ఏసీబీ అధికారులు పేర్కొంటున్నారు. భార్య సునందతో కలిసి అంబేడ్కర్ 2023 ఏప్రిల్ 23న అంతర్ కెమికల్స్ కంపెనీని రూ.3కోట్ల పెట్టుబడితో టీఎన్‌జీవో కాలనీలోని తన ఇంట్లో ప్రారంభించారు. ఆయన విద్యుత్ శాఖలో పనిచేస్తున్నప్పటికీ అంతర్ కెమికల్స్‌లో డైరెక్టర్‌గా ఆర్‌వోసీకి ఇచ్చిన సమాచారంలో పేర్కొన్నారు. కంపెనీ నిర్వహణ బాధ్యతలను గుర్రం రామకృష్ణకు అప్పగించినట్లు తెలుస్తోంది. అంబేడ్కర్ తన అక్రమ ఆదాయంలో చాలా వరకు రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి పెట్టినట్లు ఏసీబీ అధికారులు అనుమానిస్తున్నారు.

జగన్ ఫొటోతో సర్టిఫికెట్ల జారీ



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఫొటోతో ఉన్న ఆదాయ ధ్రువీకరణ పత్రం

మచిలీపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర దాటినా, ఇంకా పలు చోట్ల సచివాలయ ఉద్యోగులు బాధ్యతారహిత్యంగా వ్యవహరిస్తూ మాజీ సీఎం ఫొటోతో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారు. తాజాగా కృష్ణా జిల్లా మచిలీపట్నం నార్త్ మండల పరిధిలోని తాళ్లపాలెం సచివాలయంలో ఇలాంటి వ్యవహారమే వెలుగు చూసింది. ఈ పంచాయతీలో మంగళవారం ఇద్దరికి కులధ్రువీకరణ, ముగ్గురికి ఆదాయ ధ్రువీకరణపత్రాలు జారీ చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ధ్రువీకరణ పత్రాలపై సీఎం గానీ, ఇతర నేతల ఫొటోలు గానీ లేకుండా, ప్రభుత్వ అధికార చిహ్నంతో పత్రాలు జారీ చేస్తోంది. ఈ విషయం సచివాలయ ఉద్యోగులందరికీ తెలుసు. అయితే ఇక్కడి డిజిటల్ అసిస్టెంట్ సెలవులో ఉండటంతో మహిళా పోలీస్‌కు ఇన్‌చార్జి డిజిటల్ అసిస్టెంట్ బాధ్యతలు అప్పగించారు. ఆమె పాత సర్టిఫికెట్లతో ప్రింట్లు ఇచ్చారు. వీటిపై మాజీ సీఎం వైఎస్ జగన్ ఫొటో ఉంది. ఇది బయటికి పొక్కడంతో రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు వాటిని వెనుక్కి తీసుకున్నారు. కాగా, తాళ్లపాలెం-1 సచివాలయంలో పనిచేస్తున్న ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ మంగళవారం రాత్రి కలెక్టర్ బాలాజీ ఉత్తర్వులు జారీ చేశారు. సచివాలయ ఇన్‌చార్జి, డిజిటల్ అసిస్టెంట్ పి.పెద్దింట్లమ్మ, గ్రేడ్-2 సెక్రటరీ జె.రవి శంకర్‌లను సస్పెండ్ చేశారు.

వాణిజ్య అవసరాలకు వినియోగించొద్దు

- గొడుగుపేట వేంకటేశ్వరస్వామి భూముల విషయంలో హైకోర్టు ఆదేశం
- గ్రావెల్‌ను తొలగించి దేవాలయ భూమిని పూర్వస్థితికి తీసుకురండి
- కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు ఆదేశం
- తదుపరి విచారణ అక్టోబర్ 6కి వాయిదా

అమరావతి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం గొడుగుపేట శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన విజయవాడ, గొల్లపూడి గ్రామం పరిధిలోని వ్యవసాయ భూములను విజయవాడ ఉత్సవ్ పేరిట వాణిజ్య అవసరాలకు వినియోగించడానికి వీల్లేదని హైకోర్టు తేల్చి చెప్పింది. సదరు భూములను గ్రావెల్, క్వారీ వ్యర్థాలతో నింపవద్దని అధికారులను ఆదేశించింది. దేవస్థానం భూములను ఇతర వాణిజ్య కార్యక్రమాల వినియోగానికి ప్రతిపాదించవద్దని అధికారులను స్పష్టం చేసింది. ఇప్పటికే ఆ భూముల్లో పోసిన గ్రావెలెను తొలగించి, భూమిని పూర్వస్థితికి తీసుకురావాలని ఆదేశించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులుగా ఉన్న దేవదాయశాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్, ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్, ఇతర అధికారులను ఆదేశించింది. పిటిషన్‌పై తదుపరి విచారణను అక్టోబర్ 6కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎన్టీఆర్ జిల్లా విజయవాడ, గొల్లపూడి గ్రామం పరిధిలోని వివిధ సర్వేనెంబర్లలో ఉన్న మచిలీపట్నం గొడుగుపేట శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన 34.99 ఎకరాల భూమిని విజయవాడ ఉత్సవ్ పేరుతో వాణిజ్య అవసరాలకు కేటాయించడాన్ని సవాల్ సవాల్ చేస్తూ మచిలీపట్నానికి చెందిన బూరుగడ్డ సుజయ్‌కుమార్, మరో ఇద్దరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు రాగా పిటిషనర్ల తరఫున న్యాయవాది జె.వి.ఫణిదత్ వాదనలు వినిపించారు. విజయవాడ ఉత్సవ్ పేరుతో శాశ్వత ప్రాతిపదికన వార్షిక ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసేందుకు దేవస్థానికి చెందిన వ్యవసాయ భూమిని కేటాయిస్తున్నారన్నారు. భూముల వినియోగానికి ఆమోదం తెలపాలని కోరుతూ దేవదాయశాఖ ముఖ్యకార్యదర్శికి ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ జూలై 22న లేఖ రాశారన్నారు. వ్యవసాయ భూమిని ఆరు అడుగుల మేర గ్రావెల్, క్వారీ వ్యర్థాలతో నింపి చదును చేస్తున్నారన్నారు. ఇకపై ఆ భూమి వ్యవసాయం చేయడానికి పనికి రాదన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్‌జీపీ ఎస్.ప్రణతి వాదనలు వినిపిస్తూ, ఎగ్జిబిషన్ నిర్వహించ తలపెట్టిన స్థలం వ్యవసాయ భూమి కాదన్నారు. సంబంధిత భూమి మున్సిపాలిటీ పరిధిలో ఉందన్నారు. వ్యవసాయేతర భూములను లీజు ప్రాతిపదికన వాణిజ్య కార్యకలాపాలకు కేటాయించే అధికారం దేవదాయశాఖ కమిషనర్‌కు ఉందన్నారు. భూములను వ్యవసాయేతర భములుగా మారుస్తూ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను కోర్టు ముందు ఉంచుతామన్నారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులు సొసైటీ ఫర్ వైబ్రెంట్, విజయవాడ సంబంధిత దేవస్థానం ఈవో పేరు మీద రూ.45 లక్షల చెక్కులు జారీ చేసిందన్నారు. భూముల నుంచి దేవస్థానానికి ఆదాయం చేకూర్చేందుకే ఎగ్జిబిషన్ నిర్వహణకు భూములు కేటాయించాలని అధికారులు నిర్ణయించారన్నారు. ఎగ్జిబిషన్ కేవలం 56 రోజులకే పరిమితం అన్నారు. భూముల లీజు విషయంలో నిబంధనలకు అనుగుణంగానే నడుచుకున్నామన్నారు. ప్రక్రియను నిలువరిస్తూ ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయవద్దని కోరారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి గొడుగుపేట వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన వ్యవసాయ భూములను వాణిజ్య అవసరాలకు వినియోగించవద్దని అధికారులకు స్పష్టం చేశారు.



గోల్ఫ్ కోర్స్ ఏర్పాటులో తదుపరి చర్యలు తీసుకోవద్దు

ఎన్టీఆర్‌జిల్లా, గొల్లపూడి గ్రామం పరిధిలోని గొడుగుపేట వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన ఐదు ఎకరాల భూమిలో గోల్ఫ్ కోర్స్ ఏర్పాటుకు ఎలాంటి తదుపరి చర్యలు తీసుకోవద్దని అధికారులను హైకోర్టు ఆదేశించింది.

దేవస్థానం భూములను ఆధ్యాత్మిక, మతపరమైన కార్యక్రమాలకు తప్ప ఇతర అవసరాలకు కేటాయించే అధికారం జిల్లా కలెక్టర్‌కు లేదని స్పష్టం చేసింది. దేవుడి ఆస్తులకు న్యాయస్థానాలు శాశ్వత సంరక్షకులనే విషయాన్ని గుర్తుంచుకోవాలని పేర్కొంది. న్యాయస్థానాలు ఎల్లప్పుడు దేవాలయాల ఆస్తులను కాపాడాలని తెలిపింది. గోల్ఫ్‌కోర్స్ ఏర్పాటు విషయంలో ముందుకెళ్లవద్దని అధికారులను ఆదేశిస్తూ, ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను అక్టోబరు 10కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ సోమవారం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు.

ఎన్టీఆర్‌జిల్లా, గొల్లపూడి గ్రామం పరిధిలోని గొడుగుపేట వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన ఐదు ఎకరాల భూమిలో గోల్ఫ్ కోర్స్ ఏర్పాటుకు ఆమోదం తెలపాలని కోరుతూ దేవదాయశాఖ ముఖ్యకార్యదర్శికి ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీషా ప్రతిపాదిస్తూ ఈ ఏడాది జూలై 22న రాసిన లేఖను సవాల్ చేస్తూ మచిలీపట్నానికి చెందిన బూరగడ్డ సుజయ్‌కుమార్, మరో ఇద్దరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది జె.వి.ఫణిదత్ వాదనలు వినిపించారు. దేవస్థానం భూములను వాణిజ్య అవసరాలను వినియోగించడానికి వీల్లేదన్నారు. ప్రభుత్వన్యాయవాది వాదనలు వినిపిస్తూ, గోల్ఫ్ కోర్స్ ఏర్పాటు ప్రతిపాదన దశలో ఉందన్నారు.

ముప్పాళ్లలో పథకాల అమలు భేష్

- జాతీయ మీడియా బృందం వెల్లడి
- అభివృద్ధి పనుల పరిశీలన



ముప్పాళ్ల గ్రామంలో పర్యటిస్తున్న జాతీయ మీడియా బృందం

చందర్లపాడు, సెప్టెంబరు 16 (ఆంధ్ర జ్యోతి) : ముప్పాళ్ల గ్రామంలో ప్రభుత్వ పథకాలు సమర్థంగా అములులో ప్రజల సహకారం శ్లాఘనీయమని జాతీయ మీడియా ప్రతినిధి బృందం పేర్కొంది. దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయతీ సతత్ వికాస్ పురస్కారం అందుకున్న ముప్పాళ్ల గ్రామాన్ని జాతీయ మీడియా ప్రతినిధులు మంగళవారం సందర్శించారు. పారిశుధ్యం, అంతర్గత రోడ్లు, డ్రైన్‌ల నిర్మాణంతో పాటు సామాజిక భద్రత, మహిళా రక్షణ తదితర అంశాలను పరిగణలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం ముప్పాళ్ల గ్రామానికి 2022-23 కు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ పురస్కారం అందజేసింది. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదగా సర్పంచ్ కుసుమరాజు వీరమ్మ అవార్డు అందుకున్నారు. ఈ పురస్కారానికి ఎంపికైన ముప్పాళ్ల పంచాయతీకి కేంద్రం కోటి రూపాయల నిధులు అందజేసింది. ముప్పాళ్ల గ్రామం ఈ పురస్కారానికి ఎంపిక కావడానికి గల కారణాలు, ఇక్కడ నెలకొన్న పరిస్థితులు, అభివృద్ధి క్రమంలో నడిచిన విధానంపై ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆధ్వర్యంలో జాతీయ మీడియా సభ్యులు అధ్యయనం చేశారు. గ్రామంలో పర్యటించిన మీడియా బృందం ప్రజలతో మాట్లాడింది. జిల్లా పంచాయతీల ఇన్‌చార్జి లావణ్య, గ్రామ కార్యదర్శి సాయి కుమార్ గ్రామ పాలనా విధానాలను, ప్రభుత్వం, ప్రజల సహకారంతో సాధించిన అభివృద్ధిని వివరించారు. ఆరోగ్యం, రెవెన్యూ, సంక్షేమం, ఇంజనీరింగ్, వ్యవసాయం వంటి అంశాలను ఫొటోలతో ప్రదర్శించారు. గ్రామంలో సాగవుతున్న ఉద్యాన వన పంటలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ముప్పాళ్ల గ్రామంలో ప్రారంభించిన పీ-4 గురించి జాతీయ మీడియా ప్రతినిధులు ఆరా తీశారు. పథకం విధివిధానాలు తెలుసుకున్న ప్రతినిధి బృందం లబ్ధిదారులతో మాట్లాడింది. సామాజిక పెన్షన్లు, తల్లికి వందనం, పసల్ భీమా, మాతృవందనం, పోషణ్ మహాన్, జలజీవన్ మిషన్ తదితర అంశాలపై నిశిత పరిశోధన చేశారు. అసిస్టెంట్ డైరెక్టర్ తోట చందన, పంచాయతీ రాజ్ అధికారులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 జట్ల ఎంపిక పోటీలు 22 నుంచి

విజయవాడ (స్పోర్ట్స్), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణాజిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 బాల,బాలికల జట్ల ఎంపిక పోటీలు ఈనెల 22వ తేదీ ఉదయం 9గంటలకు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం లో ప్రారంభమవుతాయని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి వి.రవికాంత తెలిపారు. కబడ్డీ, నెట్‌బాల్, టైక్వాండో ఎంపికలు జరుగుతాయన్నారు. ఈనెల 23వ తేదీ ఉదయం 9 గంటలకు మొగల్రాజపురంలోని పీపీ సిద్ధార్థ కళాశాలలో రగ్బీ జట్ల ఎంపికలు జరుగుతాయన్నారు. సమాచార కోసం వి.రవికాంత్, సెల్ నెంబర్ 9440112455లో సంప్రదించాల్సిందిగా కోరారు.

సెర్ప్ కార్యాలయం తరలింపుపై ఆందోళన

- ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి మహానాడు రోడ్డుకు మార్పు
- దూరాభారం అవుతుందంటున్న సిబ్బంది

అమరావతి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామీణ పేదరిక నిర్మూలన పథకం(సెర్ప్) సీఈవో కార్యాలయాన్ని విజయవాడ ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఆటోనగర్ మహానాడు రోడ్డులోని యునైటెడ్ టవర్స్‌లోకి మారుస్తూ గ్రామీణాభివృద్ధి శాఖ ఎక్స్ అఫిషియో సెక్రటరీ కరుణ వాకాటి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర విభజన తర్వాత ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలోని ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేషన్ భవనంలో సెర్ప్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఇదే భవనంలో ఆర్టీసీతోపాటు పలు రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి డీఆర్‌డీఏ అధికారులు, వెలుగు సిబ్బంది ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఉన్న ఈ కార్యాలయానికి రావడం సులువుగా ఉంటోంది. కార్యాలయ సిబ్బంది కూడా ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. అయితే సెర్ప్ సీఈవోగా కరుణ బాధ్యతలు తీసుకున్న తర్వాత కార్యాలయాన్ని తరలించాలని నిర్ణయించడంతో సిబ్బంది కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహిళలు ఎక్కువగా పనిచేస్తున్న కార్యాలయాన్ని... అంతగా జన సంచారం లేని మహానాడు రోడ్డులోకి మార్చడం సరైన నిర్ణయం కాదని అంటున్నారు. ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని కార్యాలయాన్ని తరలిస్తున్నారని వాపోతున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వివిధ పనుల కోసం వచ్చేవారికి వ్యయప్రయాసలు తప్పవని ఆందోళన చెందుతున్నారు.

రంగా వర్సిటీలో పీజీ సీట్లకు ఆన్‌లైన్ దరఖాస్తు గడువు పెంపు

అమరావతి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 2025-26 సంవత్సరానికి వివిధ విభాగాల్లో ఎమ్మెస్సీ, ఎంటెక్, ఎంబీఏ(ఏబీ), పీహెచ్‌డీ, ఎంబీఏ(ఏబీ-ఎస్‌ఎఫ్‌క్యూ) ప్రోగ్రాముల్లో సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 18 వరకు గడువు పొడిగించినట్లు రిజిస్ట్రార్ తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదు చేసి, హార్డ్ కాపీని వ్యక్తిగతంగా లేదా పోస్టు ద్వారా ఈ నెల 22లోగా వర్సిటీ రిజిస్ట్రార్‌కు అందించాలని సూచించారు.

మత్స్యశాఖ పథకాల అమలుకు తాజా మార్గదర్శకాలు జారీ

అమరావతి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మత్స్యశాఖలో రూ.50 లక్షల కంటే ఎక్కువ విలువ గల లబ్ధిదారుల పథకం, ప్రాజెక్టులు సజావుగా అమలు చేయడానికి రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. కొన్ని సవరణలతో మంగళవారం తాజాగా మార్గదర్శకాలు జారీ చేసింది. అలాగే ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద రూ.50 లక్షల కంటే తక్కువ, రూ.50 లక్షల కంటే ఎక్కువ వ్యయంతో గ్రౌండింగ్ చేసిన యూనిట్లలో వాస్తవ పరిస్థితిని నిర్ధారించడానికి జిల్లా మత్స్యశాఖ అధికారి చైర్మన్‌గా కమిటీని నియమిస్తూ మరో ఉత్తర్వు జారీ చేసింది.





ఎన్‌ఫోర్స్‌మెంటు సందర్భంగా పోలీసులు ఆపిన వాహనాలు, నిబంధనలు పాటించని వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

ట్రాఫిక్ రీల్స్

- ఎన్‌ఫోర్స్‌మెంట్ సమయంలో యూట్యూబర్లు
- వాహన తనిఖీల చిత్రీకరణ
- వాహనదారుల ఆగ్రహం

(ఆంధ్రజ్యోతి - విజయవాడ/సత్యనారాయణపురం)

ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీల సమయంలో కొంతమంది యూట్యూబర్లను చుట్టూ పెట్టుకుంటున్నారు. వ్యూస్ కోసం యూట్యూబర్లు రీల్స్ చేస్తుంటే ట్రాఫిక్ పోలీసులు యాక్షన్ చేస్తున్నారు. విజయవాడ నగరంలో ఈ అంశం ట్రాఫిక్ పోలీసులను ఇరకాటంలో పెడుతోంది. నిబంధనలు పాటించకపోతే జరిమానా విధించడం వరకు ఓకే... తమను ఎలా వీడియోల్లో చూపిస్తారంటూ వాహనదారులు ఎదురు తిరుగుతున్నారు. మూడో ట్రాఫిక్ స్టేషన్ పరిధిలో కొద్దిరోజుల క్రితం సరిగ్గా ఇదే జరిగింది. వాహనాల తనిఖీ నిర్వహించడం వరకు బాగానే ఉన్నా చుట్టూ ఉన్న యూట్యూబర్ల కారణంగా విమర్శలను మూటగట్టుకున్నారు.

ఇదీ పరిస్థితి : ట్రాఫిక్ పోలీసులు నిత్యం వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. విజయవాడ మూడో ట్రాఫిక్ స్టేషన్ అధికారులు బీఆర్టీఎస్ ఫుడ్ కోర్టు వద్ద కొద్దిరోజుల క్రితం నిర్వహించిన తనిఖీ వివాదాస్పదమైంది. మూడు బైక్‌లపై వెళ్తున్న యువకులను ఆపి రికార్డులు తనిఖీ చేశారు. ఈ ఆరుగురు మ ద్యం మత్తులో ఉన్నారని పోలీసులు చెబుతున్నారు. వారిని తనిఖీ చేస్తున్న దృశ్యాలను ఓ యూట్యూబర్ వీడియో తీస్తున్నాడు. దీంతో అక్కడే ఉన్న ఆర్ఎస్సైలో నాలుగో సింహం బయటకు వచ్చింది. యువకులను ఆపి దురుసుగా ప్రవర్తించారు. దీంతో యువకులు, స్థానికులు ఎదురు తిరిగారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఇన్‌స్పెక్టర్ యువకులకు కౌన్సెలింగ్ చేసి పంపేశారు. ట్రాఫిక్ పోలీసులు ఎక్కడ తనిఖీలు చేస్తుంటే అక్కడ యూట్యూబర్లు వాలిపోతున్నారు. రీల్స్ కోసం, వీడియోల కోసం వారే కొన్ని చోట్ల వాహనాలను ఆపుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు ఆపాల్సిన తమ వాహనాలను యూట్యూబర్లు ఎలా ఆపుతారని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు.

ఎన్‌ఫోర్స్‌మెంటుకు దూరంగా వాహనాలు.. ఫోన్ పే : ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రదేశాలో వాహనాలను పోలీసులు అక్కడే ఆపుతారు. ఫోన్‌లో ఉన్న ఈ పరివాహన్ యాప్‌లో వాహనం నెంబరు టైపు చేసి ఎన్ని చలాన్లు పెండింగ్‌లో ఉన్నాయో తెలుసుకుని, పెండింగ్ ఉంటే వెంటనే చెల్లింపులు చేయిస్తున్నారు. కొన్ని చోట్ల వాహనాలను దూరంగా ఆపుతున్నారు. ఈ వాహనాలు ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రదేశానికి దూరంగా ఎందుకు ఆగుతున్నాయో ట్రాఫిక్ పోలీసులకు, వాహనదారులకు తప్ప మిగిలిన వారికి తెలియడం లేదు. కొద్దిరోజుల క్రితం మూడో ట్రాఫిక్ స్టేషన్ పరిధిలో ఓ న్యాయవాదిని పోలీసులు ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా ఆపారు. ఆయనకు జరిమానా విధిస్తున్నట్టు చెప్పారు. ఓ కానిస్టేబుల్ ఆయనను కొంతదూరం తీసుకెళ్లి తన సోదరుడి ఫోన్‌పే నంబరుకు రూ.1400 ఆన్‌లైన్‌లో బదిలీ చేయించుకున్నాడు. దీనిపై ఆ యన కంట్రోల్ రూంకు ఫిర్యాదు చేశారు. కొన్ని చోట్ల వాహనదారుల నుంచి వసూలు చేసే డబ్బులను సమీపంలో ఉన్న వ్యాపార సంస్థల క్యూఆర్ కోడ్‌లను ఉపయోగించుకుంటున్నారు.

విమాన ప్రయాణికుల సేవా దినోత్సవం నేడు

- ప్రత్యేక కార్యక్రమాలు : విమానాశ్రయ డైరెక్టర్ లక్ష్మీకాంతరెడ్డి



గన్నవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఈ నెల 17వ తేదీన యాత్రి సేవ దివస్ (ప్రయాణికుల సేవ దినోత్సవం) నిర్వహించనున్నట్లు విమానాశ్రయ డైరెక్టర్ లక్ష్మీకాంత రెడ్డి తెలిపారు. విమానాశ్రయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విమాన ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు, సురక్షితమైన ప్రయాణాన్ని అందించడమే సేవా దివస్ ప్రధాన లక్ష్యమన్నారు. యాత్రిసేవా దివస్‌లో భాగంగా బుధవారం విమానాశ్రయంలో ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రయాణికులందరికీ స్వాగతం, ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు, రక్తదాన కార్యక్రమం, క్యాబ్/టాక్సీ డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. విమానయాన రంగంలో కెరీర్ అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. జానపద నృత్యం, ప్రముఖ వ్యక్తులు, సీనియర్ పౌరులచే మొక్కలు నాటడం, దేశభక్తి అంశంపై పాఠశాల విద్యార్థులు, చిన్నారులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విమానాశ్రయ అధికారులు శ్రీహరి రావు, అంకిత్ జైస్వాల్ పాల్గొన్నారు.

రిజిస్టర్ పోస్టులో ఇంటికే స్మార్ట్ రేషన్‌కార్డు

మొగల్రాజపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ కార్డు తీసుకోని వారి కోసం కూటమి ప్రభుత్వం వినూత్న ప్రయోగం చేపట్టింది. స్మార్ట్ రేషన్ కార్డును నేరుగా లబ్ధిదారుని ఇంటికి చేర్చడానికి రంగం సిద్ధం చేస్తోంది. నవంబరు నుంచి రిజిస్టర్ పోస్టు ద్వారా స్మార్ట్ కార్డులు లబ్ధిదారుని ఇంటికే చేర్చడానికి పోస్టల్ సేవలను వినియోగించనున్నారు. రిజిస్టర్ పోస్టు ద్వారా స్మార్టు కార్డు ఇంటికి రాగానే లబ్ధిదారుడు కేవలం రూ.35 చెల్లిస్తే చాలు. స్మార్ట్ కార్డులు పొందిన వారు తమ కార్డులో అక్షర దోషాలు, ఇతర పొరపాట్లు ఉంటే వాటిని సరిచేసుకోవడానికి పౌరసరఫరాలశాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ మరొక అవకాశం ఇచ్చారు. ఇలాంటి వారంతా అక్టోబరు 31లోగా మార్పుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

హైందవ సంప్రదాయాలకు విరుద్ధంగా దసరా సెలవులు

- పొరపాటును సరిదిద్దాలి : యూటీఎఫ్ కన్వీనర్ శ్రీనివాస్

విజయవాడ (గాంధీనగర్), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : హైందవ సంప్రదాయాలకు విరుద్ధంగా పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించడంపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే స్పందించాలని ఐక్య ఉపాధ్యాయ వేదిక (యూటీఎఫ్) రాష్ట్ర కన్వీనర్ ఆర్‌వివిఎం.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో మహాలయ అమావాస్య నుంచి విజయదశమి వరకు పాఠశాలలకు గతంలో సెలవులు ప్రకటించే వారని గుర్తు చేశారు. విద్యాశాఖ మంత్రి స్పందించి పొరపాటును సరిదిద్ది హైందవ సంప్రదాయాలను గౌరవించి, హిందువుల మనోభావాలను కాపాడాలని కోరారు.

నవోదయ 11వ తరగతి సైన్స్ స్ట్రీమ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి 11వ తరగతి సైన్స్ స్ట్రీమ్‌లో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తు న్నట్లు వేలేరు జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ డి. ఏదునందన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిమిత సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, మొదట దరఖాస్తు చేసుకున్న వారికి మొదటి ప్రాధాన్యత పద్ధతిలో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. 2024-25 విద్యాసంవత్సరంలో కనీసం 60 శాతం మార్కులతో(సైన్స్, గణితం) పదవ తరగతి ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు టీసీ, మార్కుల మెమోరాండమ్ తదితర పత్రాల ఒరిజినల్, జిరాక్స్ కాపీలతో విద్యాలయ పని సమయాల్లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 23వ తేదీ చివరి తేదీ అని ప్రిన్సిపాల్ ఏదునందన తెలిపారు.

వ్యసనాలకు చికిత్స పొందిన వ్యక్తులపై కరుణ చూపాలి



మాట్లాడుతున్న ఇంద్రసేనారెడ్డి

విజయవాడ రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మద్యపానం, మాదక ద్రవ్యాల వంటి వ్యసనాలకు చికిత్స తీసుకున్న వ్యక్తుల పట్ల కరుణ చూపాలని త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. నున్నలోని ఇండ్లాస్ శాంతివన్‌ను గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి మంగళవారం సందర్శించారు. ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికారు. గవర్నర్ ఇంద్రసేనారెడ్డి శాంతివన్‌లో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి అనుభవాలను తెలుసుకున్నారు. మానసిక ఆరోగ్యం, వ్యసనం అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. గవర్నర్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ వ్యసనాలకు బానిసలైన రోగులకు పునరావాసం కల్పించి అంకిత భావంతో సేవ చేస్తున్న ఇండ్లాస్ శాంతివన్ సేవలను అభినందించారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ వ్యసనాలకు అలవాటు పడిన వారు సకాలంలో చికిత్స తీసుకుంటే వ్యక్తిగత జీవితం బాగుంటుందన్నారు. డాక్టర్ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ శాంతివన్ ప్రారంభించిన నాటి నుంచి ఐదు వేల మందికి పైగా చికిత్స అందించి కొత్త జీవితాన్ని ఇచ్చామన్నారు. ఇండ్ల విశాల్ రెడ్డి, నున్న పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
బుధవారం
17 సెప్టెంబరు 2025
నవ్య
కుటుంబ కదంబం

నగలు అనగానే బంగారం, వెండి లాంటి లోహాలతో, పూసల్లాంటి వాటితో చేసినవి కళ్ల ముందు మెదులుతాయి. కానీ **పుతుల్‌దాస్ మిత్రా** 'కాదేదీ సృజనాత్మక సృష్టికి అనర్హం' అంటారు. కోల్‌కతాకు చెందిన ఆమె ధాన్యంతో రూపొందించిన వివిధ ఆభరణాలు విదేశాల్లో కూడా ఆదరణ పొందుతున్నాయి. ఎందరికో శిక్షణ ఇచ్చి ఉపాధి మార్గం చూపుతున్న 46 ఏళ్ల పుతుల్‌దాస్ పలు పురస్కారాలు సైతం అందుకున్నారు.

ధాన్యంతో 'నగ'ధగలు



"గోవిందభోగ్ అనే రకం వరి ధాన్యాన్ని మా రాష్ట్రం పశ్చిమబెంగాల్‌లో ఎక్కువగా సాగు చేస్తారు. ఆశ్వయుజ పూర్ణిమను 'కోజాగరి పూర్ణిమ'గా, లక్ష్మీదేవి పుట్టినరోజుగా మేము జరుపుకొంటాం. ఆ సందర్భంలో... గోవిందభోగ్ ధాన్యంతో దండలు తయారు చేసి ఇళ్లలో అలంకరించడం ఆచారం. పూల దండలతో పోలిస్తే ఈ దండలు ఎక్కువకాలం ఉంటాయి. కోల్‌కతా నగరంలో పుట్టి పెరిగిన నాకు ఈ దండలు తయారు చేయడం చిన్న వయసునుంచీ అలవాటే. దాంతోపాటే కుట్లు, అల్లికలు నేర్చుకున్నాను. కాలేజీలో చదువుతున్నప్పుడు ధాన్యంతో రాఖీలు చేశాను. చూసిన ప్రతి ఒక్కరూ మెచ్చుకున్నారు. ఆ తరువాత నా దృష్టి నగల మీదకు మళ్లింది.

ప్రణబ్ అభినందించారు...

చిన్న చిన్న దండలతో నా ప్రయోగాలు మొదలయ్యాయి. ఆ తరువాత చెవి దుద్దుల్లాంటి చిన్న చిన్న వస్తువులు. క్రమంగా జూకాలు, గాజులు, నెక్లెస్‌లు... ఇలా రకరకాల ఆభరణాలు రూపొందించాను.



2000 సంవత్సరంలో... కోల్‌కతాలో నిర్వహించిన ఒక ఎగ్జిబిషన్‌లో వాటిని ప్రదర్శించే అవకాశం వచ్చింది. సందర్శకులకు అవి ఎంతో నచ్చాయి. వాటిని ఉత్సాహంగా కొన్నారు. దాంతో నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. కోల్‌కతా, ఆ చుట్టుపక్కల ఎక్కడ ఎగ్జిబిషన్లు, ఉత్సవాలు జరిగినా... నా స్టాల్ ఏర్పాటు చేసేదాన్ని. మీడియాలో నా గురించి ప్రచారం అయింది. నేను చేసేవి విశిష్ట కళారూపాలుగా గుర్తిస్తూ... 2002లో రాష్ట్రప్రభుత్వం నాకు అవార్డును అందజేసింది. అనంతరం దేశంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించే ఎగ్జిబిషన్లలో నేను తయారు చేసిన నగలను విక్రయించడం మొదలుపెట్టాను. కానీ ఒక ప్రదర్శనకోసం డిమాండ్‌కు తగినన్ని ఆభరణాలు చేయడం అంత సులువు కాదు. ఎంతో శ్రమపడాల్సి వచ్చేది. అప్పుడే మరికొందరు మహిళలకు శిక్షణ ఇచ్చాను. మేమందరం కలిసి ఢిల్లీలో ప్రదర్శన ఇచ్చినప్పుడు... నాటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ వచ్చారు. మా ఆభరణాలను తిలకించి, అభినందించారు. 2015లో ఆయన చేతుల మీదుగానే 'నేషనల్ హ్యాండీక్రాఫ్ట్ అవార్డు'ను స్వీకరించాను. అనంతరం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'గురు శిష్య పరంపర పథకం' కింద వివిధ రాష్ట్రాల్లో వేలాదిమందికి ధాన్యం ఆభరణాల తయారీలో శిక్షణ ఇచ్చాను.

జూకాల నుంచి పెళ్లి నగల వరకూ...

"ధాన్యం ఆహారానికి ఉపయోగించేది కదా! దీంతో నగలేమిటి? ఇవి ఎన్నాళ్ళుంటాయి గనుక!" అని కొందరు సందేహం వ్యక్తం చేస్తూ ఉంటారు. కానీ ఇవి పర్యావరణానికి మంచివి, చర్మానికి, మన ఆరోగ్యానికి ఎలాంటి హాని చెయ్యవు. నగల తయారీకి ముందు వాటిని ప్రత్యేక పద్ధతిలో శుద్ధి చేస్తాం. కాబట్టి అవి పాడవకుండా ఉంటాయి. ఏడు నుంచి ఎనిమిదేళ్ళ వరకూ మన్నుతాయి. ఇప్పుడు చిన్న జూకాల నుంచి పెళ్ళిళ్ళకు బ్రైడల్ సెట్ల వరకూ ప్రతిదీ మేం రూపొందిస్తున్నాం. మరోవైపు గృహాలంకరణ వస్తువులను కూడా ధాన్యంతో తయారు చేస్తున్నాం. మన దేశంలోనే కాదు, చైనా, ఫ్రాన్స్, ఇటలీ, స్విట్జర్లాండ్ లాంటి అనేక దేశాల్లో కూడా వీటిని ఆన్‌లైన్ ద్వారా విక్రయిస్తున్నాం. మొదట మా నాన్నగారు, తరువాత నా భర్త, ఇప్పుడు మా పిల్లల ప్రోత్సాహం లేకపోతే ఇదంతా సాధ్యమయ్యేది కాదు. పాతికేళ్ళ క్రితం సరదాగా ప్రారంభించిన ఒక చిన్న ప్రయత్నం నాకు ఇంత పేరు తెచ్చిపెట్టిందంటే ఆశ్చర్యంగా అనిపిస్తోంది. ఇదేదీ నేను ఒక ప్రణాళిక వేసుకొని చేసినది ఏమాత్రం కాదు. మనం నిమిత్తమాత్రులం అని, విధి మనల్ని నడిపిస్తుందనీ గట్టిగా నమ్ముతాను. నా వద్ద ముప్పై మందికిపైగా ఉపాధి పొందుతున్నారు. నా దగ్గర శిక్షణ పొందినవారిలో చాలామంది ధాన్యంతో కళాకృతులు, నగల తయారీని ఆదాయ మార్గంగా మార్చుకున్నారు. ఇంతకన్నా సంతృప్తి ఏముంటుంది?"



పిక్సీ హెయిర్ కట్.. నుదుటికి బ్లూ బాండ్.. బంతి చేతపడితే అవతల ఎవరున్నా తికమకపడాల్సిందే! బయట మామూలుగా మాట్లాడే ఈ అమ్మాయి క్రికెట్ గ్రౌండ్‌లో ప్రవేశిస్తే కొదమ సింహమే. ఆమె ఎవరో కాదు **నల్లపురెడ్డి శ్రీచరణి**. మన రాయలసీమ నుంచి టీమ్ ఇండియాకు ఎంపికయిన మహిళా క్రికెటర్. ఐదు నెలల క్రితం డబ్ల్యూపీఎల్‌లో అరంగేట్రం.. ఆ తర్వాత భారత వన్డే.. టీ20 జట్లలో ఆగమనం. ఇలా క్రికెట్‌లో దూసుకుపోతున్న శ్రీచరణి ఈ నెలఖరున మన దేశంలో జరగనున్న మహిళా వన్డే వరల్డ్‌కప్ కోసం సన్నద్ధమవుతోంది. 'నవ్య'తో శ్రీచరణి పంచుకున్న విశేషాలు ఆమె మాటల్లోనే..

గల్లీ నుంచి ఢిల్లీ దాకా

మన చిన్నా

"మాది కడప జిల్లాలోని యర్రంపల్లి గ్రామం. నాన్న చంద్రశేఖరరెడ్డి విద్యుత్ శాఖలో పనిచేస్తారు. అమ్మ రేణుక గృహిణి. అక్క చరిత ఎంఎస్ పూర్తి చేసి అమెరికాలో ఉద్యోగం చేస్తోంది. ఇంట్లో అందరూ నన్ను 'చిన్నా' అని పిలుస్తారు. చిన్నప్పటి నుంచి నాకు ఆటలంటే చాలా ఇష్టం. చదువుకన్నా ఆటలంటేనే ఆసక్తి. మామయ్య కిషోర్‌రెడ్డి, మా కాలనీలోని మగ పిల్లలతో క్రికెట్ బాగా ఆడేదాన్ని. ఒక విధంగా మామయ్యనే నా మొదటి కోచ్. ఆయన ఇప్పటికీ నా మ్యాచ్‌లు చూసి సలహాలు ఇస్తూ ఉంటారు. నేను కేవలం క్రికెట్ మాత్రమే కాదు.. ఖోఖో, బ్యాడ్మింటన్ లాంటివి కూడా ఆడేదాన్ని. ఖోఖోలో జాతీయ స్థాయిలో ఆడేదాన్ని. అథ్లెటిక్స్ ట్రైనింగ్‌కు కూడా ఎంపికయ్యా! నేను పదో తరగతి చదువుతున్నప్పుడు- గుంటూరులో ఖోఖో ఆడటానికి వెళ్లా! అక్కడ అనుకోకుండా ఒక క్రికెట్ మ్యాచ్‌ను చూశా. ఎందుకో తెలియదు.. ఆ మ్యాచ్ నా మనస్సులో ముద్ర పడిపోయింది. ఇంటికి వచ్చిన తర్వాత అమ్మతో - "నేను ఇక నుంచి క్రికెట్ మాత్రమే ఆడతా! పెద్ద క్రికెటర్ అవుతా! " అని చెప్పా. అమ్మ సరే అంది కానీ నాన్న కొన్ని నెలల వరకూ ఒప్పుకోలేదు. నా పట్టుదల చూసి చివరకు ఆయన కూడా ఒప్పుకున్నారు. పదో తరగతి అయిన తర్వాత క్రికెట్‌లో శిక్షణ తీసుకోవటం ప్రారంభించా. మొదట పొద్దుటూరులో.. ఆ తర్వాత హైదరాబాద్ కూకట్‌పల్లిలో రంజీ మాజీ క్రికెటర్ సురేష్ సార్ దగ్గర శిక్షణ తీసుకున్నా. మొదట్లో నేను పేస్ బౌలర్‌ని. సురేష్ సార్ దగ్గరకు వచ్చిన తర్వాత ఆఫ్ స్పిన్నర్‌గా మారా! ఆ సమయంలోనే అండర్ 19కి ఎంపికయ్యా.

మలుపు తిప్పిన ఘటన..

బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీలో 2019లో అండర్-19 వరల్డ్‌కప్ కోసం హైలెవల్ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దేశంలోని ప్రతిభావంతులైన యువ క్రికెటర్లను ఆ శిబిరానికి ఎంపిక చేశారు. నాకు ఛాన్స్ వస్తుందనుకున్నా! కానీ రాలేదు. ఆ బాధ నన్ను చాలా కాలం వేధించింది. అయితే నాలో పట్టుదలను కూడా పెంచింది. కొవిడ్ తర్వాత అండర్-19 స్థాయిలో ఆల్‌రౌండర్‌గా సత్తా చాటడంతో 2022లో ఆంధ్ర సీనియర్ జట్టులో చోటు లభించింది. నాకు దొరికిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకొని ముందుకు వెళ్లేదాన్ని. 2023లో ముంబయిలో జరిగిన టీ20 చాంపియన్‌షిప్‌లో నేను ఆడాను. నా ఆటను ఢిల్లీ క్యాపిటల్స్ టీమ్‌కు చెందిన కొందరు పరిశీలించారట! ఆ విషయం అప్పుడు నాకు తెలియదు. 2024లో జరిగిన ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) వేలంలో నన్ను ఢిల్లీ జట్టు రూ. 55 లక్షలకు కొనుగోలు చేసింది. ఫైనల్‌లో ముంబయిపై పరుగులు కట్టడి చేయడంతో పాటు కీలక వికెట్లు తీయడంతో బీసీసీఐ సెలెక్టర్ల దృష్టిలో పడ్డాను. ఆతర్వాత జరిగిన ఛాలెంజర్ ట్రోఫీలో 9 వికెట్లు పడగొట్టడంతో తొలుత వన్డే, ఆతర్వాత టీ20ల్లో భారత జట్టు తరఫున అరంగేట్రం చేయగలిగా. గత జూన్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో అరంగేట్రం మ్యాచ్‌లోనే నాలుగు వికెట్లు తీయడం నా కెరీర్‌లో ఒక మధురానుభూతి. భారత్ అత్యుత్తమ బౌలింగ్ గణాంకాల జాబితాలో (4/12) నా పేరు రెండోదని తెలిసి చాలా సంతోషించా.

అమ్మ చేతి వంట ఇష్టం..

స్వతహాగా నేను భోజన ప్రియురాలిని. స్వీట్లు తప్ప మిగిలిన అన్నింటినీ ఒక పట్టు పడతా. అమ్మ చేతి వంట అంటే చాలా ఇష్టం. ఈ మధ్య వివిధ ప్రాంతాల్లో జరిగే దేశవాళీ క్రికెట్ పోటీల్లో ఎక్కువగా ఆడుతుండడంతో ఇంటి భోజనానికి దూరమయ్యా. నేను ఎప్పుడైనా సరిగ్గా ఆడకపోతే దానికి కారణం సరిగ్గా తినకపోవడమేనని అనుకొని ఇంటికి వచ్చినప్పుడల్లా అమ్మ నాకు ఏదో ఒకటి వండి తినిపించే పనిలోనే ఉంటుంది. ఈ మధ్య ఎక్కువ సినిమాలు చూడడం లేదు కానీ ఒకప్పుడు ప్రభాస్ మూవీ ఏది వచ్చినా వెంటనే చూసేదాన్ని. క్రికెట్‌లో యువరాజ్, స్మృతి మంధాన, హర్మన్, జెమీమా అంటే బాగా ఇష్టం. యువరాజ్ ఆరు బంతుల్లో ఆరు సిక్సులు కొట్టిన వీడియో అయితే ఇప్పటివరకు ఎన్నిసార్లు చూశానో లెక్క లేదు. ఎప్పటికైనా యువరాజ్‌లా అలా సిక్సర్లు కొట్టాలనే కోరిక ఉంది. ప్రస్తుతానికైతే బౌలింగ్ పైనే ఫోకస్ పెట్టాను. జట్టు అవసరానికి తగ్గట్టు బ్యాటింగ్‌లోనూ సత్తా చాటడానికి సిద్ధమే.



మార్కర్‌తో గుర్తులు..

కెరీర్ ప్రారంభంలో నెట్స్‌లో బౌలింగ్ చేస్తున్నప్పుడు మంచి లెంగ్త్‌లో బంతి పడి వికెట్లు తీసినప్పుడు పిచ్‌పై బాల్ పడిన చోట మార్కర్‌తో గుర్తు పెట్టుకొనేదాన్ని. అది గుర్తు వస్తే ఇప్పుడు నవ్వొస్తుంది. ఇంత సేపే ప్రాక్టీసు చేయాలని టైమ్ పెట్టుకోను. నా బౌలింగ్‌పై ఆత్మ సంతృప్తి కలిగేంత వరకు సాధన చేస్తాను. చివరిగా ఒక మంచి బంతి వేశాకే ప్రాక్టీసు ముగిస్తాను.



తల్లిదండ్రులతో శ్రీచరణి

ఒత్తిడికి లోనుకాను..

మైదానంలో అడుగు పెట్టాక ఆటపైనే పూర్తిగా దృష్టి పెడతాను. గ్రౌండ్ అవతల ఏమవుతోందో పట్టించుకోను. ఒక బంతి సరిగ్గా వేయకపోతే తర్వాతి బంతి ఇంకా బాగా వేయాలనే ఆలోచిస్తా కానీ ఒత్తిడికి లోనుకాను. సీనియర్ల నుంచి మంచి సహకారం ఉండడం, వారంతా బాగా ప్రోత్సహించడం కూడా నాకు కలిసొచ్చింది. నేను ఎదుట వాళ్లు ఏం చెప్పినా శ్రద్ధగా వింటాను వాళ్లు ఏ ధోరణిలో చెప్పినా 'నా మంచి కోసం చెబుతున్నారు కదా' అని ఆ విషయాలను అర్థం చేసుకొని ఆచరణలో పెట్టడానికి ప్రయత్నిస్తా. అదే నా బలం.

కచ్చితంగా వరల్డ్‌కప్ గెలుస్తాం..

ప్రతి క్రికెటర్‌కు వరల్డ్‌కప్‌లో ఆడడం, ఆ ప్రతిష్ఠాత్మకమైన ట్రోఫీను గెలవడం అనేది ఒక కల. అలాంటి మెగా టోర్నీలో ఆడే అవకాశం నాకు చిన్న వయసులోనే రావడం నిజంగా నా అదృష్టమే. ఈసారి ప్రపంచకప్ మన దేశంలోనే జరుగుతుండడం, విశాఖపట్నం కొన్ని మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇస్తుండడం, సొంత గడ్డపై తెలుగు వాళ్ల ముందు ఆడడం గౌరవంగా భావిస్తున్నా. వరల్డ్‌కప్‌లో మన టీమిండియా హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్ నుంచి మనకు గట్టి పోటీ ఎదురయ్యే అవకాశముంది. ఎంత పోటీ ఉన్నా కచ్చితంగా వరల్డ్‌కప్ గెలుస్తామనే నమ్మకం ఉంది.

● **ఎస్.ఎస్.బి సంజయ్**, హైదరాబాద్

పిల్లలు కొత్త విషయాలు నేర్చుకునేలా..

పిల్లలు ఎదుగుతున్న కొద్దీ కొత్త విషయాలు తెలుసుకోవడానికి ఆసక్తి చూపిస్తూ ఉంటారు. కొన్నింటిని ప్రశ్నల ద్వారా, మరికొన్నింటిని కళ్లతో చూసి, ఇంకొన్నింటిని చేతల ద్వారా అవగాహన చేసుకుంటూ ఉంటారు. ఈ క్రమంలో తల్లిదండ్రులు ఏ జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం...



- పిల్లలు ఏవైనా ప్రశ్నలు అడిగినప్పుడు విసుక్కోకుండా ఓపికగా సమాధానాలు చెప్పాలి. మెల్లగా వాళ్లకి అర్థమయ్యే రీతిలో వివరించాలి. అప్పుడే పిల్లల్లో గ్రాహక శక్తి పెరుగుతుంది.
- పిల్లలకు చిన్న చిన్న లక్ష్యాలను నిర్దేశించాలి. వాటిని పూర్తిచేసినప్పుడు మనస్ఫూర్తిగా అభినందించాలి. దీనివల్ల పిల్లలు విజయాన్ని ఆస్వాదించడమే కాకుండా సవాళ్లను స్వీకరించడం నేర్చుకుంటారు.
- కొంతమంది పిల్లలు ఏదైనా కొత్త పనిని మొదలుపెట్టడానికి సంకోచిస్తూ ఉంటారు. దాన్ని సరిగా చేయలేమని అనుకుంటూ వెనకడుగు వేస్తుంటారు. అలాంటప్పుడు పిల్లలకు ధైర్యం చెప్పి, ఆ పనిని ప్రారంభించేలా ప్రోత్సహించాలి. తప్పులు జరగడం సహజమని వివరించాలి. మొదటి అడుగు వేయడానికి భయపడినప్పటికీ పిల్లలు క్రమంగా ఎన్నో విషయాలు నేర్చుకుంటూ పనిని పూర్తిచేస్తారు.
- పిల్లలకు ఏ అంశాల మీద ఆసక్తి ఉందో తెలుసుకునే ప్రయత్నం చేయాలి. తగినవిధంగా ప్రోత్సహిస్తూ శిక్షణ ఇప్పిస్తే పిల్లలు నచ్చిన వాటిని చక్కగా నేర్చుకుంటారు.
- పిల్లలకు సహనంగా వ్యవహరించడం అలవాటు చేయాలి. దీనివల్ల వారిలో ఆలోచన శక్తి, సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. అనుక్షణం ఎదురయ్యే సొంత అనుభవాలతో పిల్లలు ఎన్నో విషయాలు నేర్చుకుంటారు.

పావురాళ్ల బెడద వదిలేలా...

పావురాళ్లు నగర జీవితంలో భాగాలైపోయాయి. అవి మన బాల్కనీలు, కిటికీలు, ఎయిర్ కండిషనర్ యూనిట్ల దగ్గర తిష్ఠ వేస్తూ విసర్జకాలతో, ఈకలు, గూళ్లతో పరిసరాలను పాడు చేస్తూ ఉంటాయి. అయితే ఈ సమస్యను సులభమైన చిట్కాలతో పరిష్కరించుకునే వీలుంది. ఎలాగో తెలుసుకుందాం!



ప్రొటెక్టివ్ నెట్స్: అత్యంత ప్రభావవంతమైన విధానమిది. ప్రత్యేకించి ఎత్తైన నిర్మాణాలకు ఇదే అనువైన పద్ధతి. బాల్కనీ మూలలు, ఏసి యూనిట్లు, ఇతరత్రా ఆశ్రయానికి వీలుండే జాగాల నుంచి పావురాళ్లను దూరం పెట్టడం కోసం ఈ నెట్స్ వాడుకోవచ్చు. అయితే పావురాళ్లు పొరపాటున ఈ వలల్లో చిక్కుబడిపోకుండా ఉండడం కోసం, నెట్‌ను బిగుతుగా లాగి కట్టేయాలి.

ప్రతిఫలించే వస్తువులతో: పావురాళ్లు అకస్మాత్తుగా కదిలే వస్తువులు, ప్రతిఫలించే వెలుగులకు దూరంగా ఉంటాయి. కాబట్టి పాత సిడిలు, విండ్ ఛైమ్స్ లేదా ప్రతిఫలించే టేప్ లాంటి వాటిని ఏర్పాటు చేసుకోవాలి. అద్దాలతో కూడా ప్రయోజనం ఉంటుంది.

సహజసిద్ధ రిపెల్లెంట్స్: ఘాటు వాసన వెదజల్లే వాసనలు కూడా పావురాళ్లను దూరం పెడతాయి. లవంగ నూనె, పుదీనాతో తయారైన స్ప్రేలు, పలుచన చేసిన మిరప సారాలను బాల్కనీ ఉపరితలాలకు అప్లై చేయాలి. సాధారణంగా పావురాళ్లు వానాకాలం ప్రారంభంలో లేదా వసంతకాలంలో గూళ్లు పెట్టడం మొదలుపెడతాయి. కాబట్టి అంతకంటే ముందే ఈ జాగ్రత్తలకు పూనుకోవాలి.

ఆహారం వద్దు: పావురాళ్లకు ఆహారం అందించడం మొదట్లో సరదాగానే ఉంటుంది. కానీ ఈ పని మరిన్ని పావురాళ్లను ఆకర్షిస్తుంది. కాబట్టి పావురాళ్లకు నీళ్లు, ఆహారం అందుబాటులో ఉంచడం మానుకోవాలి. పావురాళ్లతో పాటు వాటి వెంట పరాన్నజీవులు కూడా ఇళ్ల పరిసరాల్లోకి చేరుకుని, ఇన్‌ఫెక్షన్లను కలిగిస్తాయనే విషయం గుర్తు పెట్టుకోవాలి.

ఫ్యాషన్



బ్యూటిఫుల్ 'బ్యాగీ'

బిగుతుగా ఉండే జీన్స్‌కు రోజులు చెల్లిపోయాయి. వదులుగా, సౌకర్యంగా ఉండే బ్యాగీ జీన్స్ ఇప్పుడు రాజ్యమేలుతున్నాయి. ఈ తాజా ఫ్యాషన్‌తో ఎలా ఆకట్టుకోవచ్చో తెలుసుకుందాం!

స్ట్రెయిట్ కట్, బూట్ కట్, రెగ్యులర్ ఫిట్... ఇలా జీన్స్‌లో ఎప్పటికప్పుడు కొత్త పోకడలు వస్తూనే ఉంటాయి. అయితే తాజాగా బ్యాగీ జీన్స్ ట్రెండ్ వాడుకలోకొచ్చింది. వదులుగా ఉండే ఈ జీన్స్ సౌకర్యంగా కూడా ఉండడంతో వయసుతో సంబంధం లేకుండా చిన్నా, పెద్దా అందరూ వీటిని ఆదరిస్తున్నారు. అయితే బ్యాగీ జీన్స్‌ను తగిన టాప్స్, టీషర్ట్స్, ఇతరత్రా యాక్సెసరీస్‌ను ఆచితూచి ఎంచుకోవాలి. అప్పుడే ఈ జీన్స్ అందం ఇనుమడిస్తుంది. అందుకోసం...

యాక్సెసరీస్: పెద్ద డయల్ కలిగి ఉండే వాచీలు ఈ రకం ప్యాంట్లకు బాగా సూటవుతాయి. అనలాగ్ వాచీలను ఎంచుకోవచ్చు.

క్రాప్‌టాప్స్: బ్యాగీ జీన్స్‌తో కురచగా ఉండే క్రాప్ టాప్స్‌తో మ్యాచ్ చేయాలి. ఈ టాప్ బిగుతుగా లేదా వదులుగా ఉన్నా ఫరవాలేదు. స్లీవ్‌లెస్, ఫుల్ హ్యాండ్స్.. అయినా ఫరవాలేదు. కానీ వేసుకున్న ప్యాంట్‌కు నప్పేలా చూసుకోవాలి

బూట్లు: బ్యాగీ ప్యాంట్‌కు బూట్లు, స్పోర్ట్స్ షూస్ చాలా బాగా నప్పుతాయి. పెద్ద హీల్ ఉన్న బూట్లు, యాంకిల్ లెంగ్త్ బూట్లు ఎంచుకోవచ్చు.



బిజినెస్

విజయవాడ ● బుధవారం 17 సెప్టెంబరు 2025

క్రిభ్‌కో చైర్మన్‌గా సుధాకర్ చౌదరి



అమరావతి (ఆంధ్రజ్యోతి): సహకార రంగంలోని రెండో అతిపెద్ద ఎరువుల కంపెనీ క్రిషక్ భారతి కో ఆపరేటివ్ లిమిటెడ్ (క్రిభ్‌కో) చైర్మన్‌గా విజయవాడకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త వల్లభనేని సుధాకర్ చౌదరి ఎన్నికయ్యారు. ఉత్తరప్రదేశ్‌కు చంద్రపాల్ సింగ్ యాదవ్ వైస్ చైర్మన్ పదవిని దక్కించుకున్నారు. ఢిల్లీలో జరిగిన క్రిభ్‌కో ఆఫీస్ బేరర్ల ఎన్నికల్లో వీరిద్దరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా సుధాకర్ గత ఐదేళ్లుగా క్రిభ్‌కో వైస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. సహకార ఉద్యమాన్ని, ముఖ్యంగా ఎరువులు, వ్యవసాయ రంగాలను బలోపేతం చేయడంలో ఆయనకు విశేషానుభవం ఉంది. విజయవాడ ఎస్ఎస్ఎం పబ్లిక్ స్కూల్‌లో పాఠశాల విద్య, బాబూజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ టెక్నాలజీ నుంచి ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ టెక్నాలజీలో సుధాకర్ ఇంజనీరింగ్‌ను పూర్తి చేశారు.

ఏపీలో రూ. 32 కోట్లతో ఇంటర్‌ఆర్క్ విస్తరణ

న్యూఢిల్లీ: ప్రీ- ఇంజనీర్డ్ స్టీల్ కన్‌స్ట్రక్షన్ సేవలందించే ఇంటర్‌ఆర్క్ బిల్డింగ్ సొల్యూషన్స్.. ఆంధ్రప్రదేశ్‌లో తన కార్యకలాపాలను మరింతగా విస్తరిస్తోంది. రూ. 32 కోట్ల పెట్టుబడితో నెల్లూరులోని ప్లాంట్‌లో ఏర్పాటు చేసిన రెండో యూనిట్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. ఈ కొత్త యూనిట్ విస్తరణతో ఏటా 25,000 మెట్రిక్ టన్నుల ప్రీ-ఇంజనీర్డ్ బిల్డింగ్స్ (పీఈబీ)లను అదనంగా ఉత్పత్తి చేసే సామర్థ్యం లభిస్తుందని వెల్లడించింది. అలాగే ఉత్తరాఖండ్‌లోని కిచ్చా యూనిట్‌లో రూ. 21 కోట్ల పెట్టుబడితో 'బాక్స్ కాలమ్ లైన్'ను ప్రారంభించినట్లు తెలిపింది.

● ఎసిడిటీ ఆధారిత గ్యాస్ట్రో ఇంటెస్టినల్ వ్యాధి చికిత్సలో ఉపయోగించే టిగోప్రజాన్ (50 ఎంజీ) టాబ్లెట్లను పీసీఏబీ బ్రాండ్‌నేమ్‌తో మార్కెట్లో విడుదల చేసినట్టు డాక్టర్ రెడ్డీస్ ప్రకటించింది. టిగోప్రజాన్ యాసిడ్‌ను బ్లాక్ చేయగల లక్షణం కలిగిన ఔషధమని కంపెనీ తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



17వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	560
వరంగల్	542	గోదావరి	550
చిత్తూరు	578	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	

బులియన్ మార్కెట్లో రికార్డుల మోత



ఆల్‌టైమ్ హైలో పసిడి, వెండి ధరలు

ఢిల్లీలో ఒక్కరోజే రూ.1,800 పెరుగుదల. రూ.1,15,100 చేరిక

- » కిలో వెండి రూ.1,32,870 స్థాయికి
- » రానున్న రోజుల్లో మరింత ముందుకే
- » త్వరలో రూ.1.34 లక్షల స్థాయికి పసిడి ధర!
- » సన్నగిల్లుతున్న దిద్దుబాటు ఆశలు

న్యూఢిల్లీ: బులియన్ మార్కెట్ పరుగెడుతోంది. బంగారం, వెండి ధరలు రోజుకో రికార్డు సృష్టిస్తున్నాయి. మంగళవారం ఢిల్లీలో 10 గ్రాముల మేలిమి (24 కేరట్స్) బంగారం ధర రూ.1,800 పెరిగి రూ.1,15,100కు చేరి సరికొత్త రికార్డు సృష్టించింది. కిలో వెండి ధర రూ.570 లాభంతో రూ.1,32,870కు చేరి సరికొత్త రికార్డు నమోదు చేసింది. ర్యాలీ ఇలానే కొనసాగితే దేశీయ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి పసిడి ధర త్వరలోనే రూ.1.34 లక్షలకు చేరుతుందనే అంచనాలు వినిపిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లోనూ మంగళవారం సరికొత్త రికార్డులు నమోదయ్యాయి. ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం 3,698.86 డాలర్లకు చేరి సరికొత్త రికార్డు సృష్టించింది. ఔన్స్ వెండి ధరా 42.85 డాలర్లకు చేరువైంది. వెండి ధర ఈ స్థాయికి చేరడం ఇదే మొదిసారి.

'ఫ్యూచర్స్'లోనూ అదే ట్రెండ్

ఫ్యూచర్స్ మార్కెట్లోనూ బంగారం, వెండి ధరలు మంగళవారం రికార్డు స్థాయిని తాకాయి. డిసెంబరులో డెలివరీ ఇచ్చే ఔన్స్ పసిడి ధర మంగళవారం అంతర్జాతీయ మార్కెట్లో రికార్డు స్థాయిలో 3,736.97 డాలర్ల వద్ద ట్రేడైంది. దేశీయ ఫ్యూచర్స్ మార్కెట్లోనూ ఇదే పరిస్థితి. ఎంసీఎక్స్‌లో వచ్చే నెల డెలివరీ ఇచ్చే 10 గ్రాముల మేలిమి పసిడి ధర రూ.384 లాభంతో రూ.1,10,563కి చేరింది. ఇది సరికొత్త రికార్డు స్థాయి. డిసెంబరులో డెలివరీ ఇచ్చే 10 గ్రాముల పసిడి ధర రూ.418 లాభంతో రూ.1,11,665 రికార్డు స్థాయిని తాకింది.

ర్యాలీకి కారణాలు

- అమెరికా ఫెడరల్ రిజర్వ్ కీలక వడ్డీ రేట్లను తగ్గిస్తుందనే అంచనాలు
- డాలర్‌తో క్షీణిస్తున్న రూపాయి మారకం రేటు
- పెద్దఎత్తున పసిడి కొంటున్న కేంద్ర బ్యాంకులు
- ప్రధాన కరెన్సీలతో క్షీణిస్తున్న అమెరికా డాలర్ మారకం రేటు
- ప్రభుత్వ రుణ పత్రాలపై కంటే పసిడిపై అధిక రాబడులు
- క్లిష్ట సమయాల్లోనూ సురక్షిత పెట్టుబడిగా పసిడికి ఉన్న పేరు
- అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి
- పెరుగుతున్న అంతర్జాతీయ ఉద్రిక్తతలు

బంపర్ లాభాలు

స్టాక్ మార్కెట్‌తో పోలిస్తే గత ఏడాది కాలంలో బంగారం, వెండి మదుపరులకు మంచి లాభాలు పంచాయి. గత 12 నెలల్లో సెన్సెక్స్, నిఫ్టీ దాదాపుగా ఎదుగూ బొదుగు లేకుండా స్థిరంగా ఉన్నాయి. ఇదే సమయంలో పసిడిలో పెట్టుబడులు 52 శాతం, వెండిలో పెట్టుబడులు 50 శాతం లాభాలు పంచాయి. దీంతో గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో పెట్టుబడులు భారీగా పెరుగుతున్నాయి. పెట్టుబడులకు పెద్దగా నష్టం లేకుండా స్థిరమైన రాబడులను ఆశించే మదుపరులు ఫిక్స్‌డ్ డిపాజిట్లు, డెట్ ఫండ్స్‌కు గుడ్‌బై చెప్పి గోల్డ్ ఈటీఎఫ్‌లను ఆశ్రయిస్తున్నట్టు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. మారిన ఈ ట్రెండ్‌తో మ్యూచువల్ ఫండ్స్ ఆఫర్ చేసే మల్టీ అసెట్ ఫండ్స్‌కు గిరాకీ పెరిగింది.

ఎందాక ఈ పరుగు?

నిన్న మొన్నటి వరకు 3,500 డాలర్ల వద్ద పసిడి పరుగుకు బ్రేక్ పడే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావించాయి. ప్రస్తుత ర్యాలీని చూస్తుంటే ఈ ఏడాది చివరికల్లా ఔన్స్ (31.10 గ్రాములు) పసిడి ధర 4,000 డాలర్లకు (సుమారు రూ.3,52,360) చేరుతుందని మార్కెట్ వర్గాల అంచనా. అయితే మార్కెట్ ఇప్పటికే ఓవర్ బాట్ స్థాయికి వెళ్లటంతో 5 నుంచి 6 శాతం వరకు దిద్దుబాటుకు లోనయ్యే అవకాశం కూడా ఉందనే అంచనాలు వినిపిస్తున్నాయి. ఒకవేళ అలాంటి దిద్దుబాటు వచ్చినా, అది తాత్కాలికమేనని, వచ్చే ఏడాది ఔన్స్ పసిడి ధర 4,200 డాలర్లకు చేరే అవకాశం ఉందనే వార్తలు వినిపిస్తున్నాయి. అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ విశ్వసనీయత దెబ్బతింటే ఔన్స్ పసిడి ధర 5,000 డాలర్లకు కూడా చేరే అవకాశం ఉందని గోల్డ్‌మన్ శాక్స్ ఈ నెల తొలి వారంలో విడుదల చేసిన ఒక నివేదికలో హెచ్చరించింది.

'గేమ్స్‌క్రాఫ్ట్'కు సీఎఫ్‌ఓ టోపీ

ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ కోసం రూ.250 కోట్లు దారి మళ్లింపు

న్యూఢిల్లీ: కంపెనీలకు ఆయా కంపెనీల ఉన్నతాధికారులే టోపీ పెడుతున్నారు. తాజాగా బెంగళూరు కేంద్రంగా పనిచేసే రియల్ మనీ గేమ్స్ కంపెనీ గేమ్స్‌క్రాఫ్ట్ టెక్నాలజీస్ వీరి బారిన పడింది. సంస్థ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్‌ఓ) రమేశ్ ప్రభు.. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) ట్రేడింగ్ కోసం కంపెనీకి చెందిన రూ.250 కోట్లను దారి మళ్లించినట్టు గేమ్స్‌క్రాఫ్ట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. రమేశ్ ప్రభునే స్వయంగా ఈ ఏడాది మార్చి 5న స్వయంగా కంపెనీకి పంపిన ఒక ఈ-మెయిల్‌లో ఈ విషయం ఒప్పుకున్నట్టు కంపెనీ తెలిపింది. గేమ్స్‌క్రాఫ్ట్ ఫిర్యాదుతో ఈ నెల 9న పోలీసులు రమేశ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

ఐటీ, ఆటో షేర్లే పరుగులెత్తించాయ్...

ముంబై: అమెరికా-భారత వాణిజ్య చర్చలు పునః ప్రారంభమయ్యాయన్న ఉత్సాహంలో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు దిగడంతో ఈక్విటీ మార్కెట్ మంగళవారం బలమైన పునరుజ్జీవం సాధించింది. ఆసియా, అమెరికా మార్కెట్లలో ర్యాలీ ఇన్వెస్టర్ సెంటిమెంట్ బలపడేందుకు దోహదపడింది. సోమవారం మార్కెట్‌ను కుంగదీసిన ఐటీ, ఆటో రంగాల షేర్లే మంగళవారం ర్యాలీకి దన్నుగా నిలిచాయి. ఫలితంగా సెన్సెక్స్ 594.95 పాయింట్ల లాభంతో 82,380.69 వద్ద ముగియగా నిఫ్టీ 169.90 పాయింట్ల లాభంతో 25,239.10 వద్ద క్లోజయింది. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 0.66%, మిడ్‌క్యాప్ సూచీ 0.62% లాభపడ్డాయి.

ముంబై పోర్టు చైర్మన్‌గా అంగముత్తు



విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టు చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఎం అంగముత్తును కేంద్ర ప్రభుత్వం ముంబై పోర్టు చైర్మన్‌గా నియమించింది. అసోం-మేఘాలయ కేడర్ ఐఏఎస్ అధికారి అయిన అంగముత్తు రెండేళ్ల క్రితం (2023 మే) విశాఖ పోర్టు చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. సరుకు రవాణాను 73 మిలియన్ టన్నుల నుంచి 90 మిలియన్ టన్నులకు చేర్చటంలో ఆయన విశేషంగా కృషి చేశారు. కాగా విశాఖపట్నం పోర్టుకు కొత్త చైర్మన్ నియామకానికి కొంత సమయం పట్టే అవకాశం కనిపిస్తోంది.

'మేఘా'కు మరో భారీ ఆర్డర్!

కర్ణాటకలో 'వ్యూహాత్మక' పెట్రో ప్రాజెక్టు

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) మరో భారీ ప్రాజెక్టును చేజిక్కించుకుంది. కర్ణాటకలోని పాదూరు వద్ద 25 లక్షల టన్నుల వ్యూహాత్మక ముడి చమురు నిల్వల కేంద్రాన్ని ఏర్పాటు చేసే కాంట్రాక్టు దక్కించుకున్నట్టు ఎకనామిక్ టైమ్స్ పత్రిక తెలిపింది. ఈ కాంట్రాక్ట్ విలువ రూ.5,700 కోట్లు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఎంఈఐఎల్ త్వరలోనే ప్రభుత్వ రంగంలోని ఇండియన్ స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర్వ్ లిమిటెడ్ (ఐఎస్‌పీఆర్ఎల్)తో ఒప్పందం చేసుకోనుందని సమాచారం. ఎంఈఐఎల్‌తో పాటు మరో రెండు కంపెనీలు కూడా ఈ ప్రాజెక్టు కోసం పోటీపడ్డాయి. అయితే మేఘా ఇంజనీరింగ్ కోట్ చేసిన ధర తక్కువగా ఉండటంతో ఐఎస్‌పీఆర్ఎల్.. ఈ ప్రాజెక్టును ఎంఈఐఎల్‌కే కట్టబెట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఐఎస్‌పీఆర్ఎల్ ఈ తరహా ప్రాజెక్టు నిర్మాణాన్ని ఒక ప్రైవేట్ కంపెనీకి అప్పగించడం ఇదే మొదటిసారి. ఐఎస్‌పీఆర్ఎల్ ఇప్పటికే విశాఖపట్నం, మంగళూరు, పాదూరు వద్ద మూడు వ్యూహాత్మక ముడి చమురు నిల్వల కేంద్రాలను నిర్వహిస్తోంది. పాదూరు రెండో దశ విస్తరణ ప్రాజెక్టును మేఘా ఇంజనీరింగ్‌కు అప్పగించబోతోంది. ఈ విస్తరణతో దేశ వ్యూహాత్మక చమురు నిల్వల సామర్థ్యం 53.3 లక్షల టన్నులకు చేరనుంది. ఈ నిల్వలు అత్యవసర పరిస్థితుల్లో ఎనిమిది నుంచి తొమ్మిది రోజుల అవసరాలకు సరిపోతాయి.

ప్రాజెక్టు ప్రత్యేకతలు

- ఐదేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేయాలి
- 60 ఏళ్ల పాటు మేఘాకు ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతలు
- 25 లక్షల టన్నుల వరకు ముడి చమురు నిల్వ
- చమురు నిల్వల సదుపాయాన్ని మేఘా సొంతంగా లేదా ఇతరులకు అద్దెకు ఇవ్వడం చేయవచ్చు

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	118	విజయవాడ	140
వరంగల్	118	గుంటూరు	135
కరీంనగర్	118	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	118	చిత్తూరు	127
కర్నూలు	118	నెల్లూరు	132
విశాఖపట్నం	134	అనంతపురం	132
గోదావరి	140		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,11,930 ▲	1,02,600 ▲	1,44,000 ▲
విజయవాడ	1,14,250 ▲	1,08,000 ▲	1,33,500 ▲
విశాఖపట్నం	1,14,120 ▲	1,01,800 ▲	1,44,000 ▲
రాజమండ్రి	1,11,930 ▲	1,02,600 ▲	1,33,000 ▲
ప్రొద్దుటూరు	1,14,800 ▲	1,05,250 ▲	1,34,000 ▲
ముంబై	1,10,869 ▲	1,01,556 ▲	1,29,300 ▲

స్పోర్ట్స్

భారత్ × ఆస్ట్రేలియా

మహిళల రెండో వన్డే నేడు

(మ. 1.30 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో..)

వన్డే ర్యాంకుల్లో మంధాన.. నెం 1



దుబాయ్: భారత స్టార్ క్రికెటర్ స్మృతీ మంధాన వన్డేల్లో నెంబర్‌వన్ బ్యాటర్‌గా నిలిచింది. మంగళవారం ప్రకటించిన ర్యాంకింగ్స్ బ్యాటర్ల జాబితాలో మంధాన ఓ స్థానం ఎగబాకి టాప్ ర్యాంక్‌కు చేరింది. నాట్ షివర్ బ్రంట్ (ఇంగ్లండ్) రెండో ర్యాంక్‌కు పడిపోయింది. భారత బౌలర్లలో స్నేహ్ రాణా ఐదు స్థానాలు మెరుగై 13వ ర్యాంక్‌కు చేరింది. స్పిన్నర్ సోఫీ ఎకెల్‌స్టోన్ (ఇంగ్లండ్) నెంబర్‌వన్ బౌలర్‌గా కొనసాగుతోంది.

బీసీసీఐకి జాక్‌పాట్

రూ.579 కోట్లతో ఒప్పందం

టీమిండియా ప్రధాన స్పాన్సర్‌గా అపోలో టైర్స్

న్యూఢిల్లీ: ప్రపంచ క్రికెట్‌లో అత్యంత ధనిక బోర్డుగా విరాజిల్లుతున్న బీసీసీఐ ఖజానా మరింత బరువెక్కనుంది. భారత క్రికెట్ జట్టు నూతన ప్రధాన స్పాన్సర్‌గా అపోలో టైర్స్ ఏకంగా రూ.579 కోట్ల కళ్లుచెదిరే మొత్తంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ రెండున్నరేళ్ల పాటు కొనసాగి 2028, మార్చిలో ముగుస్తుంది. ఇక నుంచి పురుషుల, మహిళల జట్లకు సంబంధించిన మూడు ఫార్మాట్ల జెర్సీలపై కంపెనీ లోగో ఉంటుంది. గతంలో జెర్సీ స్పాన్సర్‌గా కొనసాగిన డ్రీమ్ 11 రూ.358 కోట్లతో ఒప్పందం కుదుర్చుకుంది. అయితే కేంద్రం తీసుకొచ్చిన ఆన్‌లైన్ గేమింగ్ నియంత్రణ చట్టం కారణంగా ఏడాది ముందుగానే ఆ కంపెనీ వైదొలగాల్సివచ్చింది. ప్రస్తుతం ఆసియాకప్‌లో తలపడుతున్న భారత జట్టు ఎలాంటి లోగో లేకుండానే ఆడుతోంది. ఈ నేపథ్యంలో బోర్డు కొత్త స్పాన్సర్ కోసం బిడ్లు ఆహ్వానించింది. అటు అపోలో టైర్స్‌కు కాన్వా రూ.544 కోట్లతో, జేకే సిమెంట్స్ రూ.477 కోట్లతో గట్టి పోటీనే ఇచ్చాయి. కానీ ఈ రెండు కంపెనీల కంటే చాలా ఎక్కువ మొత్తమే కోట్ చేయడంతో అపోలో టైర్స్ విజేతగా నిలిచింది. వాస్తవానికి బోర్డు రూ.450 కోట్ల వరకు రావచ్చని ఆశించింది. ద్వైపాక్షిక సిరీస్‌ల్లో ఒక్కో మ్యాచ్‌కు రూ.3.5 కోట్లు, వరల్డ్‌కప్ మ్యాచ్‌లకు రూ.1.5 కోట్లను కనీస ధరగా పేర్కొంది. అయితే తాజాగా కుదిరిన ఒప్పందం ప్రకారం అపోలో టైర్స్ నుంచి మ్యాచ్‌కు దాదాపు రూ.4.5 కోట్లు దక్కబోతోంది. మొదట ఈనెల 30 నుంచి ఆసీస్ 'ఏ' జట్టుతో జరిగే మూడు వన్డేల సిరీస్‌లో భారత్ 'ఏ' ఆటగాళ్లు అపోలో టైర్స్ జెర్సీలను ధరించి ఆడనున్నారు.

స్పీడ్ స్కేటింగ్‌లో ఆనంద్ స్వర్ణ చరిత్ర



న్యూఢిల్లీ: భారత స్కేటర్ ఆనంద్ కుమార్ వేల్‌కుమార్ చరిత్ర సృష్టించాడు. చైనాలో జరుగుతున్న స్పీడ్ స్కేటింగ్ వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో దేశానికి తొలి స్వర్ణం అందించాడు. తమిళనాడుకు చెందిన 22 ఏళ్ల ఆనంద్ సీనియర్ పురుషుల 1000 మీటర్ల స్ప్రింట్‌లో ఒక నిమిషం 24.924 సెకన్ల టైమింగ్‌తో టాప్‌లో నిలిచాడు. ఆనంద్.. రెండ్రోజుల క్రితం ఇదే టోర్నీ 500 మీటర్ల స్ప్రింట్‌లో కాంస్య పతకం సాధించాడు. దేశానికి మొదటి బంగారు పతకం అందించిన ఆనంద్‌పై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. నీ విజయం ఎంతో మంది యువకులకు స్ఫూర్తిదాయకమన్నారు.

భారత్‌తో టెస్టులకు విండీస్ జట్టు ఇదే

న్యూఢిల్లీ: రెండు టెస్టుల సిరీస్ కోసం వచ్చేనెలలో భారత పర్యటనకు రానున్న వెస్టిండీస్ టెస్టు జట్టును ప్రకటించారు. అక్టోబరు 2 నుంచి 6 వరకు అహ్మదాబాద్‌లో తొలి టెస్టు, ఢిల్లీ వేదికగా 10 నుంచి 14 వరకు రెండో టెస్టు జరగనుంది. ఈ సిరీస్ కోసం మంగళవారం ప్రకటించిన 15 మందితో కూడిన విండీస్ జట్టులో సీనియర్ ఆటగాడు, మాజీ కెప్టెన్ బ్రాత్‌వైట్‌కు చోటు దక్కలేదు. ఎడమచేతి వాటం స్పిన్నర్ ఖారీ పియరీ తొలిసారి జట్టుకు ఎంపికవగా.. టాగెనరైన్ చందర్‌పాల్, అలిక్ అథనాజ్‌లను మళ్లీ జట్టులోకొచ్చారు. రోస్టన్ చేజ్ జట్టు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు.

విండీస్ జట్టు: రోస్టన్ చేజ్ (కెప్టెన్), జోమెల్ వారికన్ (వికెట్ కీపర్), కెవ్లాన్ ఆండర్సన్, అలిక్ అథనాజ్, జాన్ క్యాంప్‌బెల్, టాగెనరైన్ చందర్‌పాల్, జస్టిన్ గ్రీవ్స్, షాయ్ హోప్ (వికెట్ కీపర్), టెవిన్ ఇమ్లాచ్, అల్జారీ జోసెఫ్, షమార్ జోసెఫ్, బ్రాండన్ కింగ్, ఆండర్సన్ ఫిలిప్, ఖారీ పియరీ, జేడన్ సీల్స్

పైక్రాఫ్ట్‌ను తొలగించం



పీసీబీ ఫిర్యాదును తిరస్కరించిన ఐసీసీ

ఆసియా కప్‌లో నేడు
పాకిస్థాన్ × యూఏఈ
రాత్రి 8 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..

దుబాయ్: 'కరచాలన వివాదం' నేపథ్యంలో మ్యాచ్ రెఫరీ ఆండీ పైక్రాఫ్ట్‌ను తప్పించాలన్న పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) డిమాండ్‌ను ఐసీసీ తిరస్కరించింది. ఆసియాకప్ మ్యాచ్ టాస్ సందర్భంగా భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌తో కరచాలనం చేయవద్దంటూ పాక్ సారథి సల్మాన్ ఆఘాకు పైక్రాఫ్ట్ (జింబాబ్వే) సూచించాడని ఐసీసీకు పీసీబీ ఫిర్యాదు చేసిన విషయం విదితమే. అయితే, పాక్ డిమాండ్‌ను తిరస్కరిస్తూ పీసీబీకి మెయిల్ పంపినట్టు ఐసీసీ వర్గాలు తెలిపాయి. బుధవారం పాక్, యూఏఈ మధ్య జరిగే మ్యాచ్‌కు కూడా పైక్రాఫ్ట్ మ్యాచ్ రెఫరీగా వ్యవహరించాల్సి ఉంది. అయితే, పైక్రాఫ్ట్‌ను తప్పించడానికి ఐసీసీ విముఖత వ్యక్తం చేసిన నేపథ్యంలో తమ మ్యాచ్‌లకు అతడిని దూరంగా ఉంచాలని పీసీబీ కోరే అవకాశం ఉంది. మధ్యేమార్గంగా రిచీ రిచర్డ్సన్ (వెస్టిండీస్)ను రెఫరీగా నియమించాలని సూచించనున్నట్టు సమాచారం. ఆదివారం పాక్‌తో జరిగిన మ్యాచ్‌లో గెలిచిన తర్వాత భారత ఆటగాళ్లు ప్రత్యర్థులతో హ్యాండ్ షేక్ చేయకుండా రావడం చర్చనీయాంశమైంది. పహల్గాం బాధితులకు సంఘీభావంగానే తాము ఇలా చేసినట్టు సూర్యకుమార్ చెప్పాడు.

బహిష్కరిస్తే.. రూ. 141 కోట్ల నష్టం

రెఫరీ పైక్రాఫ్ట్‌ను తొలగించకపోతే టోర్నీని బహిష్కరిస్తామని ఒకానొక సమయంలో పాక్ బీరాలు పలికింది. అయితే, అది సాధ్యమయ్యే పని కాదని పాక్ బోర్డు వర్గాలు చెప్పాయి. టోర్నీని బహిష్కరిస్తే ఐసీసీ తమపై భారీగా జరిమానాలు విధించే అవకాశం ఉందని తెలిపాయి. ప్రస్తుత పరిస్థితుల్లో అంత భారం పీసీబీ భరించలేదని వెల్లడించాయి. ఒకవేళ పాక్ జట్టు టోర్నీని బాయ్‌కాట్ చేస్తే టోర్నీ ఆదాయంలో 15 శాతం రెవెన్యూ.. అంటే సుమారు రూ. 106 నుంచి 141 కోట్ల మేర ఆదాయాన్ని కూడా పీసీబీ నష్టపోనుంది.

బంగ్లా నిలిచింది

అఫ్ఘాన్‌పై విజయం

అబుధాబి: ఆసియా కప్ రేసులో నిలవాలంటే కచ్చితంగా గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్ గట్టెక్కింది. గ్రూప్ 'బి'లో భాగంగా మంగళవారం అఫ్ఘానిస్థాన్‌తో ఉత్కంఠగా సాగిన పోరులో 8 పరుగుల తేడాతో నెగ్గింది. ముందుగా బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 154 పరుగులు చేసింది. ఓపెనర్లు తన్‌జీద్ హసన్ (52), సైఫ్ హసన్ (30) రాణించారు. ఈ జోడీ తొలి వికెట్‌కు 63 పరుగులు జోడించింది. ఛేదనలో అఫ్ఘాన్ 20 ఓవర్లలో 146 పరుగులకు ఆలౌటైంది. గుర్బాజ్ (35), ఒమర్జాయ్ (30), రషీద్ (20) మాత్రమే రాణించారు. ముస్తాఫిజుర్‌కు మూడు.. నసూమ్, రిషాద్, టస్కిన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నసూమ్ నిలిచాడు. ఈ గెలుపుతో ప్రస్తుతం నాలుగు పాయింట్లతో ఉన్న బంగ్లా.. గురువారం శ్రీలంకతో జరిగే మ్యాచ్‌లో అఫ్ఘాన్ జట్టు ఓడిపోతే సూపర్-4కు వెళుతుంది.

సంక్షిప్త స్కోర్లు: బంగ్లాదేశ్: 20 ఓవర్లలో 154/5 (తన్‌జీద్ 52, సైఫ్ 30; నూర్ 2/23, రషీద్ 2/26). **అఫ్ఘానిస్థాన్:** 20 ఓవర్లలో 146 ఆలౌట్ (గుర్బాజ్ 35, ఒమర్జాయ్ 30; ముస్తాఫిజుర్ 3/28, నసూమ్ 2/11, రిషాద్ 2/18, టస్కిన్ 2/34).

సింధు ముందంజ



'చైనా మాస్టర్స్'లో ఆయుష్ ఓటమి

షెన్‌జెన్ (చైనా): గతవారం హాంకాంగ్ ఓపెన్‌లో ఆరంభ రౌండ్లోనే నిష్క్రమించిన పీవీ సింధు చైనా మాస్టర్స్ సూపర్ 750 టోర్నమెంట్‌లో శుభారంభం చేసింది. మంగళవారం ఇక్కడ జరిగిన తొలి రౌండ్‌లో సింధు 21-5, 21-10తో జూలీ డావల్ (డెన్మార్క్)పై గెలిచింది. ఇక ఆయుష్ షెట్టి 19-21, 21-12, 16-21తో ప్రపంచ ఐదో ర్యాంకర్ చో తిన్ చెన్ (చైనీస్ తైపీ) చేతిలో పోరాడి ఓడాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత జోడీ రుత్వికా శివాని/రోహన్ 17-21, 11-21తో జపాన్ జంట యుచి షిమొగామి/సయాక హొబర చేతిలో ఓడి ఆదిలోనే వెనుదిరిగింది.

వేటకు నీరజ్ రెడీ



నేడు జావెలిన్ త్రో క్వాలిఫికేషన్స్
ప్రపంచ అథ్లెటిక్స్
మ. 3.40 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో

టోక్యో: భారత పతక ఆశలు మోస్తున్న స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా వరల్డ్ చాంపియన్‌షిప్‌లో డిఫెండింగ్ చాంప్‌గా బరిలోకి దిగుతున్నాడు. బుధవారం క్వాలిఫయింగ్ రౌండ్ జరగనుంది. ఒలింపిక్ చాంప్ అర్షద్ నదీమ్, డైమండ్ లీగ్ విజేత జూలియన్ వెబర్, గ్రెనెడా స్టార్ అండర్సన్ పీటర్స్ తదితరుల నుంచి చోప్రాకు గట్టి పోటీ ఎదురుకానుంది. గ్రూప్-ఎలో చోప్రా, గ్రూప్-బిలో నదీమ్ ఉన్నారు. ఫైనల్ చేరితేనే వీరిద్దరూ ముఖాముఖిగా తలపడే అవకాశం ఉంది. ఫైనల్ గురువారం జరగనుంది. సచిన్ యాదవ్, రోహిత్ యాదవ్, యశ్‌వీర్ సింగ్ కూడా సత్తాచాటాలనుకొంటున్నారు. ఒకవేళ చోప్రా స్వర్ణం సాధిస్తే చెక్ లెజెండ్ జన్ జలెంజీ, అండర్సన్ పీటర్స్ తర్వాత టైటిల్‌ను నిలబెట్టుకొన్న మూడో అథ్లెట్‌గా రికార్డుకెక్కుతాడు.

టైటిళ్లు నిలబెట్టుకొన్న ఇథన్, ఫెయిత్: హ్యామర్ త్రోలో ఇథన్ కాట్జ్‌బర్గ్ (కెనడా), 1500 మీటర్లలో ఫెయిత్ కిప్‌యిగాన్ (కెన్యా) టైటిళ్లను నిలబెట్టుకొన్నారు. పురుషుల హ్యామర్ త్రో ఫైనల్లో ఇథన్ 84.70 మీటర్ల త్రోతో స్వర్ణంతోపాటు గేమ్స్ రికార్డును నెలకొల్పాడు. మహిళల 1500 మీ. ఫైనల్లో ఫెయిత్ 3 నిమిషాల 52.15 సెకన్ల టైమింగ్‌తో స్వర్ణం నెగ్గింది.

టాప్-6లో సర్వేష్



హైజంపర్ సర్వేష్ అనిల్ కుషారే పతకం నెగ్గకపోయినా.. వరల్డ్ చాంపియన్‌షిప్ ఫైనల్లో టాప్ సిక్స్‌లో నిలిచిన నాలుగో భారత అథ్లెట్‌గా ఘనతను అందుకొన్నాడు. ఫైనల్లో 2.28 మీటర్ల ఎత్తు దూకిన సర్వేష్ ఓవరాల్‌గా ఆరో స్థానంలో నిలిచాడు. ఈ క్రమంలో తన వ్యక్తిగత బెస్ట్ (2.27 మీటర్లు)ను అధిగమించాడు. హమీష్ (న్యూజిలాండ్- 2.36 మీ.) స్వర్ణం నెగ్గాడు.

కాన్‌స్టస్ శతకం

- ఆసీస్ 'ఏ' తొలి ఇన్నింగ్స్ 337/5
- హర్ష్ దూబేకు మూడు వికెట్లు

లఖ్‌నవూ: భారత్ 'ఎ'తో జరుగుతున్న తొలి అనధికార టెస్టును ఆస్ట్రేలియా 'ఏ' ఘనంగా ఆరంభించింది. ఓపెనర్లు సామ్ కాన్‌స్టస్ (109) శతకం సహాయంతో మంగళవారం మొదటి రోజు ఆట ముగిసేసరికి ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 337/5 పరుగులతో నిలిచింది. తొలి వికెట్‌కు సామ్ మరో ఓపెనర్ క్యాంప్‌బెల్ (88)తో కలిసి 198 రన్స్ జోడించాడు. కనోలి (70), స్కాట్ (47 బ్యాటింగ్) రాణించారు. పేసర్ హర్ష్ దూబేకు మూడు వికెట్లు.. ఖలీల్, గుర్నూర్‌లకు చెరో వికెట్ లభించాయి.

మెట్లెక్కుతుంటే ఆయాసం వస్తోంది



టోక్యో: దశాబ్దం పాటు ట్రాక్ అండ్ ఫీల్డ్ ఏలిన జమైకా స్ప్రింట్ కింగ్ ఉసేన్ బోల్ట్ (39) రిటైర్మెంట్ తర్వాత అనారోగ్య సమస్యలతో ఇబ్బందిపడుతున్నట్టు చెప్పాడు. ఒకప్పుడు భూమిపై వేగవంతమైన అథ్లెట్‌గా గుర్తింపు దక్కించుకొన్న బోల్ట్.. ఇప్పుడు మెట్లెక్కడానికి కూడా ఆయాసపడుతున్నట్టు తెలిపాడు. వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌కు అతిథిగా హాజరైన బోల్ట్ తన రోజువారీ జీవనశైలి గురించి మీడియాతో ఆసక్తికర విషయాలు పంచుకొన్నాడు. 'పిల్లలు స్కూల్‌కు వెళ్లే సమయానికి నిద్రలేస్తా. పిల్లలు స్కూలు నుంచి తిరిగి వచ్చేదాకా వెబ్‌సిరీస్‌లు చూస్తూ గడిపేస్తా. జిమ్‌కు కొంతకాలం దూరంగా ఉన్నా. ఇకనైనా పరిగెత్తడం మొదలెట్టాలి. ఎందుకంటే మెట్లెక్కేటప్పుడు ఆయాసం వస్తోంది. మళ్లీ రన్నింగ్ ఆరంభిస్తే శ్వాస తీసుకోవడం మెరుగుపడుతుంద'ని బోల్ట్ చెప్పాడు. వెన్నెముక సమస్యతోపాటు మడమ నొప్పితో బోల్ట్ బాధపడుతున్నాడు. బోల్ట్ 2017లో రిటైరయ్యాడు.

యూపీపై బెంగాల్ గెలుపు


జైపూర్: కెప్టెన్ దేవాంక్ అదరగొట్టడంతో.. ప్రొ కబడ్డీ లీగ్‌లో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 41-37తో యూపీ యోధాస్‌పై గెలిచింది. మరో మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ 35-29తో బెంగళూరు బుల్స్‌పై విజయం సాధించింది.

అంధ వరల్డ్‌కప్‌నకు తటస్థ వేదికగా కొలంబో

న్యూఢిల్లీ: నవంబరు 11 నుంచి 25 వరకు భారత్ వేదికగా జరిగే అంధ మహిళల టీ20 వరల్డ్‌కప్‌లో పాకిస్థాన్ ఆడే మ్యాచ్‌లకు తటస్థ వేదికను ఖాట్మండు నుంచి కొలంబోకు మార్చారు. నేపాల్ రాజధాని ఖాట్మండులో నెల కొన్ని అస్థిర పరిస్థితుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నారు.

దరఖాస్తులో ఏమున్నా.. 'మెరిట్'కే ప్రాధాన్యం!

- అప్లికేషన్ దశలో 'ప్రాధాన్యత' కోరడం సరికాదు
- ఎస్‌జీటీ కోరుకున్నారని.. ప్రతిభ ఉన్న అభ్యర్థిని ఎస్‌ఏ పోస్టుకు అర్హులు కాదని చెప్పడానికి వీల్లేదు
- 2 పోస్టులకు ఎంపికైన వారికి కోరుకున్నది ఇవ్వొచ్చు
- వేర్వేరుగా ఫీజులు కట్టారు.. పరీక్షలు కూడా రాశారు
- డీఎస్సీ పోస్టుల భర్తీపై హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యలు
- ప్రాధాన్యత తేల్చే బాధ్యత సింగిల్ జడ్జిదేనని వెల్లడి
- 4 వారాల్లో తుది నిర్ణయం వెల్లడించాలని సూచన




అమరావతి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025 పోస్టుల భర్తీకి సంబంధించి దరఖాస్తు దశలోనే ప్రాధాన్యతలు ఎంపిక చేసుకోవాలని అభ్యర్థులను కోరడాన్ని హైకోర్టు ధర్మాసనం తప్పుబట్టింది. మెరిట్ లిస్ట్ ప్రకటించిన తర్వాత ప్రాధాన్యతలు ఎంపిక చేసుకోవాలని అభ్యర్థులను కోరి ఉండాల్సిందని వ్యాఖ్యానించింది. సెకండరీ గ్రాడ్యుయేట్ టీచర్(ఎస్‌జీటీ), స్కూల్ అసిస్టెంట్(ఎస్‌ఏ) పోస్టులకు నిర్వహించిన రెండు పరీక్షల్లో మెరిట్ సాధించిన అభ్యర్థి, దరఖాస్తు దశలో ఎస్‌జీటీ పోస్టుకు ప్రాధాన్యత ఇచ్చారనే కారణంతో ఎస్‌ఏ పోస్టుకు అర్హులుకాదని చెప్పడానికి వీల్లేదని పేర్కొంది. ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ ఎస్‌ఏ పోస్టులకు వేర్వేరుగా దరఖాస్తులు స్వీకరించి, వేర్వేరుగా ఫీజులు వసూలు చేసి, వేర్వేరుగా పరీక్షలు నిర్వహించారని గుర్తు చేసింది. రెండు పోస్టులకు ఎంపికైన అభ్యర్థులను ఎస్‌జీటీ పోస్టుకే పరిమితం చేయడం సరి కాదని, మెరిట్ ఆధారంగా 'ఎస్‌ఏ' పోస్టుల ఎంపికలో పిటిషనర్లను పరిగణనలోకి తీసుకోవాలని సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యానికి ధర్మాసనం నిరాకరించింది. ప్రాధాన్యత అంశాన్ని తేల్చే వ్యవహారాన్ని సింగిల్ జడ్జికే అప్పగించింది. ఇరుపక్షాల వాదనలువిని 4 వారాల్లో తుది తీర్పు వెల్లడించాలని సింగిల్ జడ్జిని కోరింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు ఇచ్చింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాల్ చేస్తూ పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి వేసిన అప్పీల్‌ను పరిష్కరించింది.

వివాదం ఇదీ..

ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్‌జీటీ, ఎస్‌ఏ పోస్టులతో పాటు ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్(టీజీటీ), ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్(పీఈటీ) పోస్టుల భర్తీకి గత ఏప్రిల్‌లో విద్యాశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. అర్హత మేరకు అభ్యర్థులు వేర్వేరు పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు అనుమతిచ్చింది. పిటిషనర్లు ఎస్‌జీటీ, ఎస్‌ఏ పోస్టులకు పరీక్ష రాసి రెండిట్లోనూ అర్హత సాధించారు. మెరిట్ జాబితాలో సైతం ర్యాంక్ సాధించారు. అయితే, దరఖాస్తులో ఇచ్చిన ప్రాధాన్యతా క్రమం ఆధారంగా ఎస్‌జీటీ పోస్టుకు ఎంపిక చేసి, ఎస్‌ఏ పోస్టుకు అవకాశం కల్పించలేదు. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కర్నూలుకు చెందిన బండేగిరి బషీరున్ సహా 10 మంది అభ్యర్థులు వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు సింగిల్ జడ్జి జస్టిస్ ఎన్. విజయ్.. మెరిట్ ఉన్నప్పటికీ దరఖాస్తులో పేర్కొన్న ప్రాధాన్యత క్రమం కారణంగా ఎస్‌ఏ పోస్టుకు అవకాశం కల్పించకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ప్రతిభకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల ఎంపికలో పిటిషనర్లను పరిగణనలోకి తీసుకోవాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రాధాన్యత క్రమాన్ని మార్చలేరు: ఏజీ

మంగళవారం విచారణలో అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. "ఒకసారి ప్రాధాన్యత క్రమాన్ని ఎంచుకున్న తర్వాత దానిని మార్చలేరు. ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలను అభ్యర్థులు సవాల్ చేయలేరు. ఎస్‌జీటీ పోస్టుల సంఖ్య ఎక్కువగా ఉన్న కారణంగా ఎక్కువ మంది అభ్యర్థులు ఆ పోస్టులకే ప్రాధాన్యత ఇచ్చారు. పిటిషనర్ల అభ్యర్థన అంగీకరిస్తే, మరింత మంది అభ్యర్థులు కోర్టును ఆశ్రయించే ప్రమాదం ఉంది" అన్నారు. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు జీవీఎస్ కిశోర్‌కుమార్, న్యాయవాది గొట్టిపాటి కవిత వాదనలు వినిపిస్తూ.. "మెరిట్‌ను పరిగణనలోకి తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధన కారణంగా మెరిట్ అభ్యర్థులు ఎస్‌ఏ పోస్టుకు అర్హత కోల్పోతున్నారు" అని తెలిపారు.



అద్దాల వంతెనకు విద్యుత్ కాంతులు

విశాఖ నగరంలోని కైలాసగిరిపై వీఎంఆర్డీఏ నిర్మించిన అద్దాల వంతెనకు రంగురంగుల విద్యుద్దీపాలతో మరింత ఆకర్షణ వచ్చింది. ఈ వంతెనను మరో వారం రోజుల్లో సీఎం చంద్రబాబు ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్లు చక చకా పూర్తి చేస్తున్నారు. ఎల్‌ఈడీ విద్యుద్దీప కాంతులతో మెరిసిపోతున్న వంతెన.. బీచ్‌రోడ్డులో వెళ్లేవారికి కనువిందు చేస్తోంది. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

పెట్టుబడులతో రండి

(మొదటి పేజీ తరువాయి)

అత్యున్నత స్థాయి పెట్టుబడిదారులతో రోడ్‌షో నిర్వహించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్, పాల్ మాల్ కన్వెన్షన్ వేదికగా జరిగిన ర్యాలీలో యూకే డిప్యూటీ హైకమిషనర్ సుజిత్ ఘోష్, టెక్ మహీంద్రా యూరప్ విభాగం ప్రెసిడెంట్ హర్పాల్ అస్నానీ, ఐసీఐసీఐ బ్యాంకు యూకే విభాగం సీఈవో రాఘవ్ సింఘాల్, గ్లోబల్ ఫండ్, మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీలకు చెందిన 150 మంది సీఈవోలు, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు పాల్గొన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, పెట్టుబడిదారుల స్నేహ పూర్వక విధానాలు, ఇటీవల రాష్ట్రానికి వచ్చిన భారీ పెట్టుబడులు, కొత్తగా పరిశ్రమల ఏర్పాటుకు గల అవకాశాలను లోకేశ్ వివరించారు. గత 15 నెలల కాలంలో రాష్ట్రానికి రూ. 10,06,799 కోట్ల విలువైన 122 భారీ ప్రాజెక్టులను తీసుకువచ్చామన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటయ్యే పరిశ్రమల కోసం లక్ష ఎకరాల భూమి కలిగిన పారిశ్రామిక క్లస్టర్లను అందుబాటులో ఉంచామని గ్లోబల్ ఇన్వెస్టర్లకు లోకేశ్ వివరించారు. మరో ఏడాదిలో పెట్టుబడులను రెట్టింపు చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై గ్లోబల్ ఇన్వెస్టర్లకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్రంలో పోర్టు ఆధారిత పారిశ్రామిక, గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ ఇన్నోవేషన్, ఆధునిక తయారీ రంగం వంటి అంశాలకు ప్రాధాన్యమిచ్చారు. విశాఖలో నిర్వహించే పార్టనర్‌షిప్ సమ్మిట్‌కు భారీ పెట్టుబడులతో రావాలని ఆహ్వానించారు.

సమయం ఇవ్వాలంటే 10 వేలు కట్టండి!

- శాసనమండలి చైర్మన్ మోషేన్ రాజుకు హైకోర్టు ఆదేశం

అమరావతి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ పదవికి సమర్పించిన రాజీనామాపై శాసనమండలి చైర్మన్ మోషేన్ రాజు నిర్ణయం వెల్లడించడం లేదని, సత్వరమే నిర్ణయం వెల్లడించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ దాఖలు చేసిన పిటిషన్ హైకోర్టులో మరోసారి విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా.. కౌంటర్ వేసేందుకు మరింత సమయం ఇవ్వాలని చైర్మన్ తరఫు న్యాయవాది అభ్యర్థించారు. సమయం ఇవ్వాలంటే కోర్టు ఖర్చుల కింద రూ.10 వేలు చెల్లించాలని హైకోర్టు ఆదేశించింది. దీనికి న్యాయవాది అంగీకరించడంతో రూ.10 వేలను బుధవారం సాయంత్రం 5 గంటలలోగా హైకోర్టు అడ్వొకేట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వద్ద జమ చేయాలని కోర్టు పేర్కొంది. విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

సేమ్ టు 'షేమ్'!



(మొదటి పేజీ తరువాయి)

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు చేసింది. ఛత్తీస్‌గఢ్‌లో నాటి ముఖ్యమంత్రి భూపేశ్ బాఘేల్ తనయుడు చైతన్య బాఘేల్‌ను కటకటాల వెనక్కి నెట్టింది. ఛత్తీస్‌గఢ్ స్కామ్‌లో చైతన్య బాఘేల్ పాత్రను వివరిస్తూ మంగళవారం ఈడీ ఏకంగా 7వేల పేజీల చార్జిషీటు దాఖలు చేసింది. ఏపీ లిక్కర్ స్కామ్‌ను కేంద్ర దర్యాప్తు సంస్థలు పట్టించుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వమే ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ద్వారా దర్యాప్తు చేయిస్తోంది. ఛత్తీస్‌గఢ్, ఏపీ లిక్కర్ స్కామ్‌లో అనేక సారూప్యతలు కనిపిస్తుండటం ఉండటం విశేషం. ఇప్పటిదాకా దర్యాప్తులో గుర్తించిన అంశాల ఆధారంగా...

'పాలసీ' పేరుతో...

'మద్యం విక్రయాలు, వినియోగం నియంత్రణ' పేరుతో ఒక పాలసీని రూపొందించి... దానినే డోపిడీకి అనుకూలంగా మార్చుకున్నారు. ఏపీలో, ఛత్తీస్‌గఢ్‌లో అదే 'పాలసీ'! ప్రభుత్వ మద్యం దుకాణాల పేరుతో... సొంత 'ముడుపుల దుకాణాలు' తెరిచారు.

తిలాపాపం...

ఛత్తీస్‌గఢ్ లిక్కర్ స్కామ్‌లో సీఎం తనయుడితో మొదలుకుని అనేక మంది అధికారులు, రాజకీయ నాయకులు, వ్యాపారులు కుమ్మక్కయ్యారు. ఏపీలో... మాత్రం 'ఎవరిని బడితే వారిని' ఇందులో వేలు పెట్టనివ్వలేదు. ఏ స్థానంలో ఎవరుండాలో, ఎవరి పాత్ర ఏమిటో ముందే నిర్ణయించుకుని... వారి ద్వారా మాత్రమే స్కామ్ నడిపించారు. 'అంతిమలబ్ధిదారు'కు మాత్రమే అత్యధిక వాటా వెళ్లేలా పకడ్బందీగా వ్యవహరించారు.

అందరికీ 'కిక్కు'

ఛత్తీస్‌గఢ్‌లో నేతలతోపాటు మద్యం ఉత్పత్తిదారులు, రవాణాదారులు, సీనియర్ అధికారులు చేతులు కలిపారు. తమ నెట్‌వర్క్ సాఫీగా నడిచేలా చూసుకున్నారు. వచ్చిన సొమ్ములతో ఆస్తులు కొన్నారు. బిల్డింగులు కట్టుకున్నారు. జల్సాలు చేసుకున్నారు. ఏపీలోనూ ఇదే జరిగింది. అయితే... ఇదంతా 'అంతిమ లబ్ధిదారు' కనుసన్నల్లోనే సాగింది. అయినప్పటికీ... కమీషన్ల సొమ్మును కొందరు పాత్రధారులు సొంతానికి మళ్లించుకుని ఆస్తులు పోగేసుకున్నారు. ఆఫ్రికా దేశాల్లో వ్యాపారాలు చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు.

కేంద్రం పాత్ర ఏమిటి?

కారణాలు ఏమైనప్పటికీ... ఢిల్లీ, ఛత్తీస్‌గఢ్‌లలో జరిగిన మద్యం స్కామ్‌లపై కేంద్రం తీవ్రంగా స్పందించింది. ఢిల్లీలో ఉప ముఖ్యమంత్రి, ముఖ్యమంత్రినే ఈడీ అరెస్టు చేసింది. ఛత్తీస్‌గఢ్‌లో చైతన్య బాఘేల్‌ను ఈ ఏడాది జూలైలో అరెస్టు చేసింది. కానీ... ఆ రెండు రాష్ట్రాలకు మించిన ఏపీ లిక్కర్ స్కామ్‌పై మాత్రం ఈడీ స్పందించలేదు. 'సిట్' చేసిన దర్యాప్తులో షెల్ కంపెనీల ఏర్పాటు నుంచి మనీ లాండరింగ్ వరకు అనేక అక్రమాలు బయటపడ్డాయి. తాము గుర్తించిన సమాచారాన్ని ఈడీతో పంచుకుంటూనే ఉన్నారు. అయినా... ఈడీ గప్‌చుప్!

'లెక్కే లేదు'...

ఏపీలో సొంత డిస్టిలరీలు, సొంత బ్రాండ్లను రంగంలోకి దించారు. ఇక... ఇతర కంపెనీలకు సంబంధించి, కమీషన్లు ఇచ్చిన వారికి మాత్రమే ఆర్డర్లు వెళ్లాయి. ఇదంతా ఒక పద్ధతి ప్రకారం జరిగింది. ఛత్తీస్‌గఢ్ స్కామ్ సూత్రధారులకు ఇన్ని తెలివితేటలు లేవు కాబోలు! వ్యవహారాన్ని నాటుగా నడిపించారు. సుమారు 40 లక్షల కేసుల మద్యాన్ని ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా 'అనధికారికం'గా విక్రయించారు. తద్వారా వచ్చిన లాభాలను సొంతానికి పంచుకున్నారు.

హోలోగ్రామ్‌తోనూ...

ఛత్తీస్‌గఢ్‌లో హోలోగ్రామ్‌లు సరఫరా చేసే కాంట్రాక్టరు కూడా లిక్కర్ సిండికేట్‌లో భాగమే. నకిలీ హోలోగ్రామ్‌లు సరఫరా చేసి... వాటిద్వారా అనధికారికంగా సరుకు విక్రయించారు. ఏపీలోనూ ఇలాంటి 'డీలింగ్స్' జరిగినట్లు అనుమానాలున్నాయి. మద్యం డిపోల నుంచి కాకుండా... డిస్టిలరీల నుంచి నేరుగా షాపులకు తరలించి, ఆ మద్యాన్ని విక్రయించినట్లు ఆరోపణలున్నాయి. జగన్ హయాంలో మద్యం దుకాణాల్లో డిజిటల్ చెల్లింపులకు ఆస్కారం ఇవ్వకపోవడం ఈ అనుమానాలకు బలం చేకూరుస్తోంది.

ఛత్తీస్‌గఢ్ లిక్కర్ స్కామ్‌లో..
మాజీ సీఎం బఘేల్ కుమారుడిదే కీలక పాత్ర

- మద్యం సిండికేట్ చైతన్య నియంత్రణలోనే: ఈడీ

రాయ్‌పూర్, సెప్టెంబరు 16: ఛత్తీస్‌గఢ్‌లో భూపేశ్ బఘేల్ సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన రూ.2,500 కోట్ల మద్యం స్కామ్‌లో ఆయన కుమారుడు చైతన్య బఘేల్ కీలక పాత్ర పోషించారని ఈడీ పేర్కొంది. ఈ మేరకు నాలుగో చార్జిషీటును రాయ్‌పూర్ కోర్టులో సోమవారం దాఖలు చేసింది. లిక్కర్ సిండికేట్ చైతన్య కనుసన్నల్లోనే నడిచిందని.. రూ.వెయ్యి కోట్ల నగదు లావాదేవీలను స్వయంగా నిర్వహించారని తెలిపింది. ఈ ఏడాది జూలై 18న మాజీ సీఎం నివాసంలో సోదాలు నిర్వహించిన ఈడీ.. చైతన్యను అరెస్టు చేసింది. '2019-22 మధ్య బఘేల్ ప్రభుత్వం ఉన్నప్పుడు మద్యం స్కాం జరిగింది. సిండికేట్ వ్యవహారాలు నడిపేందుకు ఐఏఎస్ అనిల్ తుటేజా, వ్యాపారి అన్వర్ డేబర్‌ను ఎంచుకున్నారు. ముడుపుల నిర్వహణ చైతన్యే చేపట్టారు. చైతన్యతో కలిసి వెయ్యి కోట్ల వరకు వసూలు చేశానని లక్ష్మీనారాయణ్ బన్సల్ అనేవ్యక్తి వాంగ్మూలం ఇచ్చారు. బన్సల్‌కు భూపేశ్ పాతికేళ్లుగా తెలుసు. ఆయన సీఎంగా ఉన్నప్పుడు బన్సల్ రోజూ సీఎంవోను సందర్శించేవారు. ఒకసారి అక్కడకు వెళ్లినప్పుడు.. అన్వర్ డేబర్ కొంత సామాను (నగదుకు కోడ్ పదం) పంపిస్తాడని.. దానిని అప్పటి రాష్ట్ర కాంగ్రెస్ కోశాధికారి రాంగోపాల్ అగర్వాల్‌కు అందించాలని బఘేల్ తనకు చెప్పినట్లు ఆయన తెలిపారు' అని ఈడీ పేర్కొంది. ముడుపుల్లో రూ.18.90 కోట్లను చైతన్య విఠల్ గ్రీన్ అనే రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులో పెట్టారని.. రూ.3.10 కోట్లను మెస్సర్స్ బఘేల్ డెవలపర్స్ అండ్ అసోసియేట్స్‌లో పెట్టుబడిగా పెట్టారని వివరించింది. బీజేపీ అధికారంలోకి వచ్చాక.. మద్యం స్కాంపై ఏసీబీ గతేడాది జనవరి 17న ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. మాజీ ఎక్సైజ్ మంత్రి కవాసీ లఖ్మా, మాజీ సీఎస్ వివేక్ ఢాండ్ సహా 70 మంది వ్యక్తులు, కంపెనీలను నిందితులుగా పేర్కొంది. ఆ తర్వాత ఈడీ రంగప్రవేశం చేసింది.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

విభిన్నమైన థ్రిల్లర్



విజయ్ ఆంటోని

విజయ్ ఆంటోని కథానాయకుడిగా అరుణ్‌ప్రభు తెరకెక్కించిన చిత్రం 'భద్రకాళి'. ఇది ఆయన నటించిన 25వ చిత్రం కావడంతో సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. రామాంజనేయులు జవ్వాజీ నిర్మించారు. ఈ నెల 19న చిత్రం విడుదలవుతోంది. తెలుగులో నిర్మాత సురేశ్‌బాబు, హీరో రానా విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రీరిలీజ్ వేడుకలో విజయ్ ఆంటోని మాట్లాడుతూ 'దేశంలోని గొప్ప దర్శకులలో అరుణ్ ప్రభు ఒకరు. ఆయనతో సినిమా చేయడం నా అదృష్టం. ఇదో విభిన్నమైన పొలిటికల్ థ్రిల్లర్' అని అన్నారు. 'విజయ్ ఆంటోని సినిమాలు అద్భుతంగా ఉంటాయి. సినిమా ఘనవిజయం సాధించాలి' అని సురేశ్‌బాబు కోరారు. 'సినిమా అందరికీ రిలేట్ అయ్యేలా ఉంటుంది' అని అరుణ్ ప్రభు తెలిపారు.

కళ్లను చూసి ఆటపట్టించేవారు



'చిన్నప్పుడు అందరూ నా కళ్లను చూసి ఆటపట్టించేవారు. 'డెత్ గోట్ ఐస్' అంటూ టీజ్ చేసేవారు. అయితే ఇప్పుడు ఆ కళ్లే నాకు ఆనందాన్నిస్తున్నాయి. వరుస అవకాశాలు తెచ్చిపెడుతున్నాయి' అని అన్నారు నటుడైన కొరియోగ్రాఫర్ శాండీ మాస్టర్. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమా పరమేశ్వరన్ జంటగా కౌశిక్ పెగల్లపాటి తెరకెక్కించిన చిత్రం 'కిష్కింధపురి'. షైన్ స్క్రీన్స్ బేనర్‌పై సాహు గారపాటి నిర్మించారు. సినిమా ఇటీవలె విడుదలై థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా శాండీ మీడియాతో మాట్లాడుతూ "లియో" సినిమా తర్వాత నాకు అన్నీ సైకో పాత్రలే వచ్చాయి. ఇలాంటి సమయంలో 'లోక', 'కిష్కింధపురి' సినిమాల్లో విభిన్నమైన పాత్రలతో వరుస విజయాలను అందుకోవడం ఆనందంగా ఉంది. ఓంకార్ 'ఛాలెంజ్-3' షో కోసం హైదరాబాద్ వచ్చాను. 'పోతే పోనీ పోరా...' పాట నాకు మంచి పేరు తెచ్చి పెట్టింది. 'కిష్కింధపురి'లో నా నటనను చూసి దర్శకులు పా రంజిత్, లోకేశ్ కనగరాజ్ అభినందించారు. కొరియోగ్రఫే నా బేస్. కచ్చితంగా కొరియోగ్రఫీ చేస్తాను. అయితే ప్రస్తుతం నేను నటన మీద దృష్టి కేంద్రీకరించాను. ఈ రెండూ బ్యాలెన్స్ చేస్తూ చేయాలని ఉంది. నాకు దర్శకత్వం మీద కూడా ఆసక్తి ఉంది. అయితే దానికింకా సమయం ఉంది' అని చెప్పారు.

మెగాస్టార్‌తో మేజర్ సాబ్



జమ్ము కశ్మీర్ నియంత్రణ రేఖ దగ్గర జరిగిన దాడుల్లో పాక్ ఉగ్రవాదులను అంతమొందించి, సహచర సైనికులను రక్షించడంలో అత్యంత ధైర్య సాహసాలు ప్రదర్శించారు మేజర్ మల్లా రామ్‌గోపాల నాయుడు. ఆయన సాహసాన్ని మెచ్చుకుంటూ కీర్తిచక్ర అవార్డును అందజేశారు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము. మేజర్ రామ్‌గోపాలనాయుడు మెగాస్టార్ చిరంజీవి అభిమాని కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో రామ్‌గోపాల నాయుడు దంపతులు చిరంజీవిని కలిశారు. దేశ రక్షణలో ఎప్పుడూ ముందుండే రియల్ హీరో తనని కలవడం ఆనందంగా ఉందనీ, ఆయన తన అభిమాని కావడం ఎంతో గర్వకారణమనీ చిరంజీవి సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు.

'మిరాయ్' విజయం ఆనందాన్ని ఇచ్చింది



హరి గౌర

"మిరాయ్' ఘన విజయం గొప్ప ఆనందాన్ని ఇచ్చింది. ఇలాంటి సక్సెస్ వచ్చినప్పుడు సినిమా కోసం పడ్డ కష్టం మర్చిపోతాం. మా నిర్మాత, దర్శకుడు, కథానాయకుడు సహా మొత్తం చిత్రబృందం సంతోషంగా ఉంది' అని అన్నారు సంగీత దర్శకుడు హరి గౌర. తేజ సజ్జా కథానాయకుడిగా కార్తిక్ ఘట్టమనేని తెరకెక్కించిన చిత్రం 'మిరాయ్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. సినిమా ఇటీవలె విడుదలై మంచి పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరి గౌర చిత్ర విశేషాలు పంచుకున్నారు.

- దర్శకుడు కార్తిక్ చాలా అద్భుతమైన పిక్చర్ తీశారు. ఆ పిక్చర్ నన్ను సంగీతం సమకూర్చడానికి స్ఫూర్తినిచ్చింది. సినిమా చూస్తున్నప్పుడే అంతర్జాతీయ ప్రమాణాలకు దగ్గరగా ఉందనిపించింది.
- సినిమా ఘన విజయాన్ని సొంతం చేసుకున్న వెంటనే చాలా మంది ఫోన్ చేసి అభినందించారు. థియేటర్లలో ప్రేక్షకులు సంగీతాన్ని ఎంజాయ్ చేయడం ఆనందం కలిగించింది. ఈ సినిమాలో ప్రతి పాత్రకూ ప్రాధాన్యం ఉంది. అది దృష్టిలో పెట్టుకున్ని బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ ఇచ్చాను.
- మిరాయ్ అనే ఆయుధానికి లార్డ్ శివ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ ఉపయోగించాను. ఇది శ్రీరాముల వారి ఆయుధం అయినప్పటికీ దానికి పినాక అనే పేరు ఉంది.
- ఈ సినిమా కోసం రకరకాల జానర్స్‌ని ఉపయోగించాను. ఇంటర్వెల్ బ్యాంగ్‌లో నాలుగు జానర్స్‌లో సౌండ్‌ని మిక్స్ చేసి ప్రెజెంట్ చేసే అవకాశం రావడం చాలా ఆనందాన్ని ఇచ్చింది.
- చిత్రబృందం నిర్ణయం మేరకే వైబ్ వుంది అనే పాటను సినిమాలో చేర్చలేదు. సినిమాకి ఏది అవసరమో అది చేయడమే కరెక్ట్.

వినోదభరిత ప్రేమకథ



యూట్యూబర్ షణ్ముఖ్ జస్వంత్, ఉల్కా గుప్తా జంటగా వి భీమశంకర్ తెరకెక్కిస్తున్న చిత్రం 'ప్రేమకు నమస్కారం'. శివాజీ, భూమిక కీలక పాత్రలు పోషిస్తున్నారు. అనిల్ కుమార్ రావాడ, భార్గవ్ మన్నె నిర్మిస్తున్నారు. మంగళవారం ఈ సినిమా టైటిల్‌ను ఖరారు చేసి గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్ ఇందులోని వినోదం, సంభాషణలు ఆకట్టుకున్నాయి. 'సినిమాలో యూత్‌తో పాటూ కుటుంబ ప్రేక్షకులను మెప్పించే కంటెంట్ ఉంది. ప్రస్తుత కాలం ప్రేమలోని అంశాలను వినోదభరితంగా చూపించబోతున్నాం' అని మేకర్స్ తెలిపారు.

నా మనసులో 'కణ్మని'కి ప్రత్యేక స్థానముంటుంది

"ఓజీ'తో దాదాపు రెండున్నరేళ్ల ప్రయాణం నాది. అది ఎప్పటికీ మరచిపోలేను. పవన్ కల్యాణ్ గారితో కలసి నటించే అవకాశం రావడం నా అదృష్టం. ఆయన సరసన 'కణ్మని' పాత్రలో నటించడం మరింత అదృష్టం. ఇప్పటిదాకా నేను చేసిన పాత్రల్లో 'కణ్మని' నాకు చాలా ఇష్టమైన పాత్ర. ఈ పాత్రకి నా మనసులో ఎప్పటికీ ప్రత్యేక స్థానముంటుంది' అని అన్నారు కథానాయిక ప్రియాంక అరుళ్ మోహన్. పవన్ కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ తెరకెక్కించిన చిత్రం 'ఓజీ'. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మించారు. సినిమా ఈనెల 25న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రియాంక అరుళ్ మోహన్ మీడియాతో ముచ్చటించారు.



- పవన్ కల్యాణ్ గారితో పని చేయడం అనేది ప్రతి రోజూ అదృష్టమే. ఆయన నుంచి ఎన్నో నేర్చుకున్నాను. ఆయన జెంటిల్ మేన్. అందరినీ సమానంగా చూస్తారు. ఆన్‌స్ర్కీన్‌లో, ఆఫ్ స్ర్కీన్‌లో ఆయన హీరో.
- 1980-90లలో జరిగే కథ ఇది. పాత్రను మలిచిన తీరు కానీ, ఆహార్యం కానీ ఆ కాలానికి తగ్గట్టుగానే ఉంటాయి. 'కణ్మని' ఓ అందమైన అమాయక పిల్ల. గంభీర పాత్రతో గాఢమైన ప్రేమలో ఉంటుంది.
- ఈ సినిమాలో యాక్షన్ ఒక భాగం మాత్రమే. బలమైన కథ ఉంది. ఫ్యామిలీ డ్రామా కూడా ఉంది. తెలుగులో కొన్ని కథలు వింటున్నాను. అలాగే వేరే భాషల్లో పలు సినిమాలు చేస్తున్నాను.

సరికొత్త లోకంలోకి తీసుకెళ్లే చిత్రం



సుధీర్‌బాబు, సోనాక్షీ సిన్హా జంటగా వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్న చిత్రం 'జటాధర'. ఉమేశ్‌కుమార్ బన్సాల్, ప్రేరణ్ అరోరా, శివిన్ నారంగ్ నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదలైన టీజర్ ఆకట్టుకుని సినిమాపై అంచనాలను పెంచింది. తాజాగా సినిమా విడుదల తేదీని ప్రకటించారు మేకర్స్ నవంబరు 7న చిత్రాన్ని పాన్‌ఇండియా లెవెల్లో ప్రేక్షకుల ముందుకు తెస్తున్నట్లు రిలీజ్ డేట్ పోస్టర్ ద్వారా తెలిపారు. ఈ మైథలాజికల్ థ్రిల్లర్ ప్రేక్షకులను ఓ సరికొత్త లోకంలోకి తీసుకెళ్తుందని చెప్పారు.

హాలీవుడ్ నటుడు రాబర్ట్ రెడ్‌ఫోర్డ్ ఇకలేరు



హాలీవుడ్ నటుడు, దర్శకుడు రాబర్ట్ రెడ్‌ఫోర్డ్(89) ఉటాలోని తన నివాసంలో మంగళవారం కన్నుమూశారు. ఆయన మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. 70, 80వ దశకంలో ఆయన నటించిన, దర్శకత్వం వహించిన చిత్రాలు విశేష ప్రేక్షకాదరణ పొందాయి. 'ద క్యాండిడేట్', 'ఆల్ ద ప్రెసిడెంట్స్ మెన్', 'ద వే వియ్ వర్' వంటి చిత్రాల్లో నటించి మెప్పించారు ఆయన. పాత్రకు తగ్గట్లు తన లుక్‌ను మార్చుకోవడంలో ఎంతో పట్టుదల చూపించేవారు. ఆ తర్వాత 1980లో ఆయన తెరకెక్కించిన 'ఆర్డినరీ పీపుల్'తో ఉత్తమ దర్శకుడిగా ఆస్కార్ అవార్డు అందుకొన్నారు.

అమ్మాయిలకు వాళ్ల నాన్న గుర్తొస్తారు

\- వీకే నరేశ్



'చాలా సినిమాల్లో తల్లీ కొడుకుల అనుబంధాన్ని చూపించారు. కానీ తండ్రీ కూతుళ్ల బంధాన్ని చాలా తక్కువ చిత్రాల్లో చూపించారు. ఈ సినిమా చూసి అమ్మాయిలకు వాళ్ల నాన్న గుర్తొచ్చి కంట్లో నీళ్లు రాకపోతే నన్ను అడగండి. ఇంట్లో అన్నీ అమ్మ అయితే ఇంటికి కాంపౌండ్ వాల్ లాంటివాడు నాన్న. ఆ భావోద్వేగమే 'బ్యూటీ' సినిమా' అని అన్నారు సీనియర్ నటుడు వీకే నరేశ్. అంకిత్ కొయ్య, నీలఖి జంటగా జేఎస్ఎస్ వర్ధన్ తెరకెక్కించిన చిత్రం 'బ్యూటీ'. విజయ్‌పాల్ రెడ్డి అడిదల, ఉమేశ్ కుమార్ బన్సల్ నిర్మించారు. సినిమా ఈనెల 19న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రంలో కీలక పాత్రలు పోషించిన వీకే నరేశ్, నటి వాసుకీ మీడియాతో మాట్లాడారు. మొదట నరేశ్ మాట్లాడుతూ 'ఈ సినిమాని దర్శకుడు వర్ధన్ అందంగా మలిచాడు. ఫ్యామిలీ మొత్తం కూర్చొని చూడొచ్చు' అని చెప్పారు. నటి వాసుకీ మాట్లాడుతూ 'ఈ సినిమాలో ఉండాల్సిన స్థాయిలో భావోద్వేగాలు ఉన్నాయి. కథలోని ముఖ్యమైన పాయింట్ ఒక తల్లిగా నాకు కనెక్ట్ అయ్యింది. తల్లికి, కూతురికి ఉండాల్సిన అవగాహన, బాధ్యతను ఈ కథలో చూపించాం' అని అన్నారు.

స్త్రీ శక్తిని తెలియజేసే చిత్రం



సదన్ హాసన్, విక్రమ్ జిత్, నరేశ్ రాజు, వినయ్ బాబు హీరోలుగా, శ్రీలు దాసరి, అదితి మైకేల్, మోహన సిద్ధి హీరోయిన్లుగా నరసింహ నంది తెరకెక్కిస్తోన్న చిత్రం 'ప్రభుత్వ సారాయి దుకాణం'. స్రవంతి మల్లిక్, నరేశ్ గౌడ్ నిర్మాతలు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు నరసింహ నంది మాట్లాడుతూ 'ఈ సినిమాలోని ప్రతి పాత్ర మన పురాణాల్లోని ఏదో ఒక పాత్రను, దాని వ్యక్తిత్వాన్ని గుర్తు చేస్తుంది' అని తెలిపారు. చిత్ర నిర్మాతలు నరేశ్ గౌడ్, స్రవంతి మల్లిక్ మాట్లాడుతూ 'ఒక గ్రామంలో జరిగే కొన్ని వాస్తవ సంఘటనలను తీసుకొని స్త్రీ శక్తిని తెలియజేసేలా చేసిన సినిమా ఇది. ఇటువంటి సినిమా తీయడం అదృష్టంగా భావిస్తున్నాం' అని అన్నారు.

స్వచ్ఛ ఏపీ కోసం యుద్ధమే చేశా..

"స్వచ్ఛ ఏపీ కోసం 30 ఏళ్లుగా యుద్ధం చేస్తున్నా. అప్పట్లో సింగపూర్‌లో రాత్రి అంతా దీనిపైనే గడిపాం. ఫలితంగా రాష్ట్రంలో నైట్ క్లీనింగ్ విధానం తెచ్చాం. దీనికోసం తొలిసారి ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమించాం. హైదరాబాద్‌ను బెస్ట్ క్లీన్ సిటీగా నిలబెట్టాం. క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం పెట్టింది మనమే." అని సీఎం వివరించారు.

నేరాలు 33% తగ్గాలి

రాష్ట్రంలో సైబర్ నేరాలు 16 శాతం పెరిగాయి

- సైబర్ నేరగాళ్ల కంటే పోలీసులు అడ్వాన్స్‌డ్‌గా ఉండాలి
- యూరియాపై అమెరికా నుంచే 750 వరకూ ఫేక్ పోస్టులు
- ప్రభుత్వానికి, రైతులకు మధ్య వైరం పెంచేందుకు యత్నాలు
- శాంతిభద్రతల్లో రాజీ పడం: ఎస్పీలతో సీఎం


కలెక్టర్లు, ఎస్పీల సదస్సులో సీఎం చంద్రబాబు, సీఎస్ కె. విజయానంద్, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా

అమరావతి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో నేరాలు 4శాతం తగ్గాయి.. ఇది సరిపోదు.. 33శాతం తగ్గాలి..' అని జిల్లాల ఎస్పీలకు సీఎం చంద్రబాబు నిర్దేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగిన జిల్లాల కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో రెండో రోజైన మంగళవారం ఆయన శాంతిభద్రతలపై సమీక్షించారు. నేరాల నియంత్రణ, డ్రగ్స్ నివారణ, సైబర్ నేరాల కట్టడికి అధునాతన సాంకేతికత మొదలుకొని పోలీసు జాగిలాల సేవల వరకూ అన్నీ వినియోగించాలని సూచించారు. నేర నియంత్రణలో అత్యుత్తమ ఫలితాలు సాధించాలంటే పోలీసు శాఖలో టెక్నాలజీతో పాటు సృజనాత్మకతను అమలు చేయడం అత్యంత కీలకమని చెప్పారు. రాష్ట్రంలో కొన్ని శక్తులు ప్రభుత్వానికి, రైతులకు మధ్య వైరం పెంచేందుకు విదేశాల నుంచి ప్రయత్నించాయని వెల్లడించారు. యూరియా సమస్యపై అమెరికా, ఫ్రాన్స్, బ్రెజిల్, యూకే నుంచి సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేశారని అన్నారు. ఒక్క అమెరికా నుంచి 750 వరకూ ఫేక్ పోస్టులు చేసినట్టు ఇంటెలిజెన్స్ గుర్తించిందని తెలిపారు. ఇలాంటి శక్తుల పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, కుట్రలు చేసేవారికి చట్టపరంగా తగిన బుద్ధి చెప్పాలని ఎస్పీలకు సీఎం సూచించారు. శాంతిభద్రతల విషయంలో కూటమి ప్రభుత్వం రాజీ పడబోదని, నేరం చేసిన వ్యక్తి ఎవరైనా జైల్లో ఉండాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. నేరం జరిగిన గంటలోపే ఘటనా స్థలికి పోలీసులు చేరుకుని క్రైమ్ సీన్ పాడవ్వక ముందే ఆధారాలు సేకరిస్తే శిక్షల శాతం పెరిగి నేరాలు తగ్గుతాయన్నారు. అందుకే ఏపీ పోలీసు శాఖ ప్రతి పోలీసు సబ్ డివిజన్‌కు క్రైమ్ స్పాట్స్‌ను ఏర్పాటు చేసిందని, జిల్లాల్లో వాటిని వినియోగించుకుని నేరాల శాతాన్ని బాగా తగ్గించాలని సూచించారు. 'వివేకా హత్య కేసులో ఒక సీఐ రక్తం మరకల్ని కడిగించడం దారుణం. క్రైమ్ సీన్ నాశనం చేయడం నేరం.. సెన్సిటివ్ కేసుల్లో చాలా అప్రమత్తంగా ఉండాలి సుగాలి ప్రీతి కేసు సీబీఐకి అప్పగించాం. అదే విధంగా వైసీపీ ప్రభుత్వంలో జరిగిన డ్రైవర్ సుబ్రమణ్యం హత్య కేసు, డాక్టర్ సుధాకర్‌పై దాడి వేధింపుల కేసు, తోట చంద్రయ్య హత్య కేసు, అమర్నాథ్ గౌడ్ సజీవ దహనం లాంటి ఘటనలు వెలికితీసి పకడ్బందీగా దర్యాప్తు చేసి బాధ్యులకు శిక్షలు పడేలా చేయడం ద్వారా బాధితులకు ఉపశమనం కల్పించాలి' అని పోలీసు శాఖకు సీఎం నిర్దేశించారు. సీసీ కెమెరాల వల్ల ఎన్నో నేరాలు కట్టడి చేయడం సాధ్యమవుతోందని, వీలైనన్ని ఎక్కువ ఏర్పాటు చేయాలని సూచించారు. విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు స్పందిస్తూ తమ కమిషనరేట్ పరిధిలో ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయబోతున్నామని, నిర్వహణ విషయంలో పంచాయతీల సహకారం అవసరమన్నారు. ఆర్టీజీఎస్‌తో అనుసంధానం చేసి పోలీసులకు తోడ్పాటు అందిస్తామని సీఎం హామీ ఇచ్చారు. నేరాల కట్టడికి టెక్నాలజీ ఉపయోగించిన విధానం.. ఏఐ హ్యాకథాన్ ద్వారా 12సమస్యలకు పరిష్కారం.. ఏలూరులో మొదలైన ఏఐ ఎఫ్ఐఆర్(ధర్మ ఏఐ) విధానం రాష్ట్రమంతా అమలు చేయడంపై డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా వివరించడంతో చంద్రబాబు అభినందించారు.

దశ దిశ

ఎకో టూరిజం అతిపెద్ద వనరు

"రాష్ట్రవ్యాప్తంగా ఐదు జోన్లలో 5 సర్క్యులర్ ఎకానమీ పార్కులు ఏర్పాటు చేస్తాం. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ సక్రమంగా జరగాలి. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రాంగణాలు పరిశుభ్రంగా ఉండేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలి. గ్రీన్‌కవర్ పెంచడానికి కృషి చేయాలి. ఇది 2029 నాటికి 39 శాతానికి, 2047కి 50 శాతానికి చేరుకోవాలి. ఎకో టూరిజం మనకు అతి పెద్ద వనరు" అని చంద్రబాబు అన్నారు. ఈ భేటీలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, పలువురు మంత్రులు పాల్గొన్నారు.

డ్రగ్స్ కట్టడి అందరి బాధ్యత..

రాష్ట్రంలో ఐదేళ్ల పాటు వేళ్లూనుకున్న డ్రగ్స్ కట్టడి ఒక్క 'ఈగల్'తోనే సాధ్యం కాదని, ఉపాధ్యాయులు, వైద్యులు, ప్రజాప్రతినిధులు..సమాజ హితం కోరే ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సీఎం అన్నారు. డ్రగ్స్ నియంత్రణ ఒక్కరోజులో అయ్యేది కాదన్నారు. మహిళలపై నేరాలు 3శాతం తగ్గినప్పటికీ సైబర్ నేరాలు 16శాతం పెరగడం పెద్ద సవాలుగా నిలుస్తోందని సీఎం అన్నారు. సైబర్ నేరస్తులకు నెలకు రూ.30కోట్ల వరకూ ప్రజలు కోల్పోతున్నారని గుర్తు చేశారు.

శంకరన్‌లా గుర్తింపు తెచ్చుకోండి..

ఎస్ఆర్ శంకరన్‌లా ప్రత్యేకమైన పనితీరుతో గుర్తింపు తెచ్చుకోవాలని కలెక్టర్లకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఎస్పీలకు ఆయన కీలక సూచన చేశారు. నేరాలు జరిగినప్పుడు కిందిస్థాయి వారికే వాటిని వదిలేయవద్దని, నేరుగా ఘటనాస్థలికి వెళ్లే ప్రయత్నం చేయాలన్నారు. పోలీసులు, టెక్నాలజీ కలిసి పనిచేస్తే అద్భుత ఫలితాలు వస్తాయంటూ పలు ఉదంతాలు తెలిపారు.

మహిళా భద్రతకు మరింత భరోసా

రాష్ట్రంలో శాంతి భద్రతలు పటిష్ఠంగా ఉండాలి

- గంజాయిని పూర్తిగా నిర్మూలించడంపై దృష్టి పెట్టాలి
- రెసిడెన్షియల్ హాస్టళ్లలో సీసీ కెమెరాలు పెట్టండి
- శాంతి భద్రతలపై సమీక్షలో డిప్యూటీ సీఎం పవన్

అమరావతి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతి భద్రతలను మరింత పటిష్ఠం చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. మహిళా రక్షణపై మరింత దృష్టిపెట్టాలని, మహిళలకు ప్రభుత్వం ఉందన్న భరోసా కల్పించాలని పేర్కొన్నారు. దీనిపై పోలీసులకు ఒక లక్ష్యాన్ని నిర్దేశించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ హాస్టళ్లలో దాదాపు 2 లక్షల మంది పిల్లలున్నారని, వారి భద్రతకు అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మంగళవారం కలెక్టర్ల సదస్సులో భాగంగా శాంతి భద్రతలపై జరిగిన సమీక్షలో ఆయన పలు అంశాలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువచ్చారు. రెసిడెన్షియల్ హాస్టళ్లలో చాలా క్రైమ్ జరుగుతోందని, పిల్లల సంరక్షణ నిమిత్తం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై సాంఘిక సంక్షేమ కార్యదర్శి ఎం.ఎం.నాయక్ స్పందిస్తూ.. పాఠశాలల్లో కెమెరాలు పెట్టామని, హాస్టళ్లలో కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, త్వరగా చేస్తామని చెప్పారు. సినిమాల ప్రభావం ఎక్కువగా ఉండే కోనసీమలో కుల సమస్యలు ఉన్నాయని, ఫ్యాన్స్ ఫ్లెక్సీల గొడవలు కూడా అధికంగా ఉన్నాయని, వీటిపై పోలీసు వ్యవస్థ బలంగా పనిచేయాలని పవన్ సూచించారు. సంఘ వ్యతిరేక కార్యకలాపాలను నిరోధించేందుకు ఒక బలమైన పాలసీ తీసుకురావాలని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో మతపరమైన కార్యక్రమాల్లో శబ్ద కాలుష్యం ఎక్కువైందని, దీనిపై అందరికీ తగిన మార్గదర్శకాలు విడుదల చేయాలన్నారు.



సుగాలి ప్రీతి కేసు పరిష్కారానికి చర్యలు

సుగాలి ప్రీతి కేసు విషయంలో సరైన పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలని, ఆ దిశగా మార్గనిర్దేశం చేయాలని పవన్ కోరారు. రాష్ట్రంలో గంజాయి బెడద ఇంకా పూరిస్థాయిలో తగ్గలేదన్నారు. వైజాగ్ వెళ్లినపుడు అధికారులు గంజాయి గురించి చెబుతున్నారని, స్కూల్ పిల్లలకు కూడా అందుబాటులో ఉంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. వైజాగ్ పోర్టులో దొరికిన రూ.270 కోట్ల విలువైన హెరాయిన్ కేసుపై దృష్టి పెట్టాలని కోరారు. దాని లింకులు విజయవాడలోని సత్యనారాయణపురంలో ఉన్నట్లు తెలిసిందన్నారు. దీనిపై ఆ తర్వాత విచారణ జరగలేదన్నారు. సున్నితమైన అంశాల్లో లాజికల్‌గా వెళ్లాలని, సుగాలి ప్రీతి కేసును ఎప్పుడో సీబీఐకి ఇవ్వాల్సిందని, ఆలస్యంగానైనా అప్పగించామని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా అన్నారు. హెరాయిన్ కేసుపై వెంటనే సమీక్ష చేయాలని విజయవాడ కమిషనర్‌ను ఆదేశించారు.

ఉద్యమంలా స్వచ్ఛాంధ్ర

- జనవరి నుంచి వ్యర్థం అనేది కనిపించకూడదు
- నేటినుంచి వచ్చేనెల 2 వరకూ 'స్వచ్ఛతా హీ సేవ'
- కలెక్టర్ల సమావేశంలో సీఎం ఆదేశాలు

అమరావతి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఉద్యమ స్ఫూర్తితో కొనసాగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన రెండో రోజు కలెక్టర్ల సమావేశంలో స్వచ్ఛాంధ్ర, సర్క్యులర్ ఎకానమీ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ జనవరి నుంచి వ్యర్థం అనేది ఎక్కడా కనిపించకూడదని స్పష్టం చేశారు. 83 లక్షల టన్నుల లెగసీ వేస్ట్ (గతంలో పేరుకుపోయిన వ్యర్థాలు) శుభ్రం చేశామని, చెత్తపై పన్ను కూడా రద్దు చేశామని తెలిపారు. స్వచ్ఛభారత్ కోసం ఏ జిల్లాలో పైలట్ ప్రాజెక్టు చేపట్టినా దాన్ని అది రాష్ట్రమంతా వర్తింపచేయాలని ఆదేశించారు. స్వచ్ఛత అంటే పరిశుభ్రత పాటించేలా చూడటమే కాదని, ప్రజల ఆలోచనా విధానం కూడా మారేలా చూడాలని సూచించారు. ఇంట్లో చెత్తను డ్రెయిన్లలో వేయడం వల్ల ప్రవాహానికి ఇబ్బందిగా మారుతుందని, ఇలాంటి అలవాట్లకు ప్రజలు దూరంగా ఉండేలా చూడాలని కోరారు. ఎలాంటి కార్యక్రమమైనా ప్రజల భాగస్వామ్యం ఉంటే విజయవంతం అవుతుందని అన్నారు. ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వరకు 'స్వచ్ఛతా హీ సేవ' చేపట్టాలని చంద్రబాబు ఆదేశించారు.

చేతి వృత్తులకు చేయూత

"మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలైన ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలకు అవసరమైన కలప కోసం చెట్లు పెంచడానికి కలెక్టర్లు చర్యలు తీసుకోవాలి. చేతి వృత్తులను, కులవృత్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. గిరిజన, వెనుకబడిన ప్రాంతాల్లో వెదురుతో చేసే ఉత్పత్తుల కోసం ఓ కార్యక్రమాన్ని రూపొందించాలి. వెదురు ఉత్పత్తులు చేసేవారికి వెదురును సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలి. ఉపాధి హామీ పథకం కింద ఘనవ్యర్థాల షెడ్ల నిర్మాణానికి కేంద్రానికి లేఖ రాద్దాం. సీసీ రోడ్ల నిర్మాణం సమయంలో కాలువల కోసం మళ్లీ తవ్వకుండా ముందుగానే పైపులైను పెట్టేలా నిర్మాణం చేపట్టాలి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు ఉన్నా.. డ్రైయిన్లు సరిగ్గా లేవు. ఇలాంటి చోట్ల మేజిక్ డ్రైన్లు నిర్మించాలి. అత్యవసర పనులకు నిధులు తక్షణం మంజూరు చేస్తాం' అని సీఎం స్పష్టం చేశారు. ఏజెన్సీ ప్రాంతాలను అర్బన్ సౌకర్యాలతో మోడల్ పంచాయతీలుగా తీర్చిదిద్దాలని పంచాయతీరాజ్ అధికారులకు ఆయన సూచించారు

సారు మారారు!

టైమ్ కీపర్ అవతారం ఎత్తిన బాబు

- అతి ప్రసంగాలకు ఆదిలోనే చెక్
- సూటిగా ప్రభుత్వ ప్రాధాన్యాల వివరణ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రానికి ఏం కావాలో.... ప్రజలకు ఏం చేయాలో.... తనేం కోరుకుంటున్నారో అధికారులకు వివరించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సారి పర్‌ఫెక్ట్ అనిపించుకున్నారు. ఇదివరకటి కలెక్టర్ల సదస్సుల్లోలా... సాగదీతలు, చెప్పిందే చెప్పడం, సుదీర్ఘ ప్రసంగాలను పక్కనపెట్టారు. చెప్పాల్సింది చాలా స్పష్టంగా చెప్పారు. కలెక్టర్లు, ఎస్పీలు, శాఖల కార్యదర్శులు, విభాగాధిపతులు ఏం చేయాలో దిశానిర్దేశం చేశారు. అన్నింటికంటే ముఖ్యమైన విషయం...ఎప్పుడో జమానాకాలం నాటి రిపోర్టులు, ప్రజంటేషన్లు కాలదోషం పట్టాయని, ఇక వాటి జోలికి వెళ్లనని స్పష్టం చేయడం ఈ సమావేశాల్లో హైలెట్ అంశం. ప్రజలకు మెరుగైన సేవలు సకాలంలో సత్వరమే అందాలి. ప్రతి పనికీ ఆఫీసుల చుట్టూ ప్రజలు తిరగడానికి వీల్లేదని స్పష్టం చేస్తూ, అందుకు అవసరమైన రియల్‌టైమ్ గవర్నెన్స్ సేవల గురించి దిశానిర్దేశం చేశారు. టెక్నాలజీ వాడకం గురించి బోధించారు. చంద్రబాబు అనగానే కంప్యూటర్, ఆన్‌లైన్, ఇంటర్నెట్ సేవలు అని అంటుంటారు. ఆయన తీరే అంత అని చెబుతుంటారు. కానీ టెక్నాలజీ వినియోగంతో పౌరసేవల్లో రాబోయే మార్పులు, ప్రభుత్వ పాలనావ్యవహారాల్లో ఇప్పటికే వచ్చిన నూతన ధోరణులు, పోకడల గురించి ఆయన సవివరంగా చెప్పారు. చాలామంది నవయువ ఐఏఎస్‌లు ఉండటం కూడా ఆయనకు ఈసారి కలిసొచ్చింది. సాంకేతికంగా ఉన్నత విద్యావంతులైన కలెక్టర్లను ప్రశంసిస్తూనే, వారిద్వారా పరిపాలనలో తీసుకురాబోయే సంస్కరణల గురించి చెప్పారు. కలెక్టర్లు, అధికారుల్లో భరోసా ఇచ్చేందుకు ఆయన మరో అడుగు ముందుకేసి... 'ఇది నా టీమ్, యంగ్‌టీమ్..' అంటూ పలు సందర్భాల్లో వారిలో కొత్త ఉత్సాహం తీసుకొచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం, టెక్నాలజీ వాడుకోవడం, ఉత్తమ ఫలితాలు రాబట్టడానికి ఉన్న మార్గాలపై ఆయన సునిశితంగా చెప్పడం ఇటు సీనియర్ ఐఏఎస్‌లను కూడా ఆకర్షించింది. టెక్నాలజీలో ఉన్నతంగా ఉన్న అధికారులను సైతం ముఖ్యమంత్రి పలు అంశాలపై లేవనెత్తిన సాంకేతిక సందేహాలను ఆలోచింపచేసింది. సమావేశం ఆరంభం నుంచే చంద్రబాబు పూర్తిస్థాయి టైమింగ్‌ను ప్రదర్శించారు. "గతంలో అనేక అజెండాలు, చర్చనీయాంశాలు ఉండేవి. చర్చల సందర్భంగా కొన్ని సందర్భాల్లో ఫోకస్ పక్కకు పోయేది. ఈ సారి అలా జరగడానికి వీల్లేదు. ప్రజంటేషన్‌లకే పరిమితం కావాలి. అంతకు మించి మరే చర్చ అవసరం లేదు. సమయానికి మించి ఎవరూ మాట్లాడొద్దు. అనవసర విషయాలపై మనసు మళ్లొద్దు" అంటూ కార్యదర్శులు, కలెక్టర్‌లకు గీతోపదేశం చేశారు. ఎవరైనా ఇచ్చిన టైమ్‌కన్నా ఎక్కువగా ప్రజంటేషన్ ఇస్తుంటే సీఎస్ బెల్లుకొట్టి సమయం గుర్తుచేస్తారు. ఈ సారి సీఎంనే ఆపాత్ర పోషించారు.

'ఇది నా టీమ్..' అంటూ..

అధికారుల్లో ఉత్సాహం, నూతనోత్తేజం తీసుకొచ్చేందుకు చంద్రబాబు స్ఫూర్తిదాయకంగా అనేక అంశాలు చెప్పారు. ఇకపై పీపీటీలు, రిపోర్టుల రూపంలో కలెక్టర్లపై భారం ఉండదని ప్రకటించారు. ఇది నిజంగా ఇటు ప్రభుత్వానికి, అటు కలెక్టర్‌లకు మేలుచేసే పెద్ద నిర్ణయం. ఆయా శాఖల పురోగతి, పనితీరు ఫలితాలన్నీ ఆన్‌లైన్ పరిధిలోకి తీసుకురావాలని దిశానిర్దేశం చేశారు. కలెక్టర్లు ప్రజల్లోకి వెళ్లాలని సీఎం పిలుపునిచ్చారు. ప్రజలతో కలిసి పనిచేయడమే కలెక్టర్ల పనితీరుకు గీటురాయిగా ఉంటుందని చెప్పడం ద్వారా వారికి గ్రామాల సందర్శన ప్రాధాన్యతను వివరించారు. సంక్షేమ హాస్టళ్ల తనిఖీ వంటి కీలక బాధ్యత అనేది వారి డ్యూటీచార్ట్‌లో పెట్టి సీఎం సంచలన నిర్ణయం తీసుకున్నారు.

అప్పట్లో...

గతంలో సీఎం చంద్రబాబు సారథ్యంలో సమావేశాలు ఉదయం 10 గంటలకు ప్రారంభమై రాత్రి 10-12 గంటలపాటు సాగేవి. ఒక్కో శాఖ వందల పేజీల ప్రజంటేషన్ ఇచ్చేది. సగటున ఒక శాఖకు 30 నిమిషాలు ఇచ్చినా రెండున్నర గంటలు ప్రజంటేషన్‌లు ఇచ్చిన సందర్భాలున్నాయి. దీంతో సమయపాలన ఉండేదికాదు. సాయంత్రం నాలుగైదు గంటలకే ముగియాల్సిన సెషన్ అర్ధరాత్రిదాకా సాగిన సందర్భాలు కోకొల్లలు. ఈ పరిస్థితిని మీడియా, అధికారులు సీఎంకు నివేదించారు. ఎంత సుదీర్ఘ సమావేశాలు జరిగాయన్నది ముఖ్యంకాదు...ఎంత ఉపయోగకరమైనచర్చ జరిగిందన్నదే కీలకమని సీఎంకూడా గుర్తించారు. కలెక్టర్ల సదస్సులో 'మారిన చంద్రబాబు'ను చూసి అందరూ గొప్ప రిలీఫ్ పొందారు. తొలి రోజు 8గంటలకు, రెండోరోజు సాయంత్రం 5 గంటలకే సమావేశం ముగించారు.

"రూ అర్బన్'గా మార్చండి..

"కొన్ని గ్రామాలను మున్సిపాలిటీగామార్చే అవకాశం ఉంటే.. మార్పు చేయండి. కొన్ని పంచాయతీలను మోడల్ పంచాయతీలుగా మార్చండి. కలాం ఫిలాసఫీ 'రూ అర్బన్'ను అమలుచేయండి." అని చంద్రబాబు నిర్దేశించారు.

దశ దిశ



కలెక్టర్లు, ఎస్పీల సదస్సుకు హాజరైన అధికారులు

కలెక్టర్లు, ఎస్పీల సదస్సులో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, సీఎస్ కె. విజయానంద్

కొండపల్లి బొమ్మలను కాపాడుదాం -చంద్రబాబు



'కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు మన సంస్కృతీ సంప్రదాయాలు. వాటిని కాపాడుకోవాలి' అని సీఎం చంద్రబాబు చెప్పారు. జిల్లా కలెక్టర్ల సదస్సు రెండో రోజున కొండపల్లి బొమ్మల తయారీకి వాడే కలపకు అటవీ శాఖ నుంచి సమస్యలు వస్తున్నాయని, కొయ్య ధరలు పెరగడంతో కళాకారుల మనుగడకు ముప్పువాటిల్లుతోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ కొండపల్లి కొయ్యబొమ్మలు, ఏటికొప్పాక కళాకృతులను సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అటవీ శాఖతో మాట్లాడి కళాకారులకు తక్కువ ధరకు కలప అందేలా చూడాలని ఆదేశించారు. బొమ్మల తయారీకి వాడే కలప మొక్కలను ప్రైవేటు భూముల్లోనూ పెంచే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు.

నేడు విశాఖకు చంద్రబాబు

» 'నారీ-సశక్తి' అభియాన్‌కు హాజరు

అమరావతి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో నిర్వహిస్తున్న 'స్వస్థ్ నారీ - సశక్తి పరివార్ అభియాన్' కార్యక్రమలో పాల్గొనడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం విశాఖకు వెళ్లనున్నారు. ఉదయం 11.35 గంటలకు ఆయన నగరానికి చేరుకుంటారు. ఆంధ్ర వర్సిటీ సాగరిక ఫంక్షన్ హాల్ హెల్త్ క్యాంపులను సీఎం సందర్శిస్తారు. ఆ తర్వాత 12 గంటలకు ఆంధ్ర విశ్వవిద్యాలయం కన్వెన్షన్ సెంటర్‌లో ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించే మహిళా ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటలకు రాడిసన్ బ్లూ హోటల్లో గ్లోబల్ కేపబులిటీ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బిజినెస్ సమ్మిట్లో సీఎం పాల్గొంటారు.

జనవరికల్లా రెండు క్వాంటమ్ కంప్యూటర్లు

» ఆర్టీజీఎస్‌కు మెరికల్లాంటి యువ అధికారులు: సీఎం చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అమరావతి క్వాంటమ్ వ్యాలీలో ప్రముఖ ఐబీఎం సంస్థ వచ్చే జనవరి కల్లా రెండు క్వాంటమ్ కంప్యూటర్లు ఏర్పాటు చేయనుందని, 2027 నాటికి మరో మూడు కంప్యూటర్లను అందుబాటులోకి తీసుకొస్తుందని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్), ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల కార్యదర్శి కాటంనేని భాస్కర్ తెలిపారు. వెలగపూడి సచివాలయంలో జరిగిన కలెక్టర్ల సదస్సు రెండో రోజైన మంగళవారం ఆయన అమరావతి క్వాంటమ్ వ్యాలీకి సంబంధించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఏపీని క్వాంటమ్ కంప్యూటింగ్‌కు హబ్‌గా మార్చే దిశగా పనిచేస్తున్నామని, దీనికోసం రెండు దశల రోడ్ మ్యాప్ రూపొందించామని చెప్పారు. 2030 నాటికల్లా అమరావతి క్వాంటమ్ వ్యాలీ నుంచి ఏటా రూ.5వేల కోట్ల మేర క్వాంటమ్ హార్డ్‌వేర్ ఎగుమతులు సాధించడమే తమ లక్ష్యమన్నారు. రూ.1000 కోట్ల ప్రోత్సాహకాలతో క్వాంటమ్ వ్యాలీలో 100 స్టార్టప్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. క్వాంటమ్ వ్యాలీ రాకతో రాష్ట్రంలో నిర్మాణాత్మక మార్పులు చోటుచేసుకుంటాయని చెప్పారు. జిల్లాల్లో క్వాంటమ్ కంప్యూటింగ్ రాయబారులు కలెక్టర్లేనని అన్నారు. రాజధానిలో 50 ఎకరాల్లో అమరావతి క్వాంటమ్ వ్యాలీని ఏర్పాటు చేస్తున్నామని, ఇందుకోసం సీఆర్‌డీఏ భూమిని కేటాయించిందని చెప్పారు. భవన నిర్మాణానికి సంబంధించిన డిజైన్లను కూడా సిద్ధం చేశామన్నారు. ఇక్కడ దాదాపు 90 వేల మంది వరకు పనిచేయవచ్చని చెప్పారు. క్వాంటమ్ వ్యాలీకి ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి ప్రఖ్యాత సంస్థలు ముందుకొచ్చాయని తెలిపారు. రియల్‌టైమ్ గవర్నెన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగాల్లో భాగమైన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సీఈవోగా 2020 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి పి.ధాత్రిరెడ్డిని, ఫైబర్‌నెట్ ఎండీగా గీతాంజలి శర్మను, డ్రోన్ కార్పొరేషన్ ఎండీగా సౌర్యమాన్ పటేల్‌ను నియమించామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. వీరంతా మెరికల్లాంటి యువ ఐఏఎస్ అధికారులని ప్రశంసించారు. అమరావతిలో నిర్మించే క్వాంటమ్ వ్యాలీ భవన డిజైన్లను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసించారు.

ఏకపక్షంగా ఎలా కొట్టేస్తారు?


(మొదటి పేజీ తరువాయి)

కొట్టేస్తారని నిలదీసింది. చట్టాలను మరీ ఇంత దారుణంగా అన్వయించుకుంటారా అని అసహనం వ్యక్తం చేసింది. కనీసం ఏ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.. దర్యాప్తులో ఏం జరుగుతోందో కూడా పట్టించుకోకపోతే ఎలాగని ఆక్షేపించింది. విజయవాడలోని ఏసీబీ సీఐయూ కార్యాలయాన్ని పోలీసు స్టేషన్‌గా నోటిఫై చేయలేదని.. దీనిపై ప్రభుత్వం ఎలాంటి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయలేదని పేర్కొంటూ.. అక్కడ నమోదైన 13 ఎఫ్ఐఆర్‌లను రద్దు చేస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్. హరినాథ్ ఇటీవల తీర్పు ఇచ్చారు. దీనిని ఏసీబీ ఈ నెల 12న సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఆ పిటిషన్‌పై మంగళవారం జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ సతీశ్‌చంద్రశర్మతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. హైకోర్టు రద్దు చేసిన 13 ఎఫ్ఐఆర్‌లపై తదుపరి దర్యాప్తు కొనసాగించవచ్చని, చార్జిషీట్లు కూడా దాఖలు చేయవచ్చని స్పష్టం చేసింది. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు మరే కేసుకూ వర్తించవని చెబుతూ.. తదుపరి విచారణను ఆరువారాలకు వాయిదా వేసింది. ప్రతివాదులుగా ఉన్న 13 మంది.. దాయం పెద రంగారావు, రాచూరి శివరావు, ముమ్మన రాజేశ్వరరావు, రాంపల్లి సత్య ఫణి దత్తాత్రేయ దివాకర్, గేదెల రాజశేఖర్, గేదెల లక్ష్మీజ్ఞానేశ్వర్‌రావు, సరగదం వెంకటరావు, భట్టు హనుమంతరావు, దొడ్డపనేని వెంకయ్యనాయుడు, బి.సంజీవయ్య, కరణం వెంకట రంగ సాయికుమార్, జీఎం వెంకట నారాయణలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది.

వాటిని హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదు: లూథ్రా

అంతకుముందు.. ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. రాష్ట్ర విభజనకు ముందు హైదరాబాద్ కేంద్రంగా సెంట్రల్ ఇన్వెస్టిగేటివ్ యూనిట్ పని చేసిందని, దీని పరిధి రాష్ట్రమంతా ఉందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర విభజన తర్వాత.. అదే యూనిట్ విజయవాడ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్నట్లు తెలిపారు. 'ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న చట్టాలు, నోటిఫికేషన్లు తర్వాత కూడా అమల్లోనే ఉంటాయని విభజన చట్టంలో స్పష్టంగా పొందుపరిచారు. గతంలో.. పంజాబ్, బిహార్ రాష్ట్రాల విభజన కేసుల్లో సుప్రీంకోర్టు ఇటువంటి తీర్పులే ఇచ్చింది' అని తెలిపారు. ఆ తీర్పుల వివరాలను న్యాయస్థానం ముందుంచారు. హైదరాబాద్‌లో ఉన్న ఇన్వెస్టిగేటివ్ యూనిట్‌ను విజయవాడకు తరలించిన తర్వాత.. పోలీసు స్టేషన్ హోదా గురించి ప్రత్యేకంగా నోటిఫికేషన్ ఇవ్వాల్సిన అవసరం లేదని.. విజయవాడలో యూనిట్ ఏర్పాటు చేసిన తదుపరి.. కార్యకలాపాలు సాగించేందుకు ప్రత్యేకంగా నోటిఫై చేయాల్సిన అవసరం లేదని.. ఈ అంశాలను హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లో ఉన్నప్పుడు ఉన్న అధికారాలే విజయవాడకు తరలిన తర్వాతా కొనసాగుతారని గుర్తు చేశారు. సాంకేతిక కారణాలు చూపి ఎఫ్ఐఆర్‌లను కొట్టివేయాలని కోరలేరని తెలిపారు. 'ఏసీబీ విభాగంలోని జాయింట్ డైరెక్టర్ల కార్యాలయాలను పోలీసు స్టేషన్లుగా గుర్తిస్తూ 2003లో ప్రభుత్వం జీవో ఇచ్చింది. విభజన చట్టంలోని 101, 102 సెక్షన్ల ప్రకారం.. రాష్ట్ర విభజన అనంతరం ఆ చట్టాలు అమల్లో ఉంటాయి. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులను పట్టించుకోకుండా హైకోర్టు ఏకపక్షంగా తీర్పు ఇచ్చింది' అని పేర్కొన్నారు. ఆ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం... హైకోర్టు తీర్పుపై పై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

సంతృప్తి పెరగాలి!



పెన్షన్ల పంపిణీకి డబ్బుల డిమాండ్.. దీపం-2 పథకంలో కూడా ఇంతే

» ప్రసాదాల్లో నాణ్యతపై 76 శాతం సంతృప్తి
» రెవెన్యూ సర్వేలో అనేక సమస్యలు
» ఇసుక అందుబాటుపై 65.6% సంతృప్తి
» ఆర్టీజీఎస్ సర్వే వివరాలు వెల్లడి

అమరావతి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వివిధ పథకాల అమలుపై ప్రజల్లో సంతృప్తి శాతం మరింత పెరగాలని స్పష్టమైంది. ప్రభుత్వ పథకాలు, సేవలపై ప్రభుత్వం రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) సర్వే చేపట్టింది. ఆ వివరాలను ఆర్టీజీఎస్ అధికారులు కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబుకు వివరించారు. పెన్షన్ల పంపిణీలో గత త్రైమాసికం(ఏప్రిల్-మే-జూన్)లో 12.9 శాతం అవినీతి ఉందని.. ప్రస్తుత త్రైమాసికం(జూలై-ఆగస్టు-సెప్టెంబరు)లో కూడా 12.5 శాతం వరకూ ఉన్నట్లు సర్వేలో తేలింది. గత త్రైమాసికంలో 89.4 శాతం మంది ఇంటికి వచ్చి పెన్షన్ ఇచ్చారని చెబితే.. ఈ క్వార్టర్‌లో 90.5 శాతం మందికి ఇంటి వద్ద పెన్షన్ అందినట్లు స్పష్టమైంది. దీపం-2 పథకంలో అదనంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని మొదటి త్రైమాసికంలో 38.4 శాతం మంది తెలిపారు. ప్రస్తుత క్వార్టర్‌లో అది 39 శాతానికి పెరిగింది. నడుస్తున్న త్రైమాసికంలో మహిళలపై బహిరంగ ప్రదేశాల్లో వేధింపులు జరుగుతున్నట్లు 25.6 శాతం మంది చెప్పగా.. వేధింపులు లేవని 74.4 శాతం మంది తెలిపారు. అలాగే మహిళలపై వేధింపుల సమయంలో పోలీసుల స్పందన 65 శాతం కేసుల్లో బాగుందని.. 34 శాతం కేసుల్లో సక్రమంగా స్పందించలేదని తేలింది.

- గత క్వార్టర్‌లో అధికారుల ప్రవర్తన బాగుందని 86.7% మంది చెప్పగా.. ఈ క్వార్టర్‌లో కూడా 87.7% మంది బాగుందన్నారు.
- ఆలయాల్లో ప్రసాదాల నాణ్యత బాగుందని గత ఏడాది 77%మంది చెప్పగా ఈ ఏడాది 76% మందే బాగుందన్నారు.
- తాజా త్రైమాసికంలో రైతులకు అవసరమైన విత్తనాలు 65 శాతం మందికే అందాయి. 35 శాతం మందికి అందలేదు. నాణ్యత విషయంలో తేడా కనిపించింది. 63% మంది నాణ్యత బాగుందని, 37 శాతం మంది బాగోలేదని చెప్పారు.
- ప్రస్తుత క్వార్టర్‌లో.. తమ ప్రాంతాల్లో గంజాయి సమస్య ఉందని 27 శాతం మంది సర్వేలో చెప్పారు. లేదని 73 శాతం మంది తెలిపారు. ఈ విషయంలో పోలీసు స్పందన బాగుందని 57 %, బాగోలేదని 42% మంది స్పష్టం చేశారు.

రెవెన్యూ సర్వే సమస్యలు జటిలం

రెవెన్యూ శాఖపై సర్వేలో దారుణమైన ఫలితాలు వచ్చాయి. సర్వే కోసం దరఖాస్తు పెట్టుకున్నప్పటి నుంచి అది పూర్తయ్యేవరకు వరకూ అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు ప్రజలు తెలిపారు. సర్వేకు వచ్చే ముందు అధికారులు సమాచారం ఇస్తున్నారా అని ప్రశ్నించగా.. ఇస్తున్నారని 55% మంది.. లేదని 44% మంది చెప్పారు. భూమిని సర్వేయర్ సర్వే చేస్తున్నారా అని అడిగితే.. చేస్తున్నారని 54.8 శాతం మంది.. లేదని 45.2 శాతం మంది బదులిచ్చారు. మరోవైపు సర్వే సమయంలో అవినీతి కూడా బాగా పెరిగినట్లు తేలింది. అదనంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని 34.8 శాతం మంది వెల్లడించారు.

- ఇసుక అందుబాటులో ఉంటోందని 65.6 శాతం మంది, లేదని 34.4 శాతం మంది వెల్లడించారు. తక్కువ ధరకు దొరుకుతోందా అని ప్రశ్నించగా.. 55.5 శాతం మంది అవునని.. 44.5 శాతం మంది లేదని సమాధానమిచ్చారు. ఇసుకను నిర్మాణ పనులకే ఉపయోగిస్తున్నారా అని ప్రశ్నిస్తే.. 65.3 శాతం మంది అవునని.. 34.7 శాతం మంది కాదని తెలిపారు. ఆర్టీజీఎస్ సర్వేల్లో 95 శాతం సంతృప్తి కనిపించాలని సీఎం చెబుతున్నారు. ఇందుకోసం అధికారుల పనితీరు మెరుగుపడాలని ఆయన సదస్సులో సూచించారు.

సత్యకుమార్‌తో కేక్ కట్ చేయించిన సీఎం

మంత్రి సత్యకుమార్‌కు ముఖ్యమంత్రి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళవారం ఆయన పుట్టినరోజు కావడంతో కలెక్టర్ల సదస్సులో భోజన విరామ సమయంలో చంద్రబాబు ఆయనతో కేక్ కట్ చేయించి తినిపించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి, అనిత, అచ్చెన్నాయుడు, బీసీ జనార్దన్‌రెడ్డి తదితర మంత్రులు, సీఎస్ విజయానంద్, సీఎం ముఖ్య కార్యదర్శి రవిచంద్ర, ఇతర అధికారులు కూడా ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమం సుపరిపాలన

"అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన... మా ఫోకస్ పాయింట్లు. సంపద సృష్టించాలి. ఆ సంపదతో సంక్షేమాన్ని అందరికీ వర్తింపచేయాలి. సంక్షేమం చివరి మైలురాయి వరకు చేరుకోవాలి. రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు రాబోతున్నాయి. పీపీపీ విధానంలో రోడ్లు, ఎయిర్‌పోర్టులు, పోర్టులు, హార్బర్లు, పరిశ్రమలు, ఇతర ప్రాజెక్టులు వస్తాయి. పెట్టుబడులు పెట్టే వ్యక్తికి ఈ రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయనీ, తమకు ఏ సమస్యా ఉండదన్న భరోసా మనం ఇవ్వాలి." - చంద్రబాబు

15% వృద్ధిరేటే ప్రభుత్వ లక్ష్యం

3 నెలల్లో గొప్ప మార్పు కనిపించాలి: చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): "రాష్ట్రంలో చాలా ఆశాజనకమైన ప్లాన్ పెట్టుకున్నాం. అభివృద్ధి జరగాలంటే సంపద సృష్టించాలి. 7.5 శాతంగా ఉన్న గ్రోత్ రేటును 15 శాతానికి తీసుకెళ్లాలి. వీలైనమేరకు ఉద్యోగాలను సృష్టించాలి. శాంతిభద్రతలు పూర్తిగా అదుపులో ఉండాలి. సుపరిపాలన సాధనకు ఇవే మా లక్ష్యాలు. వీటిని సీరియస్‌గా తీసుకొని పనిచేయండి" అని జిల్లా కలెక్టర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. మంగళవారం కలెక్టర్ల సదస్సులో భాగంగా శాంతిభద్రతలపై జిల్లా ఎస్పీలు, పోలీసు ఉన్నతాధికారులతో సమీక్ష చేశారు. అనంతరం చంద్రబాబు కలెక్టర్లను ఉద్దేశించి మాట్లాడారు. కలెక్టర్లు తమ శక్తిసామర్థ్యాలతో వీలైనన్ని ఉద్యోగాలు సృష్టించాలని, దీనివల్ల సమాజంలో సంతృప్తిస్థాయి పెరుగుతుందని చెప్పారు. అదే జరిగితే శాంతిభద్రతలు కూడా అదుపులో ఉంటాయన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. 'వ్యాధులు, రోగాలపై ప్రజల్లో అవగాహన పెరగాలి. ఈ రంగంపై ఖర్చు కనీసం 30శాతం తగ్గితే అనేక మార్పులు వస్తాయి. ఆరోగ్యరంగంలో 'సంజీవని' గేమ్‌చేంజర్ కానుంది" అని అన్నారు. సోలార్ విద్యుత్ వినియోగం రానున్నరోజుల్లో పెరగనుందని, పోలీసులు కూడా తమ ఆఫీసుల్లో సోలార్ పలకలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇంకా ఏమన్నారంటే..

టెక్నాలజీయే గేమ్ చేంజర్

"ప్రభుత్వం, అధికారుల పనితీరుకు సంబంధించిన ప్రగతి నివేదికలను ప్రతి సోమవారం రెండున్నర గంటలపాటు పరిశీలిస్తాను. మీరు కూడా అన్ని రకాల డేటాను దగ్గరపెట్టుకొని పరిశీలన చేయండి. హార్డ్‌వర్క్ కాదు..స్మార్ట్ వర్క్ చేయండి. ఇప్పుడు టెక్నాలజీనే గేమ్ చేంజర్. దాన్ని సాధ్యమైనంత మేరకు వాడుకొని ఫలితాలు పొందండి."

యంగ్‌టీమ్‌తో తొలిసారి పనిచేస్తున్నా

"గతంలో డీజీపీ, సీఎస్, ఆ స్థాయి సీనియర్ అధికారులతో పనిచేశాను. కానీ ఈ సారి యంగ్ టీమ్‌తో పనిచేస్తున్నాను. ఇప్పుడు యంగ్ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులతో మాట్లాడుతున్నా. కిందిస్థాయిలో వారిని కూడా గైడ్‌చేయగలిగితే వారు మరింత గొప్ప వనరుగా మారగలరని నమ్మకం. అందుకే వారితో మాట్లాడేందుకు ఎక్కువ సమయం కేటాయిస్తున్నా. ఇప్పుడున్న యంగ్ ఐఏఎస్‌లు 2055 వరకు పనిచేస్తారు. అప్పటికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లవుతుంది. జాతి నిర్మాణంలో గొప్పగా పాల్గొనాలి. ఇటీవల కలెక్టర్లు, ఎస్పీల బదిలీలతో సరైన పోస్టుకు సరైన అధికారిని ఎంపిక చేసే విధానం అమలు చేశాం. త్వరలో జరిగే బదిలీల్లో కూడా ఇదే విధానం."

ఇది అద్భుతమైన మీటింగ్

"కలెక్టర్ల సమావేశం అద్భుతమైన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీలది బెస్ట్ టీమ్. అనుకున్న ఫలితాలు సాధిస్తామన్న నమ్మకం కుదిరింది. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలను సీరియస్‌గా తీసుకొని పనిచేయండి. వచ్చే మూడు నెలల్లో క్వాంటమ్ చేంజ్ కనిపించాలి. మనం మళ్లీ కలిసేలోపల గణనీయంగా శాంతిభద్రతలు మెరుగవ్వాలి."

నెహ్రూ ఓ ఫ్యూడల్: సీఎం

"సింగపూర్, భారత్‌కు కొద్ది సంవత్సరాల వ్యత్యాసంలో స్వాతంత్ర్యం వచ్చింది. సింగపూర్ ట్రేడ్‌యూనియర్ నేత లీక్ లీ కాన్ పోటీదారీ ఆర్థిక విధానాలు ఆచరించారు. సింగపూర్‌ను అభివృద్ధి చేశారు. మనదేశంలో నెహ్రూ ఫ్యూడల్ (భూస్వామి). ఆయనకు బాగా డబ్బులున్నాయి. ఆయన సోషలిస్టు విధానాల కారణంగా 1947 నుంచి 1991 వరకు సింగపూర్‌తో మనం పోటీపడలేకపోయాం. ఆర్థిక సంస్కరణలు వచ్చాకే ముందుకు రాగలిగాం. ప్రధాని మోదీ వల్ల ప్రపంచంలోనే అతిపెద్ద ఎకానమీ దేశాల్లో నాలుగో స్థానంలో ఉన్నాం. మూడోస్థానానికి త్వరలో వస్తాం. 2038లో రెండో పెద్ద ఎకానమీగా ఎదుగుతాం."

'జీఎస్టీ' లబ్ధి ప్రజలకు అందాలి

8,000 కోట్ల మేర ప్రయోజనం

» నెల రోజులు అవగాహన కల్పించండి
» జీఎస్టీ, పన్ను ఆదాయాలు తగ్గకూడదు
» మైనింగ్ ఆదాయం కూడా పెరగాలి: సీఎం

అమరావతి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఈ నెల 22వ తేదీ నుంచి అమల్లోకి రానున్న జీఎస్టీ సవరణల వల్ల ప్రజలకు భారీగా లబ్ధి చేకూరుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. ఆ లబ్ధి కచ్చితంగా వారికి అందేలా చూడాలన్నారు. కలెక్టర్ల సదస్సులో రెండోరోజు మంగళవారం ఆయన మాట్లాడారు. జీఎస్టీ 2.0 సంస్కరణల వల్ల రాష్ట్ర ప్రజలకు రూ. 8,000 కోట్ల మేర ప్రయోజనాలు అందుతాయన్నారు. పన్నుల తగ్గింపునకు సంబంధించి ఈనెల 19వ తేదీన నోటిఫికేషన్లు జారీ చేయాలని చెప్పారు. ఏ వస్తువుకు ఎంత పన్ను తగ్గిందన్న అంశాలను గ్రామస్థాయి వరకూ ప్రజలకు తెలిసేలా ప్రకటనలు జారీ చేయాలని ఆదేశించారు. జీఎస్టీ పన్నుల తగ్గింపుపై సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 22 వరకు నెల రోజుల పాటు మంత్రులు, కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆదాయాలు తగ్గకుండా జిల్లా కలెక్టర్లు దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా మైనింగ్ ఆదాయంలో ఏ జిల్లాలు వెనుకంజలో ఉన్నాయో బేరీజు వేస్తామని, కొన్ని జిల్లాల్లో ఆదాయం భారీగా పడిపోవడానికి గల కారణాలు విశ్లేషించాలని చెప్పారు. జిల్లాలవారీగా మైనింగ్ ఆదాయం పెరగాలన్నారు. మైనింగ్ ఎక్కువ ఉన్నచోట విలువ జోడింపు చేయాలని సూచించారు. పరిశ్రమల శాఖతో కలిసి క్వార్ట్జ్ లాంటి ఖనిజాలకు విలువ జోడించేందుకు ప్రాజెక్టు ప్రారంభిస్తున్నామని, రూ. 20,000 కోట్ల విలువైన ప్రాజెక్టుతో 10,000 ఉద్యోగాలు వస్తాయని గనుల శాఖ మాజీ కమిషనర్ ప్రవీణ్ కుమార్ చెప్పారు.

ఉచిత ఇసుకపై సంతృప్తి పెరగాలి

ఉచిత ఇసుక విధానంలో ప్రజల్లో సంతృప్త స్థాయి పెరిగేలా చేయాలని సీఎం ఆదేశించారు. రూ.1,000 కోట్ల రెవెన్యూను కోల్పోయి ఉచిత ఇసుక అందిస్తున్నామని, అయినా జనంలో సంతృప్తి ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. రవాణా ఖర్చులు భరిస్తూ ఇసుక తీసుకెళ్లడానికి వచ్చిన వారిని అడ్డుకోవద్దని ఆదేశించారు. తిరుపతి ఎర్రచందనం డిపో వద్ద సీసీటీవీలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎర్రచందనం దుంగలతో వేంకటేశ్వరస్వామి బొమ్మలు, ఇతర కళాకృతులు చేసి కలప విలువను పెంచాలన్నారు. రాష్ట్రంలో మోటార్ వాహనాల పన్నులు ఎందుకు పెరగడం లేదో కారణాలు విశ్లేషించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. శాటిలైట్ చిత్రాల ఆధారంగా అక్రమకట్టడాలు గుర్తించే ప్రక్రియను మున్సిపల్ విభాగం చేపట్టాలని చెప్పారు.

పారదర్శకంగా ఎక్సైజ్

గత ప్రభుత్వంలో ఎక్సైజ్ శాఖలోనే అతిపెద్ద స్కాంచేశారని, తాము వచ్చాక ఈ శాఖను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని సీఎం చెప్పారు. ప్రొక్యూర్‌మెంట్, మాన్యుఫ్యాక్చరింగ్, విక్రయం వరకు అంతా పారదర్శకంగా జరగాలన్నారు. 100 శాతం డిజిటల్ చెల్లింపులే జరగాలని ఆదేశించారు. సరిహద్దు జిల్లాల్లో అమ్మకాలు 200 శాతం పుంజుకున్నాయని ఎక్సైజ్ ముఖ్య కార్యదర్శి మీనా వెల్లడించారు. దుకాణాలకు సరఫరా చేసే మద్యం ధరల కంటే బార్‌లకు సరఫరా చేసే మద్యం రేట్లు 15 శాతం ఎక్కువగా ఉండడం వల్ల బార్ పాలసీలో సమస్యలు వస్తున్నాయన్నారు. సమస్యలు పరిష్కరించి బార్ పాలసీని సవరించాలని సీఎం సూచించారు.

గత పాలకుల తప్పులతోనే భూ వివాదాలు

అభ్యంతరాల్లేని భూములను రెగ్యులరైజ్ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రెవెన్యూ విభాగానికి వచ్చే ఫిర్యాదుల్లో 70 శాతం ఆర్వోఆర్ ఫిర్యాదులే ఉన్నాయని చెప్పారు. గత పాలకుల తప్పులతో ఈ స్థాయిలో రెవెన్యూ, భూ వివాదాల ఫిర్యాదులు వచ్చాయన్నారు. 22ఏలో భూములు పెట్టడం వల్ల ఈ సమస్యలు తలెత్తాయని, రీసర్వే చేసి ఈ రికార్డులను నిర్దేశిత గడువులోగా అంటే 2027కి ముందే ప్రక్షాళన చేయాలని చెప్పారు. శాశ్వత ప్రాతిపదికన కుల ధ్రువీకరణ ఇవ్వాలని, నివాస, వయసు ధ్రువీకరణ కోసం ఏటా జారీ చేయొచ్చని చెప్పారు. సింహాచలం పంచగ్రామాల సమస్యను తక్షణం పరిష్కరించాలన్నారు. రెవెన్యూలో టెక్నాలజీ అనుసంధానం త్వరగా పూర్తిచేయాలని సీఎం ఆదేశించారు.

టీడీఎస్ లేకుంటే రాష్ట్ర ఖజానాకు
భారీగా నష్టం

» కలెక్టర్ల సదస్సులో వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమిషనర్

అమరావతి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించేటప్పుడు వారి నుంచి టీడీఎస్ వసూలు చేయకుండానే మొత్తం బిల్లు ఇచ్చేస్తున్నారని వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ బాబు.ఏ చెప్పారు. కలెక్టర్ల సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ఈ బిల్లులపై 18 శాతం పన్నును రాష్ట్రం నష్టపోతోందని వివరించారు. టీడీఎస్ మినహాయింపును పట్టించుకోకుండానే పంచాయతీరాజ్ డీడీవోలు బిల్లులు చెల్లిస్తున్నారని తెలిపారు. వృత్తిపన్ను లక్ష్యం రూ.1000 కోట్లలో సగం సాధించామని తెలిపారు. ప్రభుత్వ పనులకు అవసరమయ్యే డీజిల్, పెట్రోల్‌ను రాష్ట్రంలోనే కొనుగోలు చేయడానికి ఇచ్చిన జీవో వల్ల అదనంగా రూ.2 వేల కోట్ల రాబడి వస్తుందని చెప్పారు.

పొడి చెత్త నిర్వహణకు స్వచ్ఛ రథాలు

రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలను పరిశుభ్రంగా, పర్యావరణానికి అనుకూలంగా, సుస్థిరంగా మార్చేందుకు పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నామని పీఆర్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ కృష్ణతేజ అన్నారు. తడి వ్యర్థాలను కంపోస్టుగా మార్చేందుకు హౌస్‌హోల్డ్ కంపోస్టు పిట్‌లు, గోబర్ధన్ ప్రాజెక్టు కింద గోశాలల్లో బయోగ్యాస్ ఉత్పత్తి యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పొడి చెత్త నిర్వహణలో భాగంగా స్వచ్ఛ రథం మొబైల్ వాహనాలు గుంటూరు, ఎన్టీఆర్, తిరుపతి జిల్లాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించామని వివరించారు.

నాన్చొద్దు... తేల్చండి

(మొదటి పేజీ తరువాయి)

చూసుకుని వినియోగదారులు కొంటున్నారు. ఇదే విధంగా ప్రభుత్వసేవలకు కూడా ఎందుకు రేటింగ్ ఇవ్వకూడదు" అని సీఎం వ్యాఖ్యానించారు. ప్రభుత్వ సేవలపై ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తూ రేటింగ్ ఇస్తామని స్పష్టీకరించారు. కేంద్రం అధికారులకు పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైనవారికే పదోన్నతులు కల్పిస్తోందని, అదే విధానం రాష్ట్రంలో అమలుచేస్తామని తెలిపారు. కీలక శాఖల్లో నియామకాలకు ఐటీలో నైపుణ్యం కలిగిన వారికే ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ప్రజాసమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. "ఎవరైనా సమస్యపై దరఖాస్తు చేసుకుంటే కలెక్టర్లు, వారి నుంచి సెక్రటరీలు రిపోర్టులు అడుగుతున్నారని పత్రికల్లో కథనాలు వస్తున్నాయి. ఆర్టీజీఎస్‌లో ప్రభుత్వ సమాచారమంతా నిక్షిప్తమై ఉన్నప్పుడు మళ్లీ కింది నుంచి రిపోర్టులు కోరడం ఎందుకు? దానివల్ల కాలయాపన తప్పించి ఉపయోగం ఏముంది?" అంటూ రెవెన్యూ శాఖపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా కార్యాలయానికి రాకుండానే ప్రభుత్వ సేవలు అందించాలని భావిస్తుంటే.. రెవెన్యూ యంత్రాంగం మాత్రం కార్యాలయాలకు రావాలంటూ ప్రజలను ఇబ్బంది పెట్టడం ఏమిటని అసహనం వ్యక్తం చేశారు. మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌పై మంత్రులు, కలెక్టర్లకు వచ్చేనెలలో శిక్షణ అందిస్తామని తెలిపారు. నవంబరు నుంచి జిల్లాల్లో రియల్ టైమ్ గవర్నెన్స్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. వచ్చే కలెక్టర్ల సదస్సుకు సంబంధించిన అజెండా ఆర్టీజీఎస్ నుంచే వస్తుందని తెలిపారు. కొన్ని ప్రభుత్వ శాఖల పనితీరు ఇంకా మెరుగుపడాల్సి ఉందని, సీనియన్లు కూడా తమ పనిపద్ధతులను మార్చుకోవాలని స్పష్టం చేశారు. ఇకపై ఫైళ్లన్నీ ఆన్‌లైన్ విధానంలోనే ఉంటాయని, ఉత్తర్వులు కూడా ఆన్‌లైన్‌లోనే ఉంటాయని తెలిపారు. "ఫోరెన్సిక్ ఆడిటింగ్‌లాంటిది తీసుకొస్తాం. నెక్స్ట్ జెన్ టెక్నాలజీ ప్రవేశపెడతాం. అవేర్ వ్యవస్థ 42 రకాల సమాచారం కలెక్టర్లకు అందిస్తోంది. నవంబరులోగా డేటా లేక్ తీసుకువస్తాం. వచ్చే రెండేళ్లలో ఈ ఫలితాలను రాష్ట్రం చివరి అంచుల వరకు విస్తరిస్తాం. టెక్నాలజీ వినియోగంపై అక్టోబరులో మంత్రులు, అధికారులు, కలెక్టర్లకు శిక్షణ నిర్వహిస్తాం" అని తెలిపారు. టెక్నాలజీలో ఎకోసిస్టమ్ తెస్తామని ప్రకటించారు.

క్వాంటమ్‌వ్యాలీ భవనాలపై కలెక్టర్ల అభిప్రాయాల సేకరణ

క్వాంటమ్‌వ్యాలీ భవనాల నమూనాలపై సదస్సులో కలెక్టర్ల అభిప్రాయాలను ముఖ్యమంత్రి కోరారు. హైదరాబాద్ హైటెక్ సిటీ నిర్మాణ సమయంలో కొందరు వెల్లడించిన అభిప్రాయాలు, ఇప్పుడు క్వాంటమ్‌వ్యాలీపై వినిపించడం లేదని ఒక కలెక్టరు వ్యాఖ్యానించారు. క్వాంటమ్‌వ్యాలీ భవన నిర్మాణ డిజైన్లు అద్భుతంగా ఉన్నాయన్నారు. భవిష్యత్తులో మూడు వేల క్యూబిక్ క్వాంటమ్ కంప్యూటర్ల ఏర్పాటుకు వీలుగా కార్యాలయ స్థలాన్ని అమరావతిలో అందుబాటులోకి తీసుకువచ్చామని సీఎం వివరించారు. క్వాంటమ్ వ్యాలీలో 80వేల మంది పనిచేసేలా భవనాల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు.

‘ఫేక్’కు కేరాఫ్ వైసీపీ!

- అసత్య ప్రచారంలో సోషల్ సైకోల కొత్త పుంతలు
- విద్యుత్తు కోతలంటూ తప్పుడు ఐడీలతో దుష్ప్రచారం
- రాష్ట్రంలో కరెంటు కోతలే లేవంటున్న ట్రాన్స్‌కో అధికారులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఫేక్ ప్రచారాలకు వైసీపీ కేరాఫ్‌గా మారింది. ప్రజా జీవితాలను ప్రభావితం చేసే అంశాలపై తప్పుడు ప్రచారమే లక్ష్యంగా ఆ పార్టీ సోషల్ మీడియా సైకోలు రెచ్చిపోతున్నారు. రాజధాని ముంపు, యూరియా కొరత, పరిశ్రమలకు భూ కేటాయింపులు పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక... ఇలా అంశం ఏదైనా వీరు అలవోకగా ఫేక్ ప్రచారం చేసేస్తారు. తాజాగా విద్యుత్తు కోతల పేరుతో దుష్ప్రచారం ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా నెల రోజులుగా ఎలాంటి అవాంతరాలు లేకుండా విద్యుత్తు సరఫరా చేశామని ట్రాన్స్‌కో అధికారులు చెబుతున్నారు. కానీ వైసీపీ సోషల్ సైకోలు మాత్రం సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ఐడీలు సృష్టించి రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్తు కోతలు అమలవుతున్నాయని, దానివల్ల జనం జీవితాలు తల్లకిందులు అయిపోతున్నాయని గగ్గోలు పెడుతున్నారు. ‘మధ్యాహ్నం 2 గంటలకు జరగాల్సిన ఇంటర్వ్యూ కరెంటు లేదని రెండు సార్లు రీషెడ్యూల్ చేశారు. తీరా కరెంటు వచ్చిందని ఇంటర్వ్యూ అటెండ్ అయితే మధ్యలో మళ్లీ పోయింది. అసలు రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్య మీకు అర్థమవుతుందా’ అని మంత్రి లోకేశ్‌ను ట్యాగ్ చేస్తూ ఎరెన్ చౌదరి పేరుతో ఉన్న ఒక ఖాతా నుంచి పోస్టు చేశారు. ఆన్‌లైన్ ఇంటర్వ్యూకు హాజరయ్యే వారు ల్యాప్‌టాప్‌ను పూర్తిగా చార్జింగ్ పెట్టుకోవడంతో పాటు ఇంటర్నెట్ డాంగిల్ వంటివి ఏర్పాటు చేసుకుంటారు. అయితే కరెంటు పోవడం వల్లే రాష్ట్రంలో నిరుద్యోగం పెరిగిపోతుందన్న స్థాయిలో పోస్టు పెట్టిన సదరు నిరుద్యోగి రాష్ట్రంలో అసలు కరెంటు కోతలే లేవన్న విషయాన్ని విస్మరించి మరీ రెచ్చిపోవడం విశేషం. మరోవైపు విజయవాడలో గంటల కొద్దీ కరెంటు పోవడం వల్ల డెలివరీలో జాప్యం జరిగిందని, తమ బేబీకి ఏమన్నా అయితే తాను చనిపోవాల్సిందేనంటూ పెట్టిన పోస్టు ఫేక్ ప్రచారానికి పరాకాష్ఠగా నిలిచింది. వాస్తవానికి ప్రభుత్వాస్పత్రులతో పాటు ప్రైవేటు ఆస్పత్రుల్లో అన్నిచోట్లా జనరేటర్లు ఉంటున్నాయి. అత్యవసర సమయాల్లో కోతలు ఉన్నా ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీనికి భిన్నంగా బెజవాడలో ఉదయం పోయిన కరెంటు సాయంత్రం వరకు రాలేదని, దానివల్ల డెలివరీ నిలిచిపోయిందని పోస్టు పెట్టడం వైసీపీ సైకోలకే చెల్లింది.

బురద చల్లడమే లక్ష్యం

చినుకు పడినప్పుడల్లా రాజధాని అమరావతి ప్రాంతం ముంపుబారిన పడిందంటూ వైసీపీ తప్పుడు ప్రచారాలు చేస్తోంది. పులివెందుల జెడ్పీటీసీ ఉపఎన్నికల సమయంలో పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఎన్నికల వీడియోలను తీసుకొచ్చి రిగ్గింగ్ జరిగిందంటూ వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు రచ్చచేశారు. దివ్యాంగుల పింఛన్లలో అర్హులను తొలగించేస్తున్నారని ప్రజలను రెచ్చగొట్టేందుకు సిద్ధపడ్డారు. తల్లికి వందనం, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ పథకాల విషయంలోనూ వైసీపీ తప్పుడు ప్రచారాలకు తెగబడింది.

టీటీడీపై విషం!

- అలిపిరి వద్ద పడేసిన పాడైన విగ్రహం చూపి శ్రీమహావిష్ణువుకు అపచారమంటూ ఆరోపణలు
- అది పాడైన శనైశ్చరుడి విగ్రహం: స్థపతి కుమారుడు
- టీటీడీ ఫిర్యాదుతో భూమనపై ఎఫ్ఐఆర్ నమోదు



అలిపిరి పాత చెక్‌పోస్టు వద్ద విగ్రహాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

తిరుపతి/తిరుమల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): టీటీడీపై వైసీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డి మరోసారి తీవ్ర ఆరోపణలు గుప్పించారు. తిరుపతిలోని అలిపిరి పాత చెక్‌పోస్టు సమీపంలో పాడైపోవడంతో పక్కన పడేసిన ఓ విగ్రహం పేరిట దుష్ప్రచారానికి తెరతీశారు. మంగళవారం ఉదయం ఆయన ఆ విగ్రహాన్ని వీడియో తీసి ‘శ్రీ మహావిష్ణువు విగ్రహానికి ఘోర అపచారం జరిగింది’ అని ఆరోపిస్తూ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీనిపై మధ్యాహ్నం జరిగిన టీటీడీ పాలకమండలి సమావేశంలో బోర్డు తీవ్రంగా స్పందించింది. టీటీడీపై తప్పుడు ప్రచారాలు చేసేవారిపై క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని చైర్మన్ బీఆర్ నాయుడు, సభ్యులు హెచ్చరించారు. కాగా, టీటీడీపై దుష్ప్రచారం చేస్తూ హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్నారంటూ టీటీడీ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోవిందరాజులు చేసిన ఫిర్యాదు మేరకు భూమనపై అలిపిరి పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ సమాచారంతో భూమన మరో వీడియో విడుదల చేశారు. శనైశ్చరుడి విగ్రహానికి శంఖు చక్రాలు ఎందుకుంటాయని, దాన్ని ఎవరో తెచ్చి పడేస్తే తీసివేయాల్సిన బాధ్యత టీటీడీకి లేదా అని ప్రశ్నించారు. కాగా, భూమన ఆరోపణలను ఏపీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం తీవ్రంగా ఖండించింది. అసత్య ప్రచారాలతో భక్తుల మనోభావాలను దెబ్బతీసే వారిపై చట్ట పరమైన చర్యలు తప్పవంటూ హెచ్చరించింది. కాగా, అలిపిరిలోని విగ్రహంపై స్థపతి కన్నయ్య చారి కుమారుడు గురుస్వామి స్పష్టత ఇచ్చారు. దాదాపు 22 ఏళ్ల క్రితం తమకు రాయల చెరువు రోడ్డులో విగ్రహాల తయారీ షెడ్డు ఉండేదని చెప్పారు. అప్పట్లో బెంగళూరుకు చెందిన ఓ వ్యక్తి తమకు శనైశ్చరుడి విగ్రహం కోసం ఆర్డర్ ఇచ్చారని తెలిపారు. తర్వాత అతను చనిపోయాడని వెల్లడించాడు. తమ పరిస్థితి బాలేకపోవడంతో అలిపిరిలోని శిల్పా క్వార్టర్స్‌కు వెళ్లామని తెలిపారు. 2003లో అలిపిరిలో బాంబు పేలుడు నేపథ్యంలో తమను అక్కడినుంచి ఖాళీ చేయించారని, ఆ సమయంలో చిన్న విగ్రహాలు తీసుకొని, భారీ శనైశ్చరుడి విగ్రహాన్ని అక్కడే వదిలేశామని వివరించారు. 22 ఏళ్లుగా ఈ విగ్రహం అక్కడే ఉందని గురుస్వామి వివరించారు.

అమరావతిలో

తెలుగు అధ్యయన కేంద్రం

తెలుగు వైభవం పేరుతో ఎన్టీఆర్ విగ్రహం.. ఎన్టీఆర్‌కు భారతరత్న కోసం కృషి చేస్తాం

- సంక్షేమ కార్యక్రమాలకు ఆద్యుడు ఎన్టీఆర్
- ‘సజీవ చరిత్ర’ పుస్తకావిష్కరణ సభలో సీఎం చంద్రబాబు



‘సజీవ చరిత్ర’ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎన్టీఆర్ కుమారుడు రామకృష్ణ, టీడీపీ నాయకుడు టీడీ జనార్దన్ తదితరులు

అమరావతి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ‘భాష, జాతిపై అభిమానం ఉన్న వ్యక్తి ఎన్టీఆర్. ఆయన స్మారకార్థం అమరావతిలో తెలుగు అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాం’ అని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. మైసూర్‌లో ఉన్న తెలుగు అధ్యయన కేంద్రాన్ని తాత్కాలికంగా నెల్లూరులోని స్వర్ణభారత్ ట్రస్టులో ఏర్పాటు చేశారని, వెంకయ్యనాయుడు అనుమతిస్తే దాన్ని అమరావతిలో ఏర్పాటు చేస్తామని అన్నారు. 1984 ఆగస్టు సంక్షోభానికి అక్షరరూపం ఇస్తూ రూపొందించిన ‘సజీవ చరిత్ర-1984 ప్రజాస్వామ్య పరిరక్షణోద్యమం’ పుస్తకావిష్కరణ కృష్ణా జిల్లా పోరంకిలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ‘సరిగ్గా 41 ఏళ్ల కిందట జరిగిన ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమాన్ని గుర్తు చేసుకుంటే ప్రజాబలం ఎంత గొప్పదో అర్థమవుతుంది. దేశ రాజకీయాల్లో 1983 ఓ సంచలనమైతే 1984 ఆగస్టు సంక్షోభం... ప్రజాస్వామ్యంలో వర్తమానానికి.. భవిష్యత్తుకు ఓ సందేశంగా నిలిచిపోతుంది. అధికారంలోకి వచ్చిన నెలల్లోనే 1984 ఆగస్టులో నాటి కాంగ్రెస్ చేసిన కుట్రలతో ఎన్టీఆర్ పదవి కోల్పోవాల్సి వచ్చింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి 1984 వరకు 37 సంవత్సరాల్లో కాంగ్రెస్ 26 ప్రభుత్వాలను పడగొడితే ఒక్కరూ తిరిగి గద్దెనెక్కిన దాఖలాలు లేవు. ఎన్టీఆర్ ఒక్కరే ప్రజా పోరాటంతో మళ్లీ గద్దెనెక్కారు. ఆ సమయంలో ఎన్టీఆర్ వైపు ఉన్న 161 మంది ఎమ్మెల్యేలను రక్షించుకోవడం చాలాకీలకంగా మారింది. ఆనాడు కర్ణాటకలోని రామకృష్ణహెగ్డే ప్రభుత్వం అండగా నిలిచింది. నాడు ప్రతిపక్ష పార్టీలన్నీ ఎన్టీఆర్‌కు మద్దతుగా నిలిచాయి. దీంతో 1984 సెప్టెంబరు 16న ఎన్టీఆర్ గద్దెనెక్కారు’ అని వివరించారు.

భారతరత్న వచ్చి తీరుతుంది

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇచ్చే వరకు పోరాడుతానని, అతి త్వరలోనే భారతరత్న రావడం ఖాయమని సీఎం చంద్రబాబు చెప్పారు. “దేశంలో సంక్షేమ కార్యక్రమాలకు ఆద్యుడు ఎన్టీఆర్. ‘ప్రజలే దేవుళ్లు.. సమాజమే దేవాలయం’ అని చెప్పిన ఏకైక రాజకీయ నాయకుడు ఎన్టీఆర్. ఆయన ప్రారంభించిన ఎన్నో సంక్షేమ పథకాలను, సంస్కరణలను నేడు దేశమంతా అమలు చేస్తోంది. నాడు ఎన్టీఆర్ మహిళలకు స్థానిక సంస్థల్లో 9 శాతం రిజర్వేషన్ పెడితే ఈరోజు మోదీ చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా దేశంలోని ప్రతిపక్షాలన్నింటినీ నాడు ఎన్టీఆర్ ఏకతాటిపైకి తీసుకువచ్చారు” అని చంద్రబాబు అన్నారు.

ఆ ఉద్యమాన్ని పాఠ్యాంశంగా పెట్టాలి: వెంకయ్య

సజీవ చరిత్ర పుస్తకాన్ని ఈ తరం తప్పకుండా చదవాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కోరారు. ఎన్టీఆర్ జీవిత చరిత్రను.. ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమాన్ని పాఠ్యాంశంగా చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగు భాష అధ్యయన కేంద్రాన్ని తాత్కాలికంగా నెల్లూరులో ఏర్పాటు చేశామని, దాన్ని అమరావతిలో ఏర్పాటు చేస్తే.. తనకు అభ్యంతరం లేదన్నారు. అయితే ఏపీ ప్రభుత్వం కూడా పరిపాలనను తెలుగులోనే చేయాలని కోరారు.

> ఎన్టీఆర్ అంటే ఉత్తేజం.. ఆవేశం.. రాజకీయ సంచలనం.. తెలుగు వైభవం. అందుకే ఆయన్ను తెలుగు ప్రజలంతా గుర్తుంచుకునేలా అమరావతిలో తెలుగు వైభవం పేరుతో ఎన్టీఆర్ విగ్రహం పెడతాం. అక్కడే తెలుగు భాష అధ్యయన కేంద్రం ఏర్పాటు చేస్తాం.
>
> \- సీఎం చంద్రబాబు
>
> ఇప్పుడు నా వయసు 76 ఏళ్లు. మిగిలిన సమయంలో అమరావతి పూర్తి కావడం... పోలవరం ప్రాజెక్టు నీళ్లు పొలాల్లోకి పారడం చూడాలన్నది నా కోరిక.
>
> \- వెంకయ్యనాయుడు

ఏంచేయాలో చంద్రబాబుకు తెలుసు: త్రిపుర గవర్నర్

‘నాడు ఎన్టీఆర్ గాలిలో.. నాతోపాటు మరో ఇద్దరం బీజేపీ నుంచి గెలిచాం. 1984లో ఎన్టీఆర్‌కు జరిగిన అన్యాయాన్ని సహించలేక ఆయనకు అండగా నిలిచాం. 1984 ఆగస్టు సంక్షోభంలో చంద్రబాబు ఎంత ఓపిగ్గా ఉండేవారో చూశాను. సీఎం అయ్యాక తిరుమలలో నీటి ఎద్దడి నెలకొన్న సమయంలో రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆయన ఎలా వ్యవహరించారో చూశాను’ అని త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎలా వ్యవహరించాలో చంద్రబాబు తెలిసినవిధంగా మరొకరికి తెలియదన్నారు. ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చైర్మన్ టీడీ జనార్దన్ మాట్లాడుతూ.. భారతదేశ రాజకీయ చరిత్రలో ఓ ముఖ్య ఘట్టానికి సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరించుకోవడం గర్వంగా ఉందన్నారు. కమ్యూనిజం.. కేపిటలిజం.. సోషలిజం ఉంది కొత్తగా మీరేం చెబుతారని ఎన్టీఆర్‌ని ప్రశ్నిస్తే ‘నాది హ్యూమనిజం’ అని చెప్పిన మహానుభావుడు ఎన్టీఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, మంత్రులు, ఎమ్మెల్యేలు, నందమూరి రామకృష్ణ పాల్గొన్నారు. అన్న ఎన్టీఆర్ యాప్‌ను చంద్రబాబు ఆవిష్కరించగా, సజీవ చరిత్ర పుస్తకం సాఫ్ట్ కాపీని ఇంద్రసేనారెడ్డి ఆవిష్కరించారు.



సీనియర్ న్యాయవాది బొజ్జా తారకానికి నివాళులర్పిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ జె. సుమతి హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె. చిదంబరం, సీనియర్ న్యాయవాదులు ఎ. సత్యప్రసాద్, వేణుగోపాలరావు తదితరులు

బొజ్జా తారకానికి హైకోర్టు న్యాయమూర్తుల నివాళి

అమరావతి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): సీనియర్ న్యాయవాది బొజ్జా తారాకానికి హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ జె.సుమతి నివాళులర్పించారు. బొజ్జా తారకం 9వ వర్ధంతి సందర్భంగా మంగళవారం హైకోర్టులోని అడ్వొకేట్ అసోసియేషన్ హాలులో సీనియర్ న్యాయవాదులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. బొజ్జా తారకం చిత్రపటానికి న్యాయమూర్తులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా బొజ్జా తారకం అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, సీనియర్ న్యాయవాదులు ఎ.సత్యప్రసాద్, వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

కోడెల అంకితభావం స్ఫూర్తిదాయకం: సీఎం

అమరావతి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మాజీ స్పీకర్, దివంగత కోడెల శివప్రసాద్... పల్నాడులో అణచివేతకు వ్యతిరేకంగా పోరాడారు. ఆ ప్రాంత అభివృద్ధికి కృషి చేశారు’ అని ఏపీ మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఎంఏ షరీఫ్ పేర్కొన్నారు. కోడెల 6వ వర్ధంతిని సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో షరీఫ్‌తోపాటు ఏపీ అగ్రికల్చరల్ మిషన్ వైస్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాసరెడ్డి, హజ్ కమిటీ చైర్మన్ హసన్ భాషా తదితరులు పాల్గొన్నారు. చంద్రబాబు ఎక్స్‌లో స్పందిస్తూ ‘ప్రజాసేవలో చిత్తశుద్ధి, పల్నాడు అభివృద్ధి పట్ల కోడెల అంకితభావం స్ఫూర్తిదాయకం’ అన్నారు.

మద్దతు ధరలపై చర్చకు సిద్ధమా: అచ్చెన్న

అమరావతి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ‘మద్దతు ధరలు, రైతుల గురించి మాట్లాడే అర్హత మాజీ సీఎం జగన్‌కు లేదు. పంట ఉత్పత్తుల ధరలు తగ్గినప్పుడు రైతులను జగన్ ఏం ఆదుకున్నాడో బహిరంగ చర్చకు రావాలి’ అని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సవాల్ చేశారు. ఉల్లి, టమాటా రైతులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఈ మేరకు మంగళవారం మంత్రి ఒక ప్రకటన జారీ చేశారు. ‘ధరలు తగ్గినప్పుడు మద్దతు ధర కల్పించి రైతులకు న్యాయం చేస్తున్నాం. అవసరమైతే ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది. వినియోగదారులకు సరసమైన ధరకు ఉత్పత్తులు అందేలా రాయితీ ఇస్తున్నాం. ఈ ఏడాది డిమాండ్‌కు మించి ఉత్పత్తి వచ్చి.. ఉల్లి ధర పతనమైతే క్వింటా రూ.1,200కు కొనుగోలు చేసి, రైతుబజార్లలో కిలో రూ.15కు అమ్ముతున్నాం. మద్దతు ధర కన్నా తక్కువ పలికితే.. వ్యత్యాస ధరను రైతులకే చెల్లిస్తున్నాం. ఈ ఏడాది ఇప్పటి వరకు 9వేల క్వింటాళ్ల ఉల్లిని రైతుబజార్లకు పంపాం. ధర వ్యత్యాసం కింద 51,268 క్వింటాళ్లు సేకరించాం. బిగ్ బాస్కెట్ వంటి సంస్థల్లో కిలో రూ.34 ఉంటే.. రైతులకు ధర ఎందుకు లేదంటున్న జగన్.. తన హయాంలో ఉల్లి రైతులకు చేసిన మేలు ఏంటో చెప్పగలడా?’ అని మంత్రి ప్రశ్నించారు.

ఎరువుల వినియోగంలో సంస్కరణలు

- కేంద్రానికి రాష్ట్రాల వ్యవసాయ మంత్రుల సూచన

అమరావతి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): సుస్థిర వ్యవసాయానికి ఎరువుల వినియోగంలో సంస్కరణలు అవసరమని పలు రాష్ట్రాల వ్యవసాయ శాఖ మంత్రులు అభిప్రాయపడ్డారు. రబీ యాక్షన్ ప్లాన్-2025పై న్యూఢిల్లీలో రెండో రోజైన మంగళవారం జరిగిన జాతీయ సదస్సులో 16 రాష్ట్రాల వ్యవసాయ మంత్రులు పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాలపై బుక్‌లెట్‌లను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్ ఆవిష్కరించారు. ఏపీ తరుఫున హాజరైన వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు సదస్సులో జరిగిన ప్రధాన చర్చల సారాంశాన్ని మీడియాకు వివరించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ప్రధానంగా యూరియా సరఫరా, వినియోగంపై తక్షణ సంస్కరణలు అవసరమని ఆయా రాష్ట్రాల మంత్రులు చెప్పారు. యూరియా అధిక వాడకం ఆరోగ్యం, పర్యావరణ పరిస్థితులపై ప్రభావం చూపుతుందన్నారు.

పేదింటికి కూటమి వరం!

ఒక్కో ఇంటికి రూ.2.5 లక్షల రాయితీ

- పేదల ఇళ్ల యూనిట్ వ్యయం పెంపు
- పీఎంఏవై 2.0 అమలుకు గ్రీన్‌సిగ్నల్

అమరావతి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ నాణ్యమైన ఇళ్లు కట్టిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గత వైసీపీ ప్రభుత్వం పేదల ఇళ్ల యూనిట్ వ్యయాన్ని రూ.1.80 లక్షలకు కుదించడంతో ఆ ఐదేళ్లూ పేదల ఇళ్ల నిర్మాణ కార్యక్రమం ముందుకు సాగలేదు. పేదల సొంతింటి కల కలగానే మిగిలిపోయింది. దీంతో గత ప్రభుత్వం హయాంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు చేపట్టాలని గృహనిర్మాణశాఖ అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఇదే సమయంలో కేంద్రం తాజాగా ప్రారంభించిన ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై-అర్బన్) 2.0 పథకాన్ని సద్వినియోగం చేసుకుంటూ.. రాష్ట్రంలో కొత్తగా మంజూరు చేసే ఇళ్లకు యూనిట్ వ్యయాన్ని రూ.2.50 లక్షలకు పెంచారు. ఇందులో కేంద్ర రాయితీ వాటా గతంలో మాదిరిగానే రూ.1.50 లక్షలు కాగా.. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద మరో లక్ష రూపాయలు జత చేసింది. దీనికి అదనంగా ఉపాధి హామీ పథకం కింద లబ్ధిదారులకు 90 రోజులకు రూ.39 వేల కన్వర్జెన్స్ నిధులు జమ కానున్నాయి. దీంతో దాదాపుగా లబ్ధిదారులకు రూ.2.90 లక్షల వరకు ప్రభుత్వ రాయితీగా లభించనుంది. ఇంటిని పూర్తి చేయడానికి ఇంకా అవసరమయ్యే నిధులను లబ్ధిదారులు భరించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో పీఎంఏవై-అర్బన్ 2.0 అమలుకు రాష్ట్ర ప్రభుత్వం.. కేంద్రంతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) చేసుకుంది. దీంతో కేంద్ర ప్రభుత్వం పీఎంఏవై 2.0 పథకం కింద రాష్ట్రానికి తొలివిడతగా 40,410 ఇళ్లు మంజూరు మంజూరు చేసింది. మొత్తం రూ.1010.25 కోట్లతో ఈ ప్రాజెక్టు అమలుకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2029 నాటికి రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికీ నాణ్యమైన పక్కా ఇల్లు కట్టించి ఇచ్చే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

అంతా లేడీస్... లేడీస్ అంటారు..!

- మగాళ్లకు వంటలు నేర్చుకోవడానికి శిక్షణ తరగతులు పెట్టండి
- వాళ్లు అసెంబ్లీకి పోతే.. మేం వంటైనా చేస్తాం
- మహిళా బిల్లుపై వైసీపీ నేత ఎస్వీ వెటకారం

ఆదోని రూరల్/కర్నూలు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో మహిళా రిజర్వేషన్‌పై కర్నూలు జిల్లా వైసీపీ అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి వెటకారంగా స్పందించారు. వైసీపీ నేతలు ఆదోని వైద్య కళాశాల పరిశీలనకు వెళ్లారు. ఆ సందర్భంగా మహిళా బిల్లుపై ఎస్వీ మాట్లాడుతూ, ‘రేపు ఎమ్మెల్యే ఎన్నికల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్లు వస్తే ఎవరుఎగురుతారో..? ఎవరుంటారో..! అంతా లేడీస్... లేడీస్ అంటున్నారు. మాకు ఒక పని చేయండి. వంట నేర్చుకోవడానికి మగవాళ్లకు ట్రైనింగ్ క్లాసులు పెట్టండి. వంటైనా నేర్చుకుంటాం. వాళ్లు(మహిళలు) అసెంబ్లీకి పోతే, మేము వంటైనా చేసుకుంటాం’ అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఈ మొత్తం సంభాషణలో ఎస్వీ మోహన్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్ తదితరులు ఉన్నారు. వారెవ్వరూ ఎస్వీ మాటలను ఖండించలేదు. ఈ సంభాషణ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై టీడీపీ దాని మిత్ర పక్షాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. వైసీపీ నేతలకు ఆది నుంచీ మహిళలంటే చులకనేనంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వివేకా హత్య కేసులో తదుపరి దర్యాప్తునకు సిద్ధం!

(మొదటి పేజీ తరువాయి)

జరిపింది. సునీత తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా, సీబీఐ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపించారు.

తదుపరి దర్యాప్తు అవసరం: లూథ్రా

వివేకా హత్య కేసులో అసలు దోషులెవరో తేలాలంటే తదుపరి దర్యాప్తు అవసరమని లూథ్రా విజ్ఞప్తి చేశారు. అత్యంత దారుణ హత్యను గుండెపోటుగా చిత్రీకరించారని, నెత్తుటి మరకలు చెరిపేశారని, సాక్ష్యాలను ధ్వంసం చేశారని, అసలు కుట్రకోణాన్ని సీబీఐ విస్మరించిందని తెలిపారు. ట్రయల్ కోర్టు తమ పిటిషన్‌ను సరిగా విచారించలేదని, అందుకే సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు. అదనపు సొలిసిటర్ జనరల్ కలుగజేసుకుని.. గతంలో న్యాయస్థానం ఆదేశాలతోనే దర్యాప్తును ముగించామని తెలిపారు. మరింత దర్యాప్తు అవసరమని న్యాయస్థానం ఆదేశిస్తే.. తాము సిద్ధమేనని తెలిపారు. దీనికి నిందితుల తరఫు సీనియర్ న్యాయవాదులు అభ్యంతరం తెలిపారు. ఇప్పటికే 13లక్షల పేజీల చార్జిషీట్లు ఉన్నాయని, ఇప్పుడు మళ్లీ దర్యాప్తు అంటే విచారణను మరింత జాప్యం చేయడమేనని అన్నారు. ఇరుపక్షాల వాదనల అనంతరం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ‘ఈ కేసులోకి మనం ఇంకెన్నిసార్లు వెళ్లగలం? ఇప్పటికే ఎన్నో చార్జిషీట్లు, ఎన్నో పిటిషన్లు.. ప్రతి చార్జిషీటును, ప్రతి పిటిషన్‌నూ పరిశీలించడం సాధ్యమేనా? ఇదే కొనసాగితే విచారణ పూర్తికావడానికి దశాబ్దకాలం పట్టేలా ఉంది’ అని జస్టిస్ సుందరేశ్ అసహనం వ్యక్తం చేశారు. అయితే సీబీఐ తదుపరి దర్యాప్తు అవసరమా లేదా అనే అంశంపై ట్రయల్ కోర్టునే ఆశ్రయించాలని సునీతకు సూచించింది. రెండువారాల్లో పిటిషన్ దాఖలు చేయాలని, 8వారాల్లో సీబీఐ కోర్టు నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఇతర పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయన్న అంశంతో ప్రభావితం కాకుండా.. యోగ్యత ఆధారంగానే పిటిషన్‌పై నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ కేసులో కీలక నిందితుడు అవినాశ్‌రెడ్డి సహా నిందితుల బెయిల్ రద్దు పిటిషన్ల కొట్టివేతకు మాత్రం సుప్రీంకోర్టు నిరాకరించింది. వాటిపై విచారణను పెండింగ్‌లో ఉంచింది.

మద్యం కేసులో కసిరెడ్డి, చెవిరెడ్డి మళ్లీ బెయిలు పిటిషన్లు

విజయవాడ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో నిందితులుగా ఉన్న కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఏసీబీ కోర్టులో మంగళవారం బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. ప్రస్తుతం ఈ నిందితులు ఇద్దరు విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి వైద్యం చేయించుకోవడానికి బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. చెవిరెడ్డి మాత్రం తనకు డిఫాల్ట్ బెయిల్ ఇవ్వాలని పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లను కోర్టు 18వ తేదీకి వాయిదా వేసింది. ఇదే కేసులో రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ఉన్న ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి దాఖలు చేసిన బెయిలుపై విచారణ 19కి వాయిదా పడింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.